www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 16-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 91 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 8.34 తదుపరి ఏకాదశి; నక్షత్రం: విశాఖ రా. 2.14 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ. 6.30-8.13; దుర్ముహూర్తం: ఉ. 8.28-9.20, రా. 10.26-11.08; అమృతఘడియలు: సా. 4.47-6.30; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.53; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తే
అదే వారికి చివరి రోజు



నేరగాళ్లకు పార్టీ, కులం ఉండవు.. ప్రత్యేక కోర్టులు ఏర్పాటుచేసి శిక్షిస్తాం

ముచ్చుమర్రి, విజయనగరం అత్యాచార బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

బాలిక కుటుంబానికి 10 లక్షల పరిహారం.. 6 నెలల పసికందు పేరిట 5 లక్షల ఎఫ్‌డీ

గంజాయి, మద్యం మత్తులోనే ఈ ఘటనలు: హోంమంత్రి వంగలపూడి అనిత

ఈ ఘటనలపై సీఎం చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారని వెల్లడి 3

ఎవర్నీ వదలం

ఆకాశమే హద్దుగా వైసీపీ నేతల దోపిడీ

భూముల్లో 35,576 కోట్లు.. గనుల్లో 19,137 కోట్లు దోచారు: సీఎం

యథేచ్ఛగా సహజ వనరుల లూటీ

ఎర్రచందనం కోసం అడవులు ఖాళీ

ప్రజల ఇళ్ల స్థలాల పేరుతో నొక్కుడు

పేదల అసైన్డ్ భూములూ లాక్కున్నారు

టైటిల్ చట్టంతో దోచాలనుకున్నారు

ప్రతిదానిపైనా విచారణ ఉంటుంది

గుజరాత్ తరహాలో భూకబ్జా నిరోధకచట్టం

మీ భూమి మీ పేరిట ఉందో? లేదో చూసుకోండి

వైసీపీ నేతల దౌర్జన్యాలతో భూములు, మైన్ లీజులు కోల్పోయినవారు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయండి

ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తాం

మీ భూములు, గనుల లీజులు తిరిగి ఇప్పిస్తాం

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా

భూములు, గనులు, అటవీ సంపదపై శ్వేతపత్రం



సోమవారం భూములు, గనులు, అటవీ సంపదపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సీఎం చంద్రబాబు

వైసీపీ నాయకులు ఆకాశమే హద్దుగా సహజ వనరులైన భూములు, ఖనిజాలు, అటవీ సంపదను దోచుకుతిన్నారు. సహజ వనరులను దోచుకున్నవారిని, ప్రజల భూములను లాక్కున్న ఏ ఒక్కరినీ ప్రభుత్వం వదిలిపెట్టదు. ప్రతి అన్యాయంపైనా విచారణ జరిపిస్తాం. దోషులు ఎంతటివారైనా చట్టం పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటాం. - చంద్రబాబు

11

పెద్దిరెడ్డి దోపిడీ చాలా పెద్దది

అటవీ, గనుల శాఖల్లో భారీ అవినీతి

కీలక శాఖల్లో డిప్యుటేషన్ అధికారులు

వనరుల దోపిడీకి కొత్త పంథా పెట్టారు

పోలవరం మట్టిలో 800 కోట్లు దోచేశారు

జగన్ వనరుల దోపిడీపై చంద్రబాబు ఫైర్

ఈ వారంలో మరో మూడు శ్వేతపత్రాలు

జీపీఎస్ జీవోకు బ్రేక్

జారీ తీరుపైనా విచారణ

జగన్ వివాదాస్పద జీవోపై బాబు సర్కారు తీవ్ర ఆగ్రహం

లక్షల మంది ఉద్యోగులకు సాంత్వన

సీఎం నిర్ణయంపై సంఘాల హర్షం

రేపటి నుంచి తలపెట్టిన నిరసన వాయిదా

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నించిన గ్యారెంటీ పింఛన్ సిస్టమ్(జీపీఎస్)కు బ్రేకులు పడ్డాయి. లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సంకటంగా పరిణమించిన జీపీఎస్ అమలును నిలిపివేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. అసలు ఈ జీవో జారీ చేయడానికి దారితీసిన పరిస్థితులపైనా విచారణ చేయాలని నిర్ణయించింది. ఇటీవల జీపీఎస్ విధానాన్ని పాత తేదీతో అమల్లోకి తెస్తున్నట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఇచ్చింది. ఈ విషయం తెలియడంతో సదరు జీవోను తక్షణం నిలిపివేయాలని సీఎం చంద్రబాబు ఆర్థిక శాఖను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ పాత ప్రభుత్వ ప్రతిపాదనలతో

మిగతా 12వ పేజీలో...





జగన్ 'రివర్స్'
చెల్లదు!

పోలవరం రివర్స్ టెండరింగ్‌కు కేబినెట్ ఆమోదం లేదు

జగన్మోహన్‌రెడ్డి తన పాలనా కాలంలో సాగించిన చీకటి దందాలో మరో కొత్త కోణం. పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేసిన 'రివర్స్ టెండరింగ్' విధానానికి మంత్రివర్గం ఆమోదం లేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. కేబినెట్ కళ్లు గప్పి తాడేపల్లి ప్యాలెస్ సొంత నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమైంది. ప్రభుత్వం ఏదైనా విధాన నిర్ణయం తీసుకుంటే.. దానిని మంత్రివర్గంలో చర్చించి.. దాని ఆమోదం తీసుకుని అమల్లోకి తేవాలి. కానీ జగన్ ఆర్భాటంగా తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్‌కు కేబినెట్ ఆమోదం లేదని.. అందుకే ఇది చట్టబద్ధమైనది కాదని న్యాయ నిపుణులు అంటున్నారు. మంత్రివర్గ ఆమోదం లేని ఈ పాలసీ కింద.. పోలవరం ప్రాజెక్టు పనులు, హైడల్ పవర్ ప్రాజెక్టు పనుల అప్పగింత కూడా చెల్లుబాటు కాదని పేర్కొంటున్నారు.

విమర్శలు వెల్లువెత్తడంతో ఉత్తుత్తి సమీక్ష

ఆర్థిక శాఖ అంగీకారంతో సరిపెట్టిన వైనం

మేఘాకు పనులు కట్టబెట్టిన ఏడాది తర్వాత తీరిగ్గా ఆ శాఖ నుంచి మార్గదర్శకాలు

ఆ పనుల అప్పగింత చెల్లుబాటు కాదు!

సరికొత్త న్యాయ చిక్కులపై సర్వత్రా కలవరం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వంద కోట్ల రూపాయల విలువ దాటి ప్రభుత్వం చేపట్టే ప్రతి పనికీ రివర్స్ టెండర్ విధానం అమలు చేయాలంటూ 2019 ఆగస్టు 16వ తేదీన రాష్ట్ర జల వనరుల శాఖ జీవో 67 జారీ చేసింది. తర్వాత అదేదారిలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కూడా ఆ ఏడాది అక్టోబరు 16వ తేదీన జీవో 272 ఇచ్చింది. అనంతరం దాదాపు ఏడాదికి 2020 ఆగస్టు 25వ తేదీన.. ఇదే రివర్స్ విధానానికి సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలతో ఆర్థిక శాఖ జీవో 79 జారీచేయడం విశేషం. పోలవరం ప్రాజెక్టులో

మిగతా 12వ పేజీలో...

భూముల రీసర్వే నిలిపివేస్తాం



నాడు అక్రమాలకు నెలవుగా ఆ ప్రక్రియ

రైతులు కోరితే అవసరాన్ని బట్టి సర్వే

ఆనాటి తప్పులు సరిదిద్ది న్యాయం చేస్తాం

982 ఎకరాలపై ఇనాం ఉత్తర్వులు రద్దు

సర్కారు ఆ భూమి జప్తు చేసుకుంటుంది

మాజీ సీఎస్ బంధువుల భూకొనుగోళ్లను పరిశీలిస్తాం

జగన్ పాలనలోని దురాగతాలకు 5 కోట్ల ప్రజలే ప్రత్యక్ష సాక్షులు: సీఎం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రైతులు, భూ యజమానుల ప్రమేయం లేకుండా నాడు జగన్ సర్కారు చేపట్టిన భూముల సమగ్ర సర్వేను నిలిపివేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. భూసర్వే అనంతరం రూపొందించిన రెవెన్యూ రికార్డుల్లో లెక్కపెట్టలేనన్ని తప్పులు వచ్చాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రీసర్వేకు మూలమైన టైటిల్ చట్టాన్ని రద్దుచేశామని, రైతులకు తప్పుడు భూ రికార్డులు

మిగతా 11వ పేజీలో...



ఇసుక తవ్వకాలపై గత నివేదికలను పునఃపరిశీలించాలి

అక్రమాలు జరగలేదని అధికారులు నివేదించారు

మీడియాలో ఇందుకు విరుద్ధంగా కథనాలు

సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం వెల్లడి 12

2లోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశం

ముసురేసింది



సోమవారం సాయంత్రం విశాఖలో చినుకుల సవ్వడి

రోజంతా జల్లులు.. అక్కడక్కడ భారీ వర్షాలు

బంగాళాఖాతంలో అల్పపీడనం.. 19న మరోటి

రేపటి నుంచి పెరగనున్న వానలు

అమరావతి, విశాఖపట్నం, విజయవాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ముసురేసింది. అనేక ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా జల్లులు కురుస్తూనే ఉన్నాయి. అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇది రెండో అల్పపీడనం. పశ్చిమ బెంగాల్, ఒడిశా తీరాలకు ఆనుకుని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇంకా సంబల్‌పూర్, పూరీ మీదుగా వాయవ్య బంగాళాఖాతం వరకు

మిగతా 3 పేజీలో...

ఓటమిని ఎదుర్కోవడం
చాలా కష్టం

వైసీపీకి 11 సీట్లు వస్తే అసెంబ్లీకే రావడం లేదు: పవన్

పరాజయాలను తట్టుకుని నిలబడ్డాం.. మరొకరైతే పార్టీని వదిలేసేవారు

పోటీచేసిన 21 చోట్లా గెలవడం భేష్

100% స్ట్రైక్ రేటుపై అంతటా చర్చ

అంబానీ కుమారుడి పెళ్లిలోనూ ఇదెలా సాధ్యమైందని అడిగారు

వైసీపీ పాలనలో భయంతో బతికారు

రోడ్లపైకి వచ్చే పరిస్థితి కూడా లేదు

సొంత ఎంపీనే బంధించి హింసించారు

చివరికి చంద్రబాబునూ జైల్లో పెట్టారు

వైసీపీ నేతలు మనకు శత్రువులు కాదు

రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే

వ్యక్తిగత దాడులు కరెక్టు కాదు

టీడీపీ, బీజేపీ నేతలను తగ్గించి మాట్లాడొద్దు.. నేతలకు పవన్ సూచన

పార్టీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కారం

నేను లేకపోతే పార్టీ లేదనుకునే తత్వం వీడాలి. ఎవరు లేకపోయినా జనసేన ప్రయాణం ఆగిపోదు. కాలం చాలా గొప్పది. మాకంటే గొప్పవారు ఎవరూ లేరనుకున్న వారినే 11 సీట్లకు పరిమితం చేసింది. క్రమశిక్షణారాహిత్యంతో నాకు లేనిపోని తలనొప్పులు తీసుకురావొద్దు.

పదవి ఉన్నా లేకున్నా కడవరకూ ప్రజల కోసం పని చేయాలన్న తపనతోనే రాజకీయాలు మొదలు పెట్టాను. ఈ ప్రయాణంలో మొన్నటివరకూ అధికారం చూడలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కీలకమైన శాఖలు తీసుకున్నాం. ఆ శాఖల్లో తగిన విధివిధానాలు నిర్ణయించి వాటిని పటిష్ఠంగా తీర్చిదిద్దుతా.

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల కిందటి పరాజయం తర్వాత ఎన్నో దెబ్బలు తట్టుకుని ఇంత దూరం ప్రయాణించడం సాధారణ విషయం కాదని జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మరొకరైతే పార్టీని అప్పుడే వదిలేసేవారని చెప్పారు. గత పాలక పక్షానికి ఇప్పుడు 11 సీట్లు రాగానే అసెంబ్లీకి కూడా రాకుండా ఉండిపోయారని.. అంటే ఓటమిని తట్టుకోవడం అంత సులభం కాదని వ్యాఖ్యానించారు. సోమవారమిక్కడ తమ పార్టీ ప్రధాన కార్యాలయంలో జనసేన తరఫున మొన్నటి ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీని ఆయన ఆత్మీయంగా

మిగతా 3వ పేజీలో...



12

సాయిరెడ్డి నోటి దురుసు

జర్నలిస్టులపై తిట్ల పురాణం

వాడు, వీడు అంటూ అసభ్యకర భాష

పెద్దల సభలో సభ్యుడిననేదీ మరిచిపోయి దిగజారుడు వ్యాఖ్యలు

ఆరోపణలు చేసింది అధికారిణి భర్త

విమర్శించాలంటే ఆయనను అనాలి

లేదంటే పరువునష్టం దావా వేసుకోవాలి

కానీ, జర్నలిస్టులపై చెలరేగిన సాయిరెడ్డి

సహకారానికి
వైసీపీ కాటు

జగన్ ప్రభుత్వ పడగ నీడన సహకారంలో అవినీతి పురివిప్పింది. ప్రభుత్వ పెద్దలు తమ అనుయాయులతో సహకార సంస్థలను నింపేశారు. రాజకీయం, అధికారం కుమ్మక్కయ్యాయి. యథేచ్ఛగా దోపిడీ సాగింది. వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందంటూ నాడు విపక్ష నేతలు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. తప్పనిసరి కావడంతో తూతూమంత్రంగా చర్యలు తీసుకున్నారు. ఎప్పటిలా అధికార, రాజకీయ తిమింగలాలు ధిలాసాగా తప్పించుకున్నాయి. మళ్లీ అవే పదవుల్లో కొనసాగడానికి ఎవరి స్థాయిల్లో వారు పావులు కదుపుతున్నారు.

అనుయాయులకే పగ్గాలు

వేల కోట్ల కుంభకోణం ఆరోపణలు

ఫిర్యాదులపై తూతూ మంత్రపు విచారణలు

ఇష్టారాజ్యంగా దిగువస్థాయి నియామకాలు

భారంగా మారిన పనికిరాని గోడౌన్లు

నష్టాల్లో కూరుకుపోయిన 848 పీఏసీఎస్‌లు

6,565.32 లక్షల గడువు తీరిన బకాయిలు

ఏడేళ్లుగా ఎన్నికలు లేకపోవడమే కారణం?

కూటమి ప్రభుత్వం దృష్టి సారించకుంటే నష్టమే



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సహకార రంగం గత ఐదేళ్లలో ఛిన్నాభిన్నమైంది. పాలకులు తమ తప్పుల్ని కప్పిపుచ్చుకునేందుకు అక్రమాలకు బాధ్యులైన అధికారులకు కూడా పదోన్నతులు కల్పించారు. సహకార సంస్థల్లో కుంభకోణాలపై విపక్ష నేతలు ఫిర్యాదు చేసినా విచారణల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేసింది. సహకార సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు

మిగతా 11వ పేజీలో...

ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు.. పార్టీపై నిషేధం!



దేశద్రోహం కేసూ నమోదు చేయనున్న పాక్ సర్కారు

ఇస్లామాబాద్, జూలై 15: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు కోర్టుల్లో ఉపశమనం లభిస్తున్నప్పటికీ, ఆయనకు జైలు కష్టాలు తొలగడం లేదు. కార్ప్స్ కమాండర్ హౌస్‌పై దాడి, మే 9 అల్లర్లు సహా మొత్తం 12 కేసుల్లో తాజాగా ఆయనను లాహోర్ పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఇమ్రాన్ నేతృత్వంలోని పీటీఐ(పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్) పార్టీని నిషేధించనున్నట్టు పాక్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. అలాగే, దేశద్రోహానికి పాల్పడినందుకు ఇమ్రాన్‌తోపాటు, ఇద్దరు పీటీఐ సీనియర్ నేతలపై కేసులు నమోదు చేయనున్నట్టు వివరించింది. పాక్ సమాచారశాఖ మంత్రి అతావుల్లా తరర్ సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. పీటీఐని నిషేధించేందుకు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్టు చెప్పారు. అక్రమ పెళ్లి కేసులో ఇమ్రాన్‌ను నిర్దోషిగా జిల్లా కోర్టు ప్రకటించడం, జాతీయ అసెంబ్లీలో రిజర్వు సీట్లు పొందడానికి పీటీఐకి అర్హత ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పీటీఐకి రిజర్వు సీట్లు కేటాయిస్తే ఆ పార్టీ బలం 109కి చేరి, జాతీయ అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా మారే అవకాశం ఉంది. 71 సంవత్సరాల వయసున్న ఇమ్రాన్‌ఖాన్ ప్రస్తుతం రావల్పిండిలోని అదియాలా జైల్లో ఉన్నారు. 2022 ఏప్రిల్‌లో ప్రధాని పదవి కోల్పోయినప్పటి నుంచి ఆయనపై అనేక కేసులు నమోదవుతూనే ఉన్నాయి.

సరైన సమయంలో తల తిప్పాను లేకుంటే.. చనిపోయి ఉండేవాడిని



వాషింగ్టన్, జూలై 15: "సరైన సమయంలో, కాకతాళీయంగా తల తిప్పాను. లేకపోతే చనిపోయి ఉండేవాడిని. దేవుడి దయ, అదృష్టం వల్ల బతికి ఉన్నాను" అని అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. తనపై హత్యాయత్నం తర్వాత తొలిసారి ఆయన న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన భావోద్వేగాన్ని పంచుకొన్నారు. నవంబరు 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తమ అభ్యర్థిని సోమవారం ప్రకటించనుండడంతో.. ఆదివారం మిల్వాకీ బయలుదేరిన ఆయన విమానంలో ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ సమయంలో ఆయన కుడి చెవికి బ్యాండేజీ కట్టు ఉన్నట్లు న్యూయార్క్ పోస్ట్ వెల్లడించింది. కాగా.. ట్రంప్ ఈ ఘటన నుంచి క్షేమంగా బయటపడడం పూరి జగన్నాథుడి కృపేనని ఇస్కాన్ సంస్థ ప్రతినిధి రాధారమణ్‌దాస్ అభిప్రాయపడ్డారు. మరోవైపు.. ట్రంప్‌పై హత్యాయత్నం చేసిన దుండగుడు థామస్ మాథ్యూ క్రూక్స్(20) ఫొటోలను ఎఫ్‌బీఐ విడుదల చేసింది.

డ్రగ్స్ వినియోగదారుల్లో.. రకుల్‌ప్రీత్ సింగ్ తమ్ముడు

- డ్రగ్స్ కింగ్‌పిన్ నైజీరియా మహిళ
- హైదరాబాద్‌లో ఆట కట్టించిన టీజీ న్యాబ్

హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటి రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్ తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్)కు చిక్కాడు. హైదరాబాద్ హైదర్షాకోట్‌లోని విశాఖనగర్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా ఉన్నట్లు సమాచారం అందుకున్న టీజీ న్యాబ్ అధికారులు.. సైబరాబాద్ పోలీసులతో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో.. అమన్ ప్రీత్‌సింగ్ సహా.. 13 మంది వినియోగదారులు పట్టుబడ్డారు. ఇద్దరు నైజీరియన్లు సహా.. ఐదుగురు డ్రగ్స్ స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో 10 మంది పాజిటివ్‌గా తేలగా.. వారిలో అమన్ ప్రీత్‌సింగ్ కొకైన్ తీసుకున్నట్లు తేలిందని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. "నైజీరియాకు చెందిన ఒనూహ బ్లెసింగ్ అలియాస్ జొయానాగోమ్స్ అలియాస్ జో అనే మహిళ డ్రగ్స్ కింగ్‌పిన్ అని గుర్తించాం. ఆమెతోపాటు నైజీరియాకు చెందిన అజీజ్ నోహీమ్ అడెషోలా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన అల్లం సత్యవెంకట గౌతమ్, సానబోయిన వరుణ్‌కుమార్, మహమ్మద్ మహబూబ్ షరీఫ్ వీరి ముఠాలో పెడ్లర్లుగా పనిచేస్తున్నారు. వీరంతా విశాఖనగర్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు ఉప్పందడంతో దాడి చేసి, అరెస్టు చేశాం. వీరి నుంచి రూ.35 లక్షల విలువైన 199 గ్రాముల కొకైన్‌ను సీజ్ చేశాం. ఇదే ముఠాకు చెందిన నైజీరియన్ స్మగ్లర్లు డైవిన్ ఎబుకా అలియాస్ ఇమాన్యుయెల్, ఎజియోనిలి ఫ్రాంక్లిన్ అలియాస్ కలేషీ పరారీలో ఉన్నారు" అని డీసీపీ వివరించారు. కింగ్‌పిన్ మహిళ-- జొయానాగోమ్స్ 2017లో భారత్‌కు వచ్చి.. బెంగళూరులో హెయిర్ స్టైలిస్ట్‌గా పనిచేసిందని, ఆ సమయంలోనే ఆమెకు నైజీరియాకు చెందిన డ్రగ్స్ స్మగ్లర్ డైవిన్ ఎబుకాతో పరిచయం ఏర్పడిందని చెప్పారు. 2018 నుంచి ఆమె డ్రగ్స్ సరఫరాలో కీలకంగా మారిందని, నైజీరియా నుంచి డ్రగ్స్ భారత్‌కు చేరగానే.. ఆమె ఢిల్లీ వెళ్లి వాటిని రైలు లేదా విమానంలో తీసుకువచ్చేవారని పోలీసులు గుర్తించారు. "జొయానాగోమ్స్ తన పాస్‌పోర్టును దాచి, మారు పేరుతో పశ్చిమ ఆఫ్రికా పాస్‌పోర్టు సంపాదించి, గినీబిసావు అనే పేరుతో భారత్‌లో చలామణి అయ్యింది. మరో నిందితుడు అజీజ్ నోహీమ్ 2014లో విద్యార్థి వీసాపై హైదరాబాద్‌కు వచ్చాడు. ఉస్మానియా వర్సిటీలో నకిలీ డీడీ సమర్పించిన కేసులో జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై బయటకు వచ్చాక.. ఎజియోనిలి ఫ్రాంక్లిన్‌తో పరిచయం ఏర్పడడంతో డ్రగ్స్ పెడ్లర్‌గా మారాడు" అని డీసీపీ వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన గౌతమ్, వరుణ్, షరీఫ్‌లు డ్రగ్స్ సరఫరాలో కీలకంగా వ్యవహరించారని చెప్పారు.

అప్పుడు రకుల్... ఇప్పుడు సోదరుడు!

రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు ప్రస్తుతానికి కస్టమరేనని తాము గుర్తించినట్లు టీజీ న్యాబ్ పోలీసులు తెలిపారు. అతడు నిజంగానే కస్టమరా? లేక డ్రగ్స్ సప్లయరా? అనేది దర్యాప్తులో తేలుతుందని వ్యాఖ్యానించారు. గతంలో డ్రగ్స్ కేసులో రకుల్ ప్రీత్‌సింగ్ పేరు బయటపడిన నేపథ్యంలో.. ఇప్పుడు అమన్ పోలీసులకు పట్టుబడడం సినీ ఇండస్ట్రీలో మరోమారు చర్చనీయాంశమైంది. అప్పట్లో రకుల్ ఈడీ విచారణను సైతం ఎదుర్కొన్నారు.

ఈ కేసులో పరారీలో ఉన్న నైజీరియన్ స్మగ్లర్లు డైవిన్ ఎబుకా, ఎజియోనిలి ఫ్రాంక్లిన్‌ను పట్టిచ్చినా.. వారి జాడ తెలిపినా రూ.4 లక్షల నజరానాను టీజీ న్యాబ్ ప్రకటించిందని డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. పరారీలో ఉన్న ఒక్కో నిందితుడిపై రూ.2 లక్షల రివార్డు ఉన్నట్లు వివరించారు. వీరికి సంబంధించిన సమాచారం తెలిస్తే.. +91 8712671111 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు.

గదిలో బంధించి కొడితే పిల్లి కూడా పులిలా తిరగబడుతుందని సామెత! అవసరం నూతన ఆవిష్కరణలకు మూలం.. అని మరో సామెత!! పిచుక మీద బ్రహ్మాస్త్రంలా తనపై దండయాత్రకు దిగిన రష్యాపై యుద్ధంలో.. ఉక్రెయిన్ ఈ రెండు సామెతలనూ నిజం చేస్తోంది! భారీ సాధన సంపత్తి ఉన్న అంత పెద్ద అగ్రరాజ్యాన్ని.. ఉక్రెయిన్ డ్రోన్, ఏఐ టెక్నాలజీల సాయంతో నిలువరించగలుగుతోంది. యుద్ధరంగంలో తన సైనికుల ప్రాణాలు పోకుండా కాపాడుకోవడానికి 'ఆటోమేటెడ్ ఆర్మీ'తో శాయశక్తులా పోరాడుతోంది. ఏ యుద్ధంలోనైనా త్రివిధ దళాలు ఉంటాయి. ల్యాండ్ డ్రోన్లు, ఉక్రెయిన్‌లో ఆ మూడు దళాలకూ దన్నుగా నిలుస్తున్న నాలుగో దళంలా మారిందీ ఆటోమేటెడ్ ఆర్మీ!!



మినీ యుద్ధట్యాంకు

కేబుల్ టైతో డ్రోన్‌కు బాంబును అమర్చుతున్న సైనికుడు

టెక్నాలజీతో కొడుతోంది!

'ఆటోమేటెడ్ ఆర్మీ'తో రష్యాను సమర్థంగా ఢీకొంటున్న ఉక్రెయిన్

- ఆ దేశంలో రెండేళ్లలో వెలసిన డిఫెన్స్ స్టార్టప్‌ల సంఖ్య 250కిపైనే!
- గ్రౌండ్ డ్రోన్లు, ఏఐతో పనిచేసే ఆయుధాల తయారీలో నిమగ్నం
- సామాన్యులూ డ్రోన్ల తయారీ నేర్చుకోవాలంటున్న ఆ దేశ ఉపప్రధాని

డ్రోన్లంటే.. మానవ రహిత విమానాలని మనకు తెలుసు! ఒక చిన్నపాటి యుద్ధట్యాంకును కూడా అలా డ్రోన్‌లాగానే శత్రువుల సమీపానికి తీసుకెళ్లి పేల్చేస్తే? దానికో ఆటోమేటెడ్ మెషీన్‌గన్‌ను అమర్చి అల్లంత దూరం నుంచే రిమోట్‌తో కాల్పులు జరపగలిగితే? సూపర్ ఐడియా కదూ! అత్యంత విలువైన తన సైనికుల ప్రాణాలు పోకుండా రష్యాపై యుద్ధాన్ని కొనసాగించడానికి ఉక్రెయిన్ ఇప్పుడు ఇలాంటి కొత్త కొత్త టెక్నాలజీలనే ఆశ్రయిస్తోంది. ఉదాహరణకు.. ఆ దేశానికి చెందిన వీరియ్ అనే డ్రోన్ కంపెనీ 'ఒడిస్సే' పేరుతో.. కారు పరిమాణంలో ఉండే ప్రోటోటైప్ 'అన్‌మ్యాన్‌డ్ గ్రౌండ్ వెహికల్'ను తయారు చేసింది. మినీ యుద్ధట్యాంకు తరహాలో ఉండే ఆ వెహికల్ బరువు 800 కిలోలు. దాని బ్యాటరీని ఒక్కసారి చార్జ్ చేస్తే 30 కిలోమీటర్ల దూరం వెళ్తుంది. కీవ్ శివార్లలోని వ్యవసాయక్షేత్రాల్లో.. వీరియ్ కంపెనీ సీఈవోనే దాన్ని స్వయంగా పరీక్షించారు. ఒడిస్సేపై మెషీన్‌గన్‌ను అమర్చి ఆటోమేటెడ్ దాడులకే కాక.. రిమోట్‌కంట్రోల్‌తో ఆపరేట్ చేస్తూ యుద్ధరంగంలోని సిబ్బందిని కాపాడే రెస్క్యూ అండ్ సప్లై ప్లాట్‌ఫామ్‌గా కూడా వాడుకోవచ్చని వీరియ్ సిబ్బంది తెలిపారు. ఇంతా చేస్తే.. దాని నిర్మాణానికి అయిన ఖర్చు 35 వేల డాలర్లు. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.30 లక్షలు. వీరియ్ కంపెనీ తరహాలో ఆ



ఏఐ ఆటోమేటెడ్ గన్




దేశంలో ఆటోమేటెడ్ ఆయుధాలను తయారు చేసే స్టార్టప్‌లు 250కి పైగా ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉక్రెయిన్‌వ్యాప్తంగా అవి రహస్యంగా ఆటోమేటెడ్ ఆయుధాలను, రష్యన్లపై పోరాడే రోబో ఆర్మీని తయారుచేస్తున్నాయి.

ఆన్‌లైన్ వీడియోలు చూసి..

ఇంతకీ ఉక్రెయిన్ స్టార్టప్ కంపెనీలు వీటిని ఎలా తయారుచేయగలుగుతున్నాయి? అంటే.. డిఫెన్స్ మ్యాగజైన్లు, ఆన్‌లైన్ వీడియోలను చూసి వాటికి తమ ఊహలను జోడించి కొత్తకొత్త ఉత్పత్తులను డిజైన్ చేస్తున్నారు. అది కూడా అందుబాటులో ఉన్న వనరులతో అతి తక్కువ ధరలకే తయారుచేయగలుగుతున్నారు. ఉదాహరణకు.. డ్రోన్ల రెక్కల తయారీకి తేలికపాటి చెక్కను వినియోగించడం, సూపర్ మార్కెట్లలో వాడే 'కేబుల్ టై'లను ఉపయోగించి డ్రోన్లకు మందుగుండు సామగ్రిని కట్టి, సరిహద్దులకు పంపి పేల్చేయడం వంటి విధానాలను పాటిస్తున్నారు. ఇప్పటికే తయారుచేసిన ఆయుధాలను ఇంకా సమర్థంగా ఉపయోగించే విధానాలను అన్వేషిస్తున్నారు. టో ట్రక్కులు, మైన్‌లేయర్లు, డీమైనర్స్.. ఇలా రకరకాల రోబోలను తయారుచేస్తున్నారు. 'ఫస్ట్ పర్సన్ వ్యూ' డ్రోన్లను పెద్ద ఎత్తున తయారుచేస్తున్నారు. వర్చువల్ రియాలిటీ తరహా కళ్లజోళ్లకు అనుసంధానమై ఉండే డ్రోన్లు ఇవి. యుద్ధరంగంలోకి వెళ్లే డ్రోన్‌కు అమర్చిన కెమెరాల ద్వారా.. ఆ ప్రదేశం మొత్తాన్నీ గాగుల్‌ను ధరించిన ఆపరేటర్ చూడగలుగుతాడు. ఎక్కడ దాడి చేయాలో అతడే నిర్ణయించగలుగుతాడు. అలాగే, డేవ్‌డ్రాయిడ్ అనే మరో కంపెనీ.. కదిలే లక్ష్యాలను గుర్తించి, గురిపెట్టి కాల్పులు జరిపే ఏఐ ఆధారిత ఆటోమేటెడ్ గన్‌ను తయారుచేసింది. కానీ.. ప్రస్తుతానికి ఆ గన్‌పై నియంత్రణను సైనికులకే అప్పగించింది. అంటే ముందున్న లక్ష్యాలను ఆ గన్ గుర్తిస్తుంది. కానీ, కాల్చాలా వద్దా అనే నిర్ణయం మాత్రం వెనకాల ఎక్కడో ఉండే సైనికుడిదేనన్నమాట. కంపెనీలే కాక.. ఉక్రెయిన్‌లోని సాధారణ ప్రజలందరూ కూడా ఇలాంటి డ్రోన్ల, ఆయుధాల తయారీకి సంబంధించి ఆన్‌లైన్‌లో ఉచితంగా లభించే కోర్సులను నేర్చుకోవాలని ఉక్రెయిన్ ఉప ప్రధాని మిఖాయిలో ఫెడొరోవ్ ప్రోత్సహిస్తున్నారు. దేశ ప్రజలు ఏడాదికి పది లక్షల డ్రోన్లను తయారుచేయాలన్నది ఆయన నిర్దేశించిన లక్ష్యం. కృత్రిమ మేధను యుద్ధరంగంలో ఉపయోగించడం అంతమంచిది కాదని ఐక్యరాజ్యసమితి, మానవహక్కుల సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. కానీ ఉక్రెయిన్ డిప్యూటీ పీఎం చెబుతున్న మాట ఒక్కటే.. 'ముందు మేం గెలవాలి. అందుకు మేం చేయగలిగిందంతా చేస్తాం. మా సైనికుల ప్రాణాలు కాపాడుకోవడానికి ఆటోమేషన్‌ను వాడి తీరుతాం" అని!! టెక్నాలజీనే తమ విజయానికి మొదటి మెట్టు అన్నది ఆయన నినాదం.

- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



రాజ్యసభలో ఎన్డీఏ బలం తగ్గింది

న్యూఢిల్లీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో నలుగురు నామినేటెడ్ సభ్యులు గత శనివారం పదవీ విరమణ చేయడంతో బీజేపీ బలం 86 సీట్లకు, ఎన్డీఏ బలం 101 సీట్లకు తగ్గిపోయింది. పదవీ విరమణ చేసిన నామినేటెడ్ సభ్యుల్లో సోనాల్ మాన్ సింగ్, సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు రాకేశ్ సిన్హా, యూపీ బీజేపీ నేత రాంషకల్ ఉన్నారు. సాధ్యమైనంత త్వరగా వీరి స్థానంలో మరో నలుగురిని నామినేట్ చేసి రాజ్యసభలో మళ్లీ బలాన్ని పెంచుకోవాలని బీజేపీ యోచిస్తోంది. మరోవైపు.. ఏపీ, తెలంగాణలో రాజకీయంగా క్లిష్ట దశను ఎదుర్కొంటున్న వైసీపీ, బీఆర్‌ఎస్ బీజేపీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడ్డట్లు తెలిసింది. తాము బేషరతుగా మద్దతిస్తామని జగన్ లేఖ రాయగా, బీజేపీకి అండగా ఉండాలని తమ నలుగురు ఎంపీలకు బీఆర్‌ఎస్ సూచించినట్లు తెలిసింది. అయితే, బీజేడీకి చెందిన 9 మంది, అన్నాడీఎంకేకు చెందిన నలుగురు సభ్యులు తటస్థంగా ఉండే అవకాశాలున్నాయి. రాజ్యసభలో ఇండియా కూటమికి 87మంది సభ్యులు ఉండగా, అందులో కాంగ్రెస్‌కు 26 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కేశవరావు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అభిషేక్ సింఘ్వీని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎంపిక చేసే అవకాశాలున్నాయి. మొత్తంగా తెలంగాణతోపాటు హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపురలో ఒక్కో ఖాళీ, మహారాష్ట్ర, అస్సాం, బీహార్‌లో రెండేసీ చొప్పున సీట్లు భర్తీ చేయాల్సి ఉంది. మొత్తం 11 సీట్లలో బీజేపీకి ఏడు సీట్లు దక్కే అవకాశాలు ఉన్నాయి. నామినేటెడ్ ఖాళీలను కూడా భర్తీ చేస్తే ఎన్డీఏ సంఖ్యాబలం 112 సీట్లకు పెరగనుంది. అయినప్పటికీ బిల్లుల ఆమోదానికి ఇతర పార్టీలపై ఆధారపడాల్సి ఉంటుంది.

భోజశాల కింద 94 విరిగిన విగ్రహాలు!

- హిందూ పిటిషనర్ల న్యాయవాది వెల్లడి
- మధ్యప్రదేశ్ హైకోర్టుకు శాస్త్రీయ సర్వే నివేదిక సమర్పించిన ఏఎస్ఐ

ఇండోర్, జూలై 15: మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజశాల-కమల్ మౌలా మసీదు సముదాయం కింద 94కిపైగా విరిగిన విగ్రహాలు దొరికినట్లు భారతీయ పురావస్తు విభాగం (ఏఎస్ఐ) తన శాస్త్రీయ సర్వేలో తేల్చిందని న్యాయవాది హరిశంకర్ జైన్ తెలిపారు. అక్కడ హిందూ ఆలయం ఉందనడానికి ఇదే నిదర్శనమని.. అక్కడ హిందూ పూజలు మాత్రమే నిర్వహించాలని సోమవారమిక్కడ తెలిపారు. వివాదాస్పద కట్టడంపై శాస్త్రీయ సర్వే నిర్వహించి తమకు నివేదిక సమర్పించాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్ ఈ నెల 4న ఇచ్చిన ఆదేశాల మేరకు ఏఎస్ఐ సర్వే పూర్తిచేసింది. దాని తరఫు న్యాయవాది హిమాంశు జోషీ సోమవారం 2,000 పేజీల తన రిపోర్టును కోర్టుకు అందజేశారు. 22న దీనిపై హైకోర్టులో విచారణ జరుగుతుందని తెలిపారు. ధార్ జిల్లాలో 11వ శతాబ్దికి చెందిన ఈ భోజశాలను వాగ్దేవి (సరస్వతీదేవి) ఆలయంగా హిందువులు విశ్వసిస్తారు. ఇది కమల్ మౌలా మసీదు అని ముస్లింలు వాదిస్తున్నారు. 2003 ఏప్రిల్ 7న ఏఎస్ ఐ.. భోజశాలలో ప్రతి మంగళవారం హిందువులు పూజ చేసుకోవడానికి, ప్రతి శుక్రవారం ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. దీనిని వ్యతిరేకించిన 'హిందూ ఫ్రంట్ ఫర్ జస్టిస్' సంస్థ శాస్త్రీయ సర్వే నిర్వహించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించింది .కాగా, శాస్త్రీయ సర్వే జరపాలన్న హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా మౌలానా కమాలుద్దీన్ వెల్ఫేర్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది.

డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

అక్రమ ఆస్తుల కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్.. దానికి అనుబంధంగా ఈడీ సమన్లు

- వీటిపై గతంలో కర్ణాటక హైకోర్టుకు డీకే
- సమన్ల రద్దుకు నిరాకరించిన ధర్మాసనం
- హైకోర్టు నిర్ణయంలో జోక్యం చేసుకోబోమన్న సుప్రీం.. పిటిషన్ కొట్టివేత



బెంగళూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఆస్తుల వ్యవహారంలో సీబీఐ ఎఫ్ఐఆర్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. దీంతో డీకే శివకుమార్ కేసులను ఎదుర్కొనక తప్పని పరిస్థితి ఏర్పడింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌కు అనుబంధంగా ఈడీ జారీ చేసిన సమన్లను ప్రశ్నిస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కానీ ఆ సమన్లను రద్దు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో డీకే శివకుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు విషయంలో జోక్యం చేసుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. డీకే శివకుమార్‌ను విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2019 సెప్టెంబరు 25న అనుమతులు ఇచ్చింది. అందుకు అనుగుణంగానే ఆయనపై 2020 అక్టోబరు 3న సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కేసుపై ప్రభుత్వ అనుమతులను రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో సీబీఐ దర్యాప్తు నుంచి విముక్తి లభిస్తుందని భావించారు. కానీ అప్పటికే అక్రమ ఆస్తులను నిర్ధారించిన ఈడీ సమన్లు జారీ చేసింది. ఇదిలా ఉండగా, రాజ్యసభలో మెజారిటీ లేకపోయినప్పటికీ మోదీ సర్కారు ఆధార్ చట్టం వంటి కీలక బిల్లులను ద్రవ్య బిల్లుల ముసుగులో ఆమోదింపజేసుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను విచారించేందుకు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఈ అంశం ఇప్పటికే రాజ్యాంగ ధర్మాసనం విచారణ జాబితాలో ఉందని, దీన్ని ప్రాధాన్య అంశంగా గుర్తించి, రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కపిల్ సిబల్ కోరారు. స్పందించిన సీజేఐ.. రాజ్యాంగ ధర్మాసనాలు ఏర్పాటు చేసిన వెంటనే తెలియజేస్తానని చెప్పారు.

కర్ణాటక అసెంబ్లీలో 'ఏఐ కెమెరా'

కర్ణాటక శాసనసభలో ఎమ్మెల్యేల హాజరు, రాకపోకలను రికార్డు చేసేందుకు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కెమెరాలను అమర్చారు. శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యేలు ఏ సమయానికి సభలో ప్రవేశిస్తున్నారు, ఎంత సేపటికి బయటకు వెళ్తున్నారనే వివరాలను ఈ కెమెరాలు రికార్డు చేయనున్నాయి. ఎమ్మెల్యేలు ఎంతసమయం శాసనసభలో గడుపుతున్నారనేది వీటిలో రికార్డు కానుంది.

అదానీ గ్రూప్‌పై తీర్పును సమీక్షించం

- పిల్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జూలై 15: అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్‌లో అవకతవకలకు పాల్పడిందంటూ వచ్చిన ఆరోపణలపై సెబీ చేస్తున్న విచారణను ప్రత్యేక విచారణ బృందం (సిట్) లేదా సీబీఐకి అప్పగించాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ జనవరి 3న ఇచ్చిన తీర్పును సమీక్షించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అనామిక మిశ్రా తదితరులు దాఖలు చేసిన పిల్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. పిల్‌ను పరిశీలించిన తర్వాత ఎలాంటి సమీక్షకు అవకాశం లేదని స్పష్టం చేసింది. కాగా, జనవరి 3న ఇచ్చిన తీర్పులో.. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణల మీద సెబీ సమగ్ర విచారణ జరుపుతున్నదని, ఆ విచారణ నమ్మకం కలిగిస్తున్నదని సుప్రీం పేర్కొంది.

విడాకుల కోసం సుప్రీంకోర్టులో ఒమర్ అబ్దుల్లా పిటిషన్

న్యూఢిల్లీ, జూలై 15: భార్య నుంచి విడాకులు మంజూరు చేయాలంటూ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయన సతీమణి పాయల్ అబ్దుల్లాకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా సమాధానం చెప్పాలని స్పష్టం చేసింది. ఒమర్ అబ్దుల్లా-పాయల్ గత 15 ఏళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారని, ఫలితలంగా వారి వివాహబంధం ముగిసినట్లేనని, ఆ మేరకు పెళ్లి రద్దు కోసం రాజ్యాంగంలోని 142 నిబంధనను పరిగణనలోకి తీసుకోవాలని ఒమర్ అబ్దుల్లా తరఫున కపిల్ సిబల్ వాదించారు.

ఉగ్రదాడిలో తెలుగు జవాన్ వీరమరణం

- జమ్మూకశ్మీర్‌లో ఘటన.. సిక్కోలు జిల్లాలో విషాదం



నందిగాం, జూలై 15: శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం వల్లభరాయుడుపేటకు చెందిన ఆర్మీ హవల్దార్ సనపల జగదీశ్వరరావు(40) ఉగ్రదాడిలో వీరమరణం చెందారు. సోమవారం ఉదయం జమ్మూకశ్మీర్ పరిధిలోని అనంతనాగ ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల ఎదురుదాడుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. జగదీశ్వరరావు 2003లో ఆర్మీలోచేరారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో హవల్దార్‌గా పనిచేస్తున్నారు. ఆయన వీరమరణం చెందిన వార్త తెలుసుకుని తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, నారాయణమ్మ, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. జగదీశ్వరరావుకు భార్య సమతతోపాటు ఇద్దరు కుమార్తెలు మోక్షప్రియ(8), దీక్షిత(6) ఉన్నారు. సమత నందిగాం మండలం దిమిలాడ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

కలుషితాహారంతో విద్యార్థులకు అస్వస్థత

- ఆస్పత్రి పాలైన 128 మంది విద్యార్థులు
- నాయుడుపేట సంక్షేమ హాస్టల్లో ఘటన.. సీఎం ఆరా
- పరామర్శించిన మంత్రి బాలాంజనేయస్వామి

నాయుడుపేట, జూలై 15: తిరుపతి జిల్లా నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సంక్షేమ హాస్టల్ సిబ్బంది నిర్వాకంతో అక్కడి విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. ఈ విషయం తెలియడంతో స్వయంగా సీఎం చంద్రబాబే స్పందించి రంగంలోకి దిగారు. వివరాలివీ.. ఈ హాస్టల్లో మొత్తం 881 మంది విద్యార్థులకుగాను శనివారం సాయంత్రం 520 మంది మాత్రమే ఉన్నారు. ఆదివారం ఉదయం నుంచే కొంతమంది విద్యార్థులకు విరేచనాలు కావడం, రాత్రి భోజనం తరువాత సుమారు 128మంది వాంతులు, విరేచనాల బారిన పడటంతో వసతిగృహ అధికారులు వారిని ఆస్పత్రులకు తరలించారు. నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో 66 మంది, గూడూరు ఏరియా ఆస్పత్రిలో 39 మంది, సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో 16మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో ఏడుగురు విద్యార్థుల పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉండడంతో వారిని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థులకు ఆదివారం ఉదయం అల్పాహారంగా పూరీ, ఉర్లగడ్డ కూర్మా అందించాల్సి ఉంది. అయితే నిర్వాహకుడు ఆ పూరీలను శనివారమే తయారు చేయించి, వాటిని ఆదివారం విద్యార్థులకు అల్పాహారంగా అందించారు. వాటిని తిన్న కొంతమంది విద్యార్థులకు విరేచనాలు మొదలైనట్లు చెబుతున్నారు. అలాగే, ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలవద్దకు వస్తూ వారికి ఇంటి నుంచి భోజనం తెచ్చిపెట్టడంతో మధ్యాహ్నం వడ్డించాల్సిన చికెన్ మిగిలిపోయింది. దాన్ని రాత్రి విద్యార్థులకు వడ్డించారు. తిన్నాక చాలామంది విద్యార్థులు కడుపునొప్పి, విరేచనాలు, వాంతులతో విలవిలలాడిపోయారు. అక్కడే ఉన్న హెల్త్ అసిస్టెంట్లు కొందరికి మందులు ఇచ్చినా తగ్గకపోవడంతో అప్పటికప్పుడు విద్యార్థులను ఆసుపత్రులకు తరలించారు. ఈ విషయం ఉన్నతాధికారులకు చేరడంతో సోమవారం ఉదయం కలెక్టర్ వెంకటేశ్వర్ హాస్టల్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్ సహా మరో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సంఘటన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి మంత్రి డోలా బాలాంజనేయస్వామిని సంక్షేమ హాస్టల్‌కు పంపించారు. ఆయన సోమవారం గురుకులాన్ని పరిశీలించి విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సంఘటనపై జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేయించి, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు విద్యార్థులను ఆస్పత్రిలో మంత్రి పరామర్శించారు.



గూడూరు ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న మంత్రి డోలా

ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు!

- అందుకు త్వరితగతిన చర్యలు చేపట్టండి
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర ఆదేశం

మంగళగిరి సిటీ, జూలై 15: మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రి ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందించేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర అధికారులకు సూచించారు. మంగళగిరి ఎయిమ్స్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఎయిమ్స్ పదవ స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఎయిమ్స్‌లో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఎయిమ్స్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన పలు సేవలను ఆయన ప్రారంభించారు. అనంతరం మంగళగిరి గణపతినగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అపూర్వ చంద్ర సందర్శించారు. రాష్ట్రంలోనే తొలి ఎన్క్వాస్ సర్టిఫికెట్ పొందిన ఈఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తే
అదే వారికి చివరి రోజు

- ముచ్చుమర్రి, విజయనగరం అత్యాచార బాధిత కుటుంబాలను ఆదుకుంటాం
- బాలిక కుటుంబానికి 10 లక్షలు పరిహారం
- పసికందు పేరిట 5 లక్షల ఎఫ్‌డీ: అనిత



అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలతో అసభ్యంగా ప్రవర్తించిన వారికి అదే చివరి రోజు అవుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. "నంద్యాల జిల్లా ముచ్చుమర్రి, విజయనగరం జిల్లాలో జరిగిన ఘటనలు అత్యంత హేయం, దారుణం. అత్యాచార నిందితులను వదిలే ప్రసక్తేలేదు. కఠినంగా శిక్షిస్తాం" అని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతలు, గంజాయి నియంత్రణ, నకిలీ మద్యం కట్టడి వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారని, ముచ్చుమర్రి, విజయనగరం ఘటనలను తీవ్రంగా పరిగణించాలని ఆదేశించారని తెలిపారు. ముచ్చుమర్రి ఘటనలో ఇప్పటికే ముగ్గురు మైనర్లు అరెస్టు అయ్యారని, బాలిక మృతదేహం ఆచూకీ లభించలేదన్నారు. నిందితులు ఎటువంటి వారైనా వదిలి పెట్టవద్దు అని, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి శిక్షలు కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. ముచ్చుమర్రి బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థికసాయం అందించాలని, విజయనగరం ఘటన లో బాధితురాలైన ఆరు నెలల పసికందు పేరిట రూ.5 లక్ష ల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని చంద్రబాబు ఆదేశించారని మంత్రి తెలిపారు. "నేరగాళ్లకు పార్టీ, కులం ఉండదు. బైరెడ్డివాళ్లు ఉన్నారా? ఆ రెడ్డివాళ్లు ఉన్నారా అనేది అనవసరం. తప్పు చేసిన ఎవరికైనా శిక్షపడాల్సిందే"నని మంత్రి స్పష్టం చేశారు.

ముసురేసింది

(మొదటి పేజీ తరువాయి)

రుతుపవన ద్రోణి విస్తరించింది. మరోవైపు ఒడిశా మీదుగా తూర్పు, పడమరకు ఒక ద్రోణి, అరేబియా సముద్ర తీరం వెంబడి కేరళ నుంచి గుజరాత్ వరకు మరో ఉపరితల ద్రోణి విస్తరించాయి. వీటన్నింటి ప్రభావంతో దక్షిణ భారతంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారి సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. పలుచోట్ల భారీ నుంచి అతి భారీవర్షాలు పడ్డాయి. కోస్తాలో అనేకచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా, అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాలు చురుగ్గా మారిన నేపథ్యంలో బుధవారం(ఈ నెల 17వ తేదీ) నుంచి కోస్తాలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈనెల 19వ తేదీన వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నదని, ఆ ప్రభావంతో ఈనెల 21వ తేదీ వరకు కోస్తాలో వర్షాలు కొనసాగనున్నాయని వివరించింది. కాగా, సోమవారం కృష్ణా జిల్లా కృత్తివెన్నులో 66, ఉంగుటూరులో 58, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరులో 59.6, అనకాపల్లి జిల్లా కోడూరులో 55, విజయనగరం జిల్లా కొత్తవలసలో 37.25, కర్నూలు జిల్లా అస్పరీలో 35 మి.మీ వర్షం కురిసింది. తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు ఎన్టీఆర్ జిల్లాలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఓటమిని ఎదుర్కోవడం చాలా కష్టం!

కూరగాయల గుచ్ఛాలు..

ఆత్మీయ సత్కారంలో ప్రజాప్రతినిధులకు పవన్ కూరగాయలతో చేసిన గుచ్చాలను అందజేశారు. వారికి అందజేసిన కూరగాయల గుచ్చాలను రెండు అనాథ శరణాలయాలకు విరాళంగా అందించారు. ఆ రెండు అనాథ శరణాలయాల నిర్వహణకు రూ.2 లక్షల విరాళం అందజేశారు. అలాగే పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ అంతా కలిసి ఆయన్ను సత్కరించారు. దశాబ్ద కాలంగా జనసేన సాగించిన ప్రయాణం స్వాతంత్ర్య ఉద్యమం తరహాలో సాగిందని పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాక్షస పాలన అంతం చేయడానికి ప్రజలు ఎంతో నిశ్శబ్దంగా, క్రమశిక్షణగా చేసిన ఓటు పోరాటం గొప్పదన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో డబ్బు వెచ్చించి మరీ రాష్ట్రానికి వచ్చి ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారని కొనియాడారు. ఆ ప్రజాస్వామ్య విలువలను పూర్తిగా గౌరవించాలని.. ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా పని చేయాలని కోరారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎంతో విశ్వాసంతో పాటు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని.. మనమంతా సమష్టిగా పని చేసి వారికి ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలని పిలుపిచ్చారు. 'గత వైసీపీ పాలనలో ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. రోడ్డు మీదకు రావాలంటే భయం. అభిప్రాయం తెలియజేయాలంటే భయం. కనీసం సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక పోస్టు పెట్టాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. బూతులు, బెదిరింపులు, కేసులు, వ్యక్తిగత దూషణలు గత ప్రభుత్వంలో నిత్య కృత్యమయ్యాయి. సాక్షాత్తూ ప్రజల చేత ఎన్నికైన ఎంపీని బంధించి భౌతికంగా హింసించిన తీరు అందరికీ తెలిసిందే. నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును 54 రోజుల పాటు జైల్లో పెట్టించారు' అని గుర్తుచేశారు. గత ప్రభుత్వ దాష్టీకాలను బలంగా ఎదురొడ్డి నిలిచింది ఒక్క జనసేన మాత్రమేనన్నారు. తప్పు జరిగిన ప్రతి చోటా జనసైనికులు, వీర మహిళలు రోడ్ల మీదకు వచ్చి పోరాడిన తీరు ఐదు కోట్ల మంది ప్రజలకు బలమైందని తెలిపారు. జనసేన పోటీ చేయని చోట కూడా బలంగా నిలబడి కూటమి ప్రభుత్వం రావడానికి అన్ని విధాలా సహకరించారని వారిని అభినందించారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..



జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌ను సత్కరిస్తున్న ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు

అంబానీ ఇంటా 100% స్ట్రైక్ రేటు..

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో జనసేన పోటీచేసిన ప్రతి చోటా గెలవడంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. మనం తీసుకున్న 21 అసెంబ్లీ సీట్లు 175లో తక్కువే కావచ్చు. కానీ కూటమి 164 చోట్ల విజయ దుందుభి మోగించడంలో ఆ 21 సీట్లే వెన్నెముక అయ్యాయి. ఈ గెలుపు రాష్ట్ర రాజకీయాలను సమూలంగా మార్చగలిగింది. భారతదేశ రాజకీయ చరిత్రలో రాజకీయ నిపుణులకు, రాజనీతి శాస్త్ర విభాగంలో ఒక కేస్ స్టడీ అయింది. జాతీయ స్థాయిలో నేను ఎక్కడకు వెళ్లినా నన్ను అమితంగా గౌరవించడానికి ఈ విజయం ఎంతో దోహదపడుతోంది. ఇటీవల ముఖేశ్ అంబానీ కుమారుడి వివాహానికి ముంబై వెళ్లిన సమయంలోనూ అక్కడి అతిథులు జనసేన 100 శాతం స్ట్రైక్ రేట్‌ను ప్రస్తావించి.. ఇదెలా సాధ్యమని అడగడం గొప్పగా అనిపించింది. గెలిచిన వారికి కూడా ఊహించని మెజారిటీలు వచ్చాయి. ఇది ఐదు కోట్ల మంది ఆంధ్రులు మన మీద పెట్టుకున్న నమ్మకమని గుర్తించాలి. మన బలం 7 శాతం నుంచి 20 శాతానికి పెరిగినట్లు సర్వేలు చెబుతున్నాయి.

వ్యక్తిగత దాడులు కరెక్టు కాదు..

అధికారంలోకి వచ్చామని గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు మళ్లీ మనం చేయకూడదు. వైసీపీ నాయకులు మనకు శత్రువులు కాదు. కేవలం రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే. వారి విధానాలపైనే మన పోరాటం ఉండాలి. వ్యక్తిగత దాడులు కరెక్టు కాదు. కక్ష సాధింపులు, వ్యక్తిగత వేధింపులు, దూషణలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా రౌడీయిజాన్ని, గూండాయిజాన్ని నమ్ముకోవడం పూర్తిగా పక్కన పెట్టి ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసం నింపేలా పని చేయాలి.

ఇంత అడ్డగోలు వ్యయమా?

గత ప్రభుత్వంలో పెట్టిన అడ్డగోలు ఖర్చులు, వినియోగం చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఇవి చూశాక కార్యాలయంలో ఫర్నీచర్ కూడా కొనుగోలు చేయవద్దని సొంత ఫర్నిచర్‌నే వాడుతున్నాను. ప్రజాధనాన్ని రూపాయి కూడా అనవసరంగా వృథా చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను. రూ.200 కోట్లు ఖర్చు పెడితే ఎంతో మందికి ప్రయోజనం చేకూర్చే ఎన్నో పథకాలను గత పాలకులు వదిలేశారు. రూ.600 కోట్లు ఖర్చు చేసి రుషికొండ ప్యాలెస్ ఎందుకు కట్టారో తెలియదు. ప్రజాధనం వినియోగంలో జాగ్రత్త వహించాలి. చిన్నపాటి కుర్చీ ఉంటే దానిలో కూర్చునే పాలన సాగిద్దాం. పౌరసరఫరాల మంత్రిగా నాదెండ్ల మనోహర్ తనిఖీలు చేస్తుంటే పేదలకు వెళ్లే బియ్యాన్ని ఎలా తరలించేస్తున్నారో, అదెంత మాఫియానో ప్రజలకు తేటతెల్లమైంది.

అధికార దుర్వినియోగం సహించను

పార్టీని పటిష్ఠం చేయడానికి ఎవరి స్థాయిలో వారు బలంగా పని చేయాలి. నియోజకవర్గ స్థాయి నాయకులు కూడా జనవాణి నిర్వహించాలి. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలు తీర్చడానికి ప్రాధాన్యమివ్వండి. జనసేన నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు అధికార దుర్వినియోగం చేస్తే సహించను. అధికారులతో చాలా హుందాగా మాట్లాడాలి. కుటుంబ సభ్యులను అధికారిక కార్యక్రమాల్లో జోక్యం చేసుకోనివ్వొద్దు. వారసత్వ రాజకీయాలకు మన పార్టీ వ్యతిరేకం కాదు. కానీ కుటుంబ సభ్యులను సహజ ధోరణిలో రాజకీయాల్లోకి తీసుకురావాలి. అలా కాకుండా జనం మీద రుద్ది వారిని ప్రమోట్ చేయాలనుకుంటే మాత్రం సహించను. అలాగే మన నాయకులను మనమే ఇష్టానుసారం సోషల్ మీడియాలో తిడితే వారు నాకు విధేయులైనా, అమితంగా ఇష్టపడే వారైనా వదులుకోవడానికి సిద్ధం. ముఖ్యంగా మహిళా నేతలను ఎవరైనా కించపరిచేలా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. నేను జనం కోసం పని చేసేవాడిని. ప్రజల కోసం కుటుంబాన్ని కూడా పక్కన పెట్టేస్తా. నా సొంత బిడ్డలైనా ప్రజల తర్వాతే. వైసీపీ లాంటి రౌడీ పార్టీతోనే పోరాడి ఈ స్థాయికి వచ్చిన వాడిని. నాకు ఎలాంటి భయాలు ఉండవని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోండి.

నా గుండెల్లో మీ స్థానం పదిలం..

కూటమి ప్రభుత్వం అంటే కేవలం ఒక పార్టీ ప్రభుత్వం కాదు. ఎన్నికల్లో ఉమ్మడి విజయం సాధించాం. టీడీపీ, బీజేపీ నాయకులను ఏ మాత్రం తగ్గించి మాట్లాడొద్దు. వ్యక్తిగతంగా ఎవరినీ కించపరచొద్దు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యమిస్తాం. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల పంపకం కూటమి పార్టీల మధ్య జరుగుతుంది. కొందరికి ప్రభుత్వ పదవులు, మరికొందరికి పార్టీలో ఉన్నతస్థాయి పదవులు ఇస్తాం. ఏ పదవి ఇచ్చినా నా గుండెల్లో మీ స్థానం పదిలంగా ఉం టుందని అర్థం చేసుకోండి. ఉన్న అవకాశాలను బట్టి పదవులు దక్కుతాయి. ఎమ్మెల్యేలు వారానికొకరు చొప్పున పార్టీ కేంద్ర కార్యాలయంలో అందుబాటులో ఉండాలి. ప్రజల వినతులను స్వీకరించి వారితో ప్రత్యేకంగా మాట్లాడాలి.

ప్రధాని బరువు దించేలా..

ప్రధాని మోదీతో ఏం మాట్లాడాలని ఇటీవల మన పార్టీ ఎంపీలు అడిగారు. 140 కోట్ల మంది భారతీయుల బరువు మోసే ఆయనకు.. మన తరఫున బరువు దించే అంశాలే మాట్లాడాలని సూచించాను. నేను మోదీ గుండెల్లో ఉన్నా.. ఆయన పక్కన నిల్చొని ఫొటో దిగాల్సిన అవసరం లేదు. ప్రధానితో అవసరమైన సందర్భంలో కచ్చితంగా 5 కోట్ల ఆంధ్రుల కోసం మాట్లాడతాను. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకోవడం, రైల్వేజోన్, ఉపాధి అవకాశాల కోసం మనం బలంగా నిలబడ్డామని ప్రజలు నమ్మారు.

'అనంత' ఆలయాల్లో జస్టిస్ శ్రీనివాసరెడ్డి పూజలు



స్వామి సన్నిధిలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి

పెద్దపప్పూరు, జూలై 15: అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి, తిమ్మనచెరువు వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి సోమవారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో..
ఆరుగురు నిందితులకు బెయిల్ నిరాకరణ

గుంటూరు(లీగల్), జూలై 15: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయాన్ని ధ్వంసం చేసిన కేసులో రిమాండ్‌లో ఉన్న వైసీపీకి చెందిన నిందితుల బెయిల్ పిటిషన్‌లపై సోమవారం గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్ బి.జి.పార్థసారధి తీర్పు చెప్పారు. ఆరుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించారు. మరో నిందితుడు గిరి రాంబాబుకి అనారోగ్య కారణంతో బెయిల్ మంజూరు చేశారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

ధర్మవరం రూరల్, జూలై 15: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం ముచ్చురామి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాలచంద్రపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు వేటకొడవళ్లతో దాడి చేశారు. దీంతో బాలచంద్ర గాయపడ్డాడు. బాలచంద్ర చిన్నాన్న క్రిష్ణయ్య పొలంలోని చీనీచెట్లను గతంలో వైసీపీ నేతలు బోగే లక్ష్మిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డి, నరేష్‌రెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి నరికివేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు పెట్టారు. ఈ వివాదం నేపథ్యంలో పొలంలో ఉన్న క్రిష్ణయ్యతో వైసీపీ నేతలు సోమవారం గొడవ పెట్టుకున్నారు. సమీపంలో ఉన్న బాలచంద్ర.. అక్కడికి వెళ్లి వైసీపీ వర్గీయులను అడ్డుకున్నాడు. దీంతో రామకృష్ణారెడ్డి కొడవలితో నరికాడు. దీంతో బాలచంద్రకు తీవ్ర గాయాలు, క్రిష్ణయ్యకు స్వల్పగాయాలయ్యాయి.

జేసీపై కేసు కొట్టివేత

విజయవాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి జేసీ దివాకరరెడ్డిపై నమోదైన కేసును విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు సోమవారం కొట్టేసింది. అనంతపురం జిల్లాలో జరిగిన సభలో దివాకరరెడ్డి పోలీసులను ఉద్దేశించి పరుష పదజాలాన్ని ఉపయోగించారు. దీనిపై 2019లో పోలీసులు కేసు నమోదు చేశారు. దివాకరరెడ్డి తరఫున టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ వాదించారు.

'కోడికత్తి' కేసులో బెయిల్ రద్దుకు సుప్రీం నో

న్యూఢిల్లీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): 'కోడికత్తి' కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకు ఊరట లభించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బెయిల్ ఉత్తర్వులపై జోక్యానికి నిరాకరిస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఐదేళ్ల పాటు జైల్లో ఉన్న శ్రీనివాస్‌రావుకు గత ఫిబ్రవరి 8న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

వ్యాపారమయమైన వైద్య వృత్తి

- మానవతా దృక్పథంతో వైద్యులు పనిచేయాలి
- గత ప్రభుత్వ హయాంలో అప్పుల కుప్పగా ఆరోగ్య శాఖ
- ఆరోగ్యశ్రీ బకాయిలు రెండు వేల కోట్లు: మంత్రి సత్యకుమార్



విశాఖపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిలో సేవ కంటే వ్యాపారం ఎక్కువైందని, అందుకే వైద్యుల పట్ల సమాజంలో గౌరవం తగ్గుతోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం విశాఖలోని ఆంధ్ర మెడికల్ కళాశాలలో వైద్యులు, వైద్యశాఖ అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'పేషెంట్ ఫ్రెండ్లీ వైద్యులు రావాలి. ప్రభుత్వ ఆరోగ్య రంగం పట్ల ప్రజల్లో నెలకొన్న అనుమానాలను, భయాలను పోగొట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తాం. వ్యాధి వచ్చిన తరువాత కంటే ముందే గుర్తించడంపై దృష్టిసారించడం మేలు. ఈ క్రమంలోనే 5.3కోట్ల మందికి కేన్సర్ స్ర్కీనింగ్ చేయబోతున్నాం. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. వైసీపీ హయాంలో ఆరోగ్యశాఖ అప్పులకుప్పగా మారింది. ఆరోగ్యశ్రీ పథకానికి రూ.2 వేల కోట్లు, మెడికల్ కాలేజీలకు రూ.9,000 కోట్లు, ఇతర ప్రోగ్రామ్స్‌కు రూ.వందలాది కోట్లు చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వ విధానాల వల్ల ఇప్పటికీ ఎంతో మందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉంది. పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఆస్పత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు పరికరాలు కొనుగోలు చేయాలి' అని సూచించారు.

రాజధాని మార్చే వీల్లేకుండా చట్టం!

- పక్కాగా రూపొందించాలన్న సీపీఎం నేత రాఘవులు

నెల్లూరు(వైద్యం), జూలై 15: అమరావతి రాజధానిని మార్చే వీలులేకుండా చట్టాన్ని పక్కాగా రూపొందించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సూచించారు. సోమవారం నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని సూచించారు. మళ్లీ సింగపూర్, మలేషియా వంటి దేశాల పేర్లు ఎత్తకుండా పనులు చేపట్టాలన్నారు. అమరావతిలో రాజధానిని మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెబుతున్నారని, త్వరగా నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అలాగే నీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన పార్టీలు, బీజేపీతో జత కట్టటం సరికాదన్నారు.

క్వారీలో ప్రమాదం.. ముగ్గురి మృతి

కంచికచర్ల రూరల్, జూలై 15: ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం దొనబండ కొండల్లోని క్వా రీలో సోమవారం బండరాళ్లు పడి ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. దొనబండ పవన్ క్రషర్‌కు చెందిన క్వారీలో బ్లాస్టింగ్ అనంతరం ఏర్పడిన రాళ్లను చిన్నవిగా బ్లాస్ట్ చేసేందు కు సోమవారం ఉదయాన్నే డ్రిల్లింగ్ కోసం నలుగురు కార్మికులు క్వారీకి చేరుకున్నారు. క్వారీలో బండరాళ్లకు డ్రిల్లింగ్ చేస్తున్న సమయంలో పెద్ద పెద్ద బండరాళ్లు పైనుంచి జారిపడి డ్రిల్లింగ్ చేస్తున్న బత్తుల దుర్గారావు(23), టీటీ నాయక్(42), రామ్‌దేవ్ బాగేల్(33)పై పడ్డాయి. బండరాళ్లు జారిపడిన ప్రదేశానికి కాస్త దూరంగా మరో కార్మికుడు కోమర గోలి తప్పించుకున్నాడు.

గంజాయి మత్తులో గేదెపై అఘాయిత్యం!

భీమవరం టౌన్, జూలై 15: గేదెపై కొందరు అఘాయిత్యానికి పాల్పడ్డారంటూ ఓ వ్యక్తి కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వీరవాసరం మండలం తోకలపూడికి చెందిన సీతారామయ్య సోమవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందజేశారు. ఆదివారం(ఈ నెల 14వ తేదీ) సాయంత్రం పొలం వద్ద ఉన్న తన గేదెకు మేత వేసి ఇంటికి వెళ్లానని, సోమవారం తెల్లవారుజామున వచ్చి చూసేసరికి గేదె లేవలేని స్థితిలో ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొంత మంది గంజాయి, మద్యం సేవించే వాళ్లే గేదెపై అఘాయిత్యానికి పాల్పడినట్టు అర్థమై, వీరవాసరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదని వాపోయారు. పశువైద్యునికి చూపించగా, గేదె కోలుకోవాలంటే నెల పడుతుందన్నారని వివరించారు.

గబ్బాడ నిల్వ ఎవరిదో తేల్చండి

- 63 వేల టన్నులపై వాస్తవాలు తెలియాలి
- అప్పటి వరకూ తరలింపు ఆపండి: స్పీకర్ అయ్యన్న



గబ్బాడ ఇసుక డిపో వద్ద స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూలై 15: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో భారీగా ఇసుకను ఎవరు నిల్వ చేశారో తేల్చాలని రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం గబ్బాడ ఇసుక డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అయ్యన్న... 'నా అంచనా ప్రకారం డిపోలో 63 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. ఎవరు నిల్వ చేశారో తెలుసుకున్నారా? ఇంత భారీ ఎత్తున ఇసుకను లారీలతో తరలిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? ఇసుక దొంగ ఎవరో తెలుసుకోవాలి కదా..! డిపోలోని సీసీ ఫుటేజీలు పరిశీలించారా?' అంటూ ఆర్డీవో జయరామ్‌ను ప్రశ్నించారు. సీసీ కెమెరాలు పాతవి పనిచేయకపోవడంతో 6న కొత్తవి ఏర్పాటు చేశామని చెప్పిన ఆర్డీవోను... పాత సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీ పరిశీలించాలని ఆదేశించారు. అక్రమంగా నిల్వ చేసింది ఎవరో తేల్చకుండా ఇసుక సరఫరా చేయవద్దని ఆదేశించారు. ఈ నెల నాలుగో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉండవచ్చునని, ఆ సమావేశాల్లో ఎవరైనా ఎమ్మెల్యే నర్సీపట్నంలో ఇసుక గురించి ప్రశ్నిస్తే అక్కడికక్కడే అసెంబ్లీలో విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. ఇసుక డిపో వద్దకు స్థానిక మైనింగ్ ఏడీ రాకపోవడంతో నేరుగా రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇసుక అక్రమ నిల్వపై ఫిర్యాదు చేశారు. ఇసుక నిల్వ ఎవరు చేశారని అడుగుతుంటే తెలియదని అధికారులు గుడ్డిగా సమాధానం చెబుతున్నారని వివరించారు. రాజమండ్రి ఇసుక రీచ్ వద్ద అనకాపల్లి జిల్లా వాళ్లకు ఇసుక ఇవ్వబోమని అంటున్నారని, అది సరైన పద్ధతి కాదని అన్నారు. రాజమండ్రిలో ప్రత్యేకంగా ఒక రీచ్‌ను అనకాపల్లి జిల్లా అవసరాల కోసం ఏర్పాటు చేయాలని అయ్యన్న కోరారు.

కర్నూలులో అతిసారం

- సుంకేశ్వరిలో మూడేళ్ల బాలిక మృతి
- మరో 70 మందికి అస్వస్థత
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు
- తాగునీరు కలుషితమే కారణమని అంచనా



ఆదోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుంకేశ్వరి గ్రామస్థులు

మంత్రాలయం, జూలై 15: అసలే వర్షాకాలం.. ఆపై తాగునీరు కలుషితం, పరిసరాల అపరిశుభ్రత కారణంగా కర్నూలు జిల్లాలో అతిసారం కలకలం రేపింది. మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో 70 మంది అతిసారంతో ఆస్పత్రి పాలవగా.. సోమవారం మూడేళ్ల చిన్నారి మృతిచెందడం ఆందోళనకు గురిచేసింది. తాగునీరు, అపరిశుభ్రత కారణంగా నాలుగు రోజుల నుంచి గ్రామంలో ప్రజలకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయి. దీంతో వారంతా ఆదోని, ఎమ్మిగనూరు, రాయచూరులోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో సుంకేశ్వరి గ్రామానికి చెందిన బోయ ఈరన్న, అంజలి దంపతుల కుమార్తె జ్యోతి (3) సోమవారం అతిసారతో మృతి చెందింది. దీంతో అప్రమత్తమైన జిల్లా అధికారులు ఆ గ్రామానికి పరుగులు పెట్టారు. గ్రామ సచివాలయం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారిలో గుడికల్ ముద్దయ్య, తులసి దంపతుల రెండేళ్ల కుమారుడు శివ పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉంది. గ్రామంలో మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. తాగునీరు పంపింగ్ చేసే బోర్లు కలుషితం కావడంతో అతిసారం ప్రబలినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ రెవెన్యూ, వైద్యాధికారులను అప్రమత్తం చేశారు. గ్రామంలో సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో పరిశుభ్రత, మంచి నీటి సరఫరా, వైద్యసేవల విషయంలో నిర్లక్ష్యం వహించిన ఆయా శాఖల అధికారులపై జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, డీపీవో నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు చిన్నారి జ్యోతి తల్లిదండ్రులు ఈరన్న, అంజలిని పరామర్శించారు.

నెల్లూరులో రేపటి నుంచే రొట్టెల పండుగ

- విస్తృత ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



స్వర్ణాల చెరువులో రొట్టెలను మార్చుకుంటున్న భక్తులు

నెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఇక్కడి బారాషహీద్ దర్గా ప్రాంగణంలో 5 రోజుల పాటు వేడుకగా నిర్వహించనున్నా రు. దీనిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో సర్కారు తరఫున ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికా రులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుం డా దర్గా ప్రాంగణంతోపాటు నగరంలోనూ విస్తృత ఏర్పాట్లు చేశారు. 1800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. 70 మందితో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి నారాయణ పండుగ నిర్వహణపై సోమవారం సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజకీయ హింస!

మళ్ళీ అధికారంలోకి రావాలనుకుంటున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌మీద శనివారం జరిగిన హత్యాయత్నం అక్కడి రాజకీయాన్ని మరింత వేడెక్కించింది, మిగతా ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. నలుగురు దేశాధ్యక్షులహత్య సహా ఈ తరహా హత్యాయత్నాలు అనేకం చూసిన అమెరికాకు రాజకీయ హింస కొత్తేమీ కాదు. కానీ, ట్రంప్ రాజకీయ ప్రవేశం తరువాత మరింతగా చీలిన అమెరికా సమాజాన్ని ఈ హత్యాయత్నం తీవ్రంగా ప్రభావితం చేస్తుంది, విద్వేషాలు పెంచుతుంది.

ఏవో కుట్రసిద్ధాంతాలు తెరమీదకు వస్తున్నాయి, భద్రతాసిబ్బంది వైఫల్యంమీద కూడా అనుమానాలు, ఆరోపణలు వినవస్తున్నాయి. వాటిని అటుంచితే, ఒక భయానకమైన హత్యాయత్నంనుంచి త్రుటిలో తప్పించుకున్న నాయకుడి పట్ల ప్రజల్లో సానుభూతి కలగడం సహజం. పైగా, తూటా తాకిన వెంటనే కిందకు వంగిన ఆయన ఆ తరువాత లేచి పిడికిలి బిగించాడు. ఫైట్ ఫైట్ ఫైట్ అంటూ ముమ్మారు నినదించాడు. చెవి పైభాగం చిట్లిపోగా మొఖమీదకు చిమ్మిన ఆ రక్తం, ఆయన వెనుక ఉన్న అమెరికా జెండా, చుట్టుముట్టివున్న సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లతో కూడిన ఆ దృశ్యం అమెరికన్ల మనస్సుల్లో బలంగా నిలిచిపోతుంది. భద్రతాసిబ్బంది ఎలా అనుమతించారో తెలియదు కానీ, బుల్లెట్ తగిలిన క్షణంనుంచి వాహనం ఎక్కే వరకూ పలుమార్లు ట్రంప్ ఆ రక్తమోడుతున్న మొఖాన్ని ప్రజలకు చూపించాడు, లొంగేది లేదంటూ నినాదాలు చేశాడు, తాను బెదిరిపోలేదని చాటిచెప్పాడు. మనకు కావాల్సింది ఇటువంటి యోధుడూ ధీరుడేనంటూ రిపబ్లికన్లు సాగిస్తున్న ప్రచారం కూడా తోడై ఈ హత్యాయత్నం ఆయనకు రాజకీయంగా మేలు చేయవచ్చు. ఆయనమీద ఉన్న కేసులు సైతం ఇక కదలకపోవచ్చునని అంటున్నారు. ఇప్పటికే జో బైడెన్ వెనుకబడి ఉన్నారని సర్వేలు చెబుతున్న తరుణంలో మొన్నటి తొలి అధ్యక్ష అభ్యర్థుల ముఖాముఖి చర్చలో సైతం బైడెన్ తడబడ్డారు, తప్పటడుగులు వేశారు. బైడెన్ తప్పుకోవాలంటూ ఆయన పార్టీలోనే ఒత్తిడి పెరుగుతోంది, కమలాహారిస్ సహా కొన్ని పేర్లు ముందుకు వచ్చాయి కూడా. తటస్థ ఓటర్లు ట్రంప్ వైపు తిరిగిపోతున్నారనీ, బైడెన్ తప్పుకోవాలని అత్యధికశాతం డెమోక్రాట్ ఓటర్లు సైతం కోరుకుంటున్నారని వార్తలు వస్తున్న తరుణంలో ట్రంప్ మీద ఈ హత్యాయత్నం జరిగింది. ఇప్పుడు అధ్యక్ష రేసునుంచి బైడెన్‌ను తప్పించినా కూడా ఫలితం ఏకపక్షంగానే ఉంటుందన్న విశ్లేషణలు కొట్టిపారేయలేనివి. అమెరికాని 'గ్రేట్ ఎగైన్' చేయడానికి సంకల్పించిన వ్యక్తిని చట్టసభలూ, న్యాయస్థానాలూ వేధిస్తున్నాయని ఇంతకాలం భావించినవారు, ఇప్పుడు భౌతికంగా అంతం చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణను ట్రంప్ అభిమానులతోపాటు తటస్థులు కూడా నమ్మవచ్చు. ఘటన జరిగిన తరువాత ట్రంప్ కుమారుడు ఇచ్చిన సందేశం పరమార్థం ఇదే.

తన పదవీకాలంలో మూడోమారు బైడెన్ ఓవల్ ఆఫీసునుంచి జాతినుద్దేశించి చేసిన ప్రసంగం ఉన్నతంగా ఉంది. దేశంలో రాజకీయ హింస పెరుగుతోందని, చల్లార్చుకోవాలని, ఎన్నికల వేడి శృతిమించకూడదని, విభేదాలు పరిష్కరించుకోవాల్సింది బ్యాలెట్‌తోనే కానీ, బుల్లెట్‌తో కాదనీ చాలామంచి మాటలు చెప్పారాయన. ఈ సందర్భంగా ట్రంప్ ఏలుబడిలో దేశం చవిచూసిన ఉద్రిక్త ఘట్టాలను, తిరుగుబాట్లను కూడా గుర్తుచేశారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓడినప్పటికీ, అధికారం అప్పగించడానికి నిరాకరించి, తన అభిమానులను రెచ్చగొట్టి, అమెరికన్ కాంగ్రెస్ భవనాలపై దాడులను ప్రోత్సహించి, ప్రపంచంముందు ట్రంప్ దేశం పరువుతీసిన విషయం తెలిసిందే.

ట్రంప్‌మీద హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి నేరచరిత్ర ఏమీ లేదు. ఫలానాపార్టీతో బలమైన అనుబంధం ఉన్నదని చెప్పడానికి కానీ ఇప్పటి వరకూ ఏ ఆధారాలు లేవు. అతడిని వెంటనే కాల్చిచంపేయడం వల్ల కొన్ని విషయాలు వెలుగులోకి రాకపోవచ్చు కూడా. అతడు శ్వేతజాతీయుడు కావడం ఒక విధంగా అమెరికా సమాజాన్ని కాపాడింది. అతడి రంగు వేరయి ఉంటే, ఇప్పటికీ పలురకాల వివక్షలతో రగులుతున్న దేశానికి విషం చిమ్మడానికి మరో అవకాశం వచ్చివుండేది. ఇక, ఈ రాజకీయ హింసకు ఆయుధంగా ఉపకరిస్తున్న 'గన్‌కల్చర్' మీద ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించడం అవసరం. తుపాకులను నియంత్రించాలన్న బైడెన్ ప్రయత్నాలకు రిపబ్లికన్లు గతంలో ఎంతగా అడ్డుపడ్డారో తెలుసు. తుపాకులను నియంత్రించాలన్న ఉద్యమాలకు కేంద్రబిందువుగా ఉండే అత్యంత ప్రమాదకరమైన సామూహిక జనహనన ఆయుధం ఎఆర్–15 రైఫిల్‌ను ఓ సాదాసీదా వ్యక్తి ఇలా సులువుగా సంపాదించి, ప్రాణాలు తీయబోయిన నేపథ్యంలో, రేపు డోనాల్డ్ ట్రంప్, ఆయన పార్టీ అధికారంలోకి వస్తే గన్ కల్చర్ మీద దృష్టిపెట్టడం అవసరం.

గ్రీన్ హైడ్రోజన్‌తో పవర్... నష్టమే తప్ప లాభం లేదు

విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "రాబోయే రోజుల్లో రాష్ట్రం గ్రీన్ హైడ్రోజన్ విద్యుదుత్పత్తికి హబ్‌గా మారుతుంది" అన్నారు. ఇంకా విశాఖలో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్రాజెక్ట్ ప్రతిపాదన ఉన్నదనీ, ఎన్టీపీసీ థర్మల్ ప్లాంటుని గ్రీన్ థర్మల్ ప్లాంటుగా మారుస్తారని చెప్పారు. అయితే ఇది శాస్త్రీయమైన విషయం కనుక వివరణ అవసరం.

హైడ్రోజన్‌ని వివిధ పద్ధతులలో ఉత్పత్తి చేయవచ్చు. ఉత్పత్తి విధానాన్ని బట్టి దానికో రంగు నిర్ణయించారు. సౌర/గాలిమర విద్యుత్తుతో నీటి విద్యుద్విశ్లేషణ ద్వారా ఉత్పత్తి అయ్యేది గ్రీన్ హైడ్రోజన్ (హరిత ఉదజని). అవసరాలకు మించిన అదనపు విద్యుత్తుతోనే హరిత ఉదజని ఉత్పత్తి చేస్తారు. అదనపు శక్తిని ఉదజని రూపంలో నిలువ ఉంచుతారు. ఈ ఉదజని ఉత్పత్తి నిరంతరాయంగా జరగదు. అదనపు విద్యుతున్నపుడు మాత్రమే జరుగుతుంది. సహజవాయువులోని మీథేన్, నీటి ఆవిరిల రసాయన చర్యలో ఉత్పత్తి అయ్యేది బ్లూ హైడ్రోజన్ (నీలి ఉదజని). ఆ క్రియలో జనించిన బొగ్గుపులుసు వాయువుని గాలిలో చేరకుండా పట్టి భూమిలో నిక్షిప్తం చేయాలి. ఇక గ్రే



హైడ్రోజన్ (బూడిద రంగు ఉదజని) మీథేన్ లేదా కోల్ గాస్ నుండి ఉత్పత్తి అవుతుంది. బొగ్గుపులుసు వాయువుని గాలిలోకి వదులుతారు. బొగ్గుతో ఉత్పత్తి చేసినది బ్లాక్ హైడ్రోజన్ (నల్ల ఉదజని). లిగ్నైట్‌తో ఉత్పత్తి అయ్యేది బ్రౌన్ హైడ్రోజన్ (గోధుమ రంగు ఉదజని). అణు విద్యుత్ వాడి నీటి విద్యుద్విశ్లేషణలో పుట్టినది పింక్ హైడ్రోజన్ (గులాబి రంగు ఉదజని). భూగర్భ నిక్షేపాల నుండి వెలికి తీసినది వైట్ హైడ్రోజన్ (తెల్ల ఉదజని). మీథేన్ వాయువుని వేడి చేసి కర్బనం, ఉదజనులు విడగొట్టే క్రియలో ఉత్పత్తి అయ్యేది టర్కాయిస్ హైడ్రోజన్ (హరితనీలి ఉదజని). గ్రిడ్ థర్మల్ విద్యుత్‌తో నీటి విద్యుద్విశ్లేషణలో జనించినది ఎల్లో హైడ్రోజన్ (పచ్చ ఉదజని).

శిలాజ ఇంధన కంపెనీలు ఉదజనిని భూతాప సమస్యకి సమాధానమైన ప్రత్యామ్నాయ ఇంధనంగా చూపించి, తమ వ్యాపార కొనసాగింపుకి అనుకూల రాజకీయ వాతావరణాన్ని సృష్టించుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో నత్రజని ఎరువుల కోసం ఉత్పత్తవుతున్న ఉదజనిలో 96 శాతం సహజ వాయువు, బొగ్గుల నుండి వస్తున్నది. ఇది గ్రే హైడ్రోజన్. దీని ఉత్పత్తిలో కిలో ఉదజనికి పది కిలోల బొగ్గుపులుసు వాయువు విడుదలవుతుంది. హరిత ఉదజని ఉత్పత్తిలో కిలో ఉదజనికి కిలో బొగ్గుపులుసు వాయువు వెలువడవచ్చు. దీనికి వివిధ దేశాలు ప్రమాణాలు ఏర్పరిచాయి. భారత్‌లో 2 కిలోల బొగ్గుపులుసు వాయువు ప్రమాణం. అంత కంటే ఎక్కువ విడుదలైతే అది హరిత ఉదజని కాదు. ఏ శిలాజ ఇంధనం వాడినా వచ్చే ఉదజని హరిత ఉదజని కాదు.

హైడ్రోజన్ రంగంలో నిపుణులైన వివిధ దేశాల పరిశోధకులూ, ఇంజనీర్లూ హైడ్రోజన్ సైన్సు కొయిలిషన్ అనే పేరుతో బృందంగా ఏర్పడి హైడ్రోజన్‌పై జరుగుతున్న విపరీత, అభూత ప్రచారాలను విశ్లేషిస్తూ, వాస్తవ శాస్త్రీయ పరిమితులను తెలియజెప్పే పరిశోధనలనూ, వ్యాసాలను అందిస్తున్నారు. విశాఖలో ప్రతిపాదిస్తున్న గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్రాజెక్టుని పరిశీలిద్దాం. ఇంటర్ స్థాయి సైన్సు అవగాహనతోనే ఈ ప్రతిపాదన లోపాలను గుర్తించవచ్చు. గ్రీన్ హైడ్రోజన్ తయారీకి సౌర/పవన విద్యుత్ కావాలి. విద్యుద్విశ్లేషణ పరికరంలో వాడిన విద్యుత్తులో 60–80 శాతం శక్తి హైడ్రోజన్ రూపంలో వస్తుంది. మిగిలిన శక్తి పరికర సామర్థ్యంలో కోల్పోతాం. పరవాడలోని 2 వేల మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటుని అదే సామర్థ్యం గల గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంటుగా (40 శాతం సమర్థతతో) మార్చాలంటే కనీసం 5 వేల మెగావాట్ల శక్తికి సమానమైన హైడ్రోజన్ ఉత్పత్తి చేసి దహించాలి. పరికర సామర్థ్యం కూడా పరిగణనలోకి తీసుకుంటే కనీసం 5/0.8 = 6250 మెగావాట్ల సౌర/పవన విద్యుత్ వాడాలి. అంత విద్యుత్ వాడి కేవలం 2 వేల మెగావాట్లు పొందడం అంటే 4250 మెగావాట్లు వృథాగా కోల్పోవడమే. ఇది అర్థరహితం. రాష్ట్రానికి తీరని నష్టం. విజ్ఞులైన రాష్ట్ర నాయకులు ఇలాంటి ప్రతిపాదనల పట్ల జాగరూకతతో వ్యవహరించి నష్టం జరగకుండా కాపాడాలి.

– డా. కలపాల బాబూరావు

కేంద్ర బడ్జెట్‌పై కోటి ఆశలు!

దాదాపు ఆరేళ్ళ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో సముచిత వాటా లభించే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం 2014–18 మధ్య కాలంలో ఏపీకి ఆశించిన స్థాయిలో ఎన్డీఏ–1 ప్రభుత్వం సాయం చేయలేదు. 2019–2024 మధ్య ఐదేళ్ల కాలంలోనైతే చెప్పనే అక్కర్లేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని నాటి వైసీపీ ప్రభుత్వం గట్టిగా నిలదీసిన సందర్భం ఒక్కటీలేదు. రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన పన్నుల వాటాలో కోత పడినా జగన్ పార్టీ ఎంపీలు ఏ ఒక్కరూ పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిలదీయలేదు. కేంద్ర బడ్జెట్, రైల్వే బడ్జెట్‌లలో రాష్ట్రానికి అన్యాయం జరిగినా ఎవరూ పెదవి విప్పలేదు. చివరకు కేంద్రం ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి ఇవ్వజూపిన నిధుల్ని కూడా తెచ్చుకోలేకపోయిన దుస్థితి నాటి ప్రభుత్వానిది. కేంద్రంలో గత రెండు ప్రభుత్వాలూ సంకీర్ణ ప్రభుత్వాలే అయినప్పటికీ బడ్జెట్‌లు మాత్రం సంకీర్ణ బడ్జెట్‌లు కావు. కానీ, ఈసారి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయేది మాత్రం కచ్చితంగా సంకీర్ణ బడ్జెట్ అని చెప్పొచ్చు. మరో విధంగా చెప్పాలంటే– ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలకు చెందిన రాష్ట్రాల సమస్యలకు కొంత మేర ఈ బడ్జెట్‌లో పరిష్కార మార్గాలు లభించే అవకాశం ఉంది.



కేంద్రంలో గత రెండు ప్రభుత్వాలు సంకీర్ణ ప్రభుత్వాలే అయినప్పటికీ బడ్జెట్‌లు మాత్రం సంకీర్ణ బడ్జెట్‌లు కావు. కానీ, ఈసారి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయేది మాత్రం కచ్చితంగా సంకీర్ణ బడ్జెట్ అని చెప్పొచ్చు. మరో విధంగా చెప్పాలంటే– ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలకు చెందిన రాష్ట్రాల సమస్యలకు కొంతమేర ఈ బడ్జెట్‌లో పరిష్కార మార్గాలు లభించే అవకాశం ఉంది.

పరిపాలనారంగంలో ఎంతో అనుభవజ్ఞుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టి నెలరోజులు గడవకముందే జూన్ 5, 6 తేదీలలో చేసిన ఢిల్లీ పర్యటన ఆసాంతం బిజీబిజీగా ఎక్కే గడప, దిగే గడప మాదిరిగా జరిగింది. ప్రధానమంత్రి మోదీతో సహా హోం, ఆర్థిక, రక్షణ, వాణిజ్య, రహదారులు రవాణా, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, ఇంధన, పెట్రోలియం శాఖల మంత్రులను స్వయంగా కలిసి రాష్ట్ర స్థితిగతులను వివరించారు. ఆయా రంగాల్లో అందించవలసిన సాయంపై వారందరికీ వినతి పత్రాలు అందించారు. వీరందరితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర సమస్యల తీవ్రతను వారి దృష్టికి తీసుకెళ్లి సుదీర్ఘంగా చర్చించారు. వీరితోపాటు 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగరియాతో సైతం సమావేశం అయ్యారు. ఈ పర్యటనలోనే ఆయన పలువురు పారిశ్రామికవేత్తలను కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. అంతే కాదు.. కేంద్రస్థాయిలో ఉన్న సీనియర్ అధికారులకు విందు ఏర్పాటు చేసి తన రాష్ట్రానికి సహాయం చేయడంలో త్వరితగతిన స్పందించాలని కోరారు.

కేవలం రెండు రోజుల వ్యవధిలో చంద్రబాబు నాయుడు జరిపిన ఈ సుడిగాలి ఢిల్లీ పర్యటనకు మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎనలేని ప్రాధాన్యం లభించింది. ఆయనతో సమావేశమైన అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన ట్విట్టర్ హ్యాండిల్‌లో 'డైనమిక్ లీడర్ చంద్రబాబుతో జరిపిన సమావేశం ఉత్సాహంగా సాగింది. ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి బాటన సాగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్ పురోగతి, వృద్ధి కోసం ఎలా సాయం చేయాలన్న అంశంపై చర్చించాం' అని పేర్కొన్నారు. అమిత్‌షా మాత్రమే కాదు, చంద్రబాబుతో భేటీ జరిపిన కేంద్ర మంత్రులు పియూష్ గోయెల్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, మనోహర్‌లాల్ ఖట్టర్‌లు కూడా తమ ట్విట్టర్ ఖాతాల ద్వారా సానుకూల సందేశాలు పంపారు.

ప్రస్తుత ఎన్డీఏ–3 ప్రభుత్వం మనుగడ ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం, బిహార్‌లోని జనతాదళ్ (యు)ల మద్దతుపై ఆధారపడి ఉన్నదన్నది బహిరంగ రహస్యమే. కానీ, ఎంతో వివేచన గలిగిన చంద్రబాబునాయుడు బీజేపీకున్న ఈ బలహీనతను ఆసరా చేసుకొని రాష్ట్రానికి సాయం చేసే విషయంలో కండిషన్లు పెట్టాలని అనుకోవడం లేదు. చంద్రబాబు నాయుడు 1999లో నాటి వాజపేయి ప్రభుత్వానికి వెలుపలి నుంచి మద్దతు ఇచ్చినపుడు కూడా బేషరతుగానే సపోర్టు చేశారు. కాకుంటే, నాటి ప్రధాని వాజపేయి చంద్రబాబు నాయుడి పట్ల ఎనలేని అభిమానం చూపేవారు. ఏది అడిగినా కాదనలేదు. అలాగని చంద్రబాబు నాయుడు కోరినవేవీ గొంతెమ్మ కోర్కెలు కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకూ అందంతా గడచిపోయిన ఓ అమృత కాలమేనని చెప్పాలి.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్రను పునరావృతం చేస్తానని గట్టిగా చెబుతున్నారు. 1995 నాటి సిబిఎన్‌ను చూస్తారని ఆయనే స్వయంగా వెల్లడించారు. రాష్ట్ర పరిస్థితుల్ని గాడిలో పెట్టాలంటే ఆనాటి ఉత్సాహం, పట్టుదల, కార్యాచరణ, దృఢ సంకల్పం ప్రదర్శించాల్సిందే. అదే సమయంలో కేంద్ర – రాష్ట్ర సంబంధాల విషయంలో కూడా ఆనాటి చొరవ, పని జరిగే వరకు పట్టువీడని వైఖరి నేడు అవసరం. అగాధంలో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఒడ్డున చేర్చే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వ సహకారం అనివార్యం. ఈ పూర్వ రంగంలోనే కేంద్ర ప్రభుత్వానికి అవసరమైన బలాన్ని అందిస్తున్న తెలుగుదేశం అధినేతకు ఇది కలిసొచ్చే అవకాశం. మొహమాటాలకు పోకుండా ప్రధాని నరేంద్రమోదీపై ఒత్తిడి తేవాల్సిందే! రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు, ప్రాజెక్టులతోపాటు అమరావతి, పోలవరాల నిర్మాణానికి నిధులు; రాష్ట్రంలో ప్రధాన నగరాలను హైదరాబాద్, చెన్నైలతో అనుసంధానం చేసే గ్రీన్‌ఫీల్డ్ హైవేలు; ఔటర్ రింగ్‌రోడ్డులు; బీపీసీఎల్ రిఫైనరీ; ఇంటిగ్రేటెడ్ ఆక్వాపార్క్ మొదలైన వాటితో పాటు విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లలో ఆస్తుల పంపకానికి సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాల సాధనలో కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం.

2019–2024 మధ్య రాష్ట్రంలో ఆస్తుల కల్పన కోసం మూలధన వ్యయం జరగలేదు. సహజ వనరులను యథేచ్ఛగా కొల్లగొట్టడం వల్ల రావాల్సినంత ఆదాయం సమకూరలేదు. ప్రజాధనం కొందరు నేతల జేబుల్లోకి పోయింది. అప్పులు కొండలా పెరిగిపోయాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరి నెలరోజులు దాటిపోయినా అప్పుల లెక్కలు తీయడానికి ఆపసోపాలు పడుతున్నదంటే – గత ప్రభుత్వ విచ్చలవిడితనం, బాధ్యతారాహిత్యం ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నదో అర్థమవుతున్నది. ఇటువంటి దుర్భర పరిస్థితుల నుంచి రాష్ట్రం బయటపడేందుకు కేంద్రం ఏ మేరకు సాయం అందించగలదన్నదే ప్రశ్న.

వాస్తవానికి, దేశ ఆర్థిక ముఖ చిత్రం కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. సుమారు రూ.47 లక్షల కోట్ల నుంచి 50లక్షల కోట్ల రూపాయల అంచనాతో ఈసారి కేంద్ర బడ్జెట్ ఉండే అవకాశం ఉంది. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రకారం మొత్తం రెవెన్యూలో 25శాతం మేర వడ్డీలకు, అప్పు చెల్లింపులకు పోతోంది. రెవెన్యూ లోటు 2శాతంగా ఉంటే, కోశ లోటు 5.1శాతంగా ఉంది. అయితే రెవెన్యూ ఆదాయంలో 12శాతం వార్షిక పెరుగుదల, జీడీపీ వృద్ధిరేటు 10.1శాతం పెరుగుదలను అంచనా వేస్తున్నందున– ఈ ఏడాది దేశ ఆర్థిక రంగం పుంజుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలలో మౌలిక సదుపాయాల విస్తరణ కోసం దాదాపు 1 లక్ష కోట్లు కేటాయిస్తున్నారు. ఈసారి ఈ మొత్తాన్ని పెంచి ఆంధ్రప్రదేశ్, బిహార్‌లకు ఎక్కువ నిధులు కేటాయిస్తారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అలాగే షరతులు లేని దీర్ఘకాలిక రుణాల స్వీకరణలో రాష్ట్రాలకు తగిన స్వేచ్ఛ కల్పించే అవకాశం ఉంది. ఇక, ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం ప్రకారం రుణపరపతిని జీఎస్‌డీపీలో 3శాతం మేర రుణాలు పొందే సౌలభ్యాన్ని సవరించి రాబోయే ఐదేళ్లూ 3.5శాతం మేర రుణాలు పొందే వెసులుబాటును కల్పించవచ్చు. ఈ అంశాలన్నీ రాష్ట్ర ఆర్థికస్థితిని కొంతమేర మెరుగుపర్చే అవకాశం ఉంది.


కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఎంపీలు మంత్రులుగా ఉండటం, పొరుగు తెలుగు రాష్ట్రం తెలంగాణతో సుహృద్భావ సంబంధాలు నెలకొల్పుకోవడం, రాష్ట్రంలో ఆదాయాన్నిచ్చే వనరులను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అమరావతి నగర నిర్మాణానికి శ్రీకారం చుట్టడం, దుబారా అరికట్టడం... మొదలైన అంశాలతోపాటు దార్శనికత కలిగిన నాయకుడు పరిపాలకుడిగా ఉండటం ఆంధ్రప్రదేశ్‌కు కలిసొచ్చే అంశం. మొత్తం మీద కొత్త ప్రభుత్వం తొలి అడుగులు ఆశాజనకంగా పడుతున్నాయి. కేంద్ర సహకారం తోడైతే ఇక రాష్ట్రం వడివడిగా ముందుకు సాగడమే తరువాయి.

• సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

విద్యావ్యవస్థలో మేలు మార్పులు వచ్చేనా?

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విద్యా విధానాన్ని దేశంలోని ఏ రాష్ట్రమూ అనుసరించక ముందే ఏపీలో వైసీపీ ప్రభుత్వం హడావిడిగా నూతన విద్యావిధానాన్ని (ఎన్ఈపి) ప్రవేశపెడుతూ 117 జీవోను విడుదల చేసింది. తద్వారా అప్పటివరకు ఒకటి నుండి ఐదు తరగతుల వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలల నుండి మూడు, నాలుగు, ఐదు తరగతులను వేరుచేసి దగ్గరలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలిపేశారు. దీనివలన బడికి దగ్గరగా ఉన్న ఆయా తరగతుల విద్యార్థులు విద్యకు దూరం అవడం లేదా ప్రైవేటు పాఠశాలలకు మళ్లడం జరిగింది. కరోనా కంటే ముందు ప్రభుత్వ పాఠశాలలలో 38,18,000 మంది విద్యార్థులు ఉంటే కరోనా సమయంలో అన్ని పాఠశాలలు మూతపడటం, ప్రైవేటు విద్యాసంస్థలు అంతకుముందు లాగానే ఫీజులు వసూలు చేస్తూ ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడం లాంటి వాటి వలన ప్రభుత్వ పాఠశాలలలో 2020–21లో 43,42,000 మంది విద్యార్థులు, 2021–22లో 44,29,000 మంది విద్యార్థులు పెరిగారు. కానీ కరోనా తర్వాత ప్రైవేట్ పాఠశాలలు యథాతథంగా పనిచేయడం వలన, ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వలన 2023–24లో విద్యార్థుల సంఖ్య 38,68,000కు తగ్గిపోయింది.

విద్య అనగానే మనకు గుర్తుకు రావాల్సిన అంశాలు విద్యార్థి, విద్యార్జన, ఉపాధ్యాయుడు, విద్యాబోధన, వీరికి అవసరమైన మౌలిక వసతులు. గత ప్రభుత్వం నాడు నేడు పేరిట పాఠశాలలో మౌలిక వసతుల రూపకల్పనే తమ ప్రధాన ధ్యేయమన్నట్లు ప్రకటించి, కొన్నిచోట్ల పాఠశాల పరిసరాలను కొంతమేరకు అభివృద్ధిపరిచి రంగులు వేసి ఇదే రాష్ట్రమంతా జరిగినట్లు కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చుకున్నారు. కానీ వాస్తవానికి జరిగిందేమిటి? నాడు నేడు కోసం విడుదల చేసిన నిధులను దారి మళ్లించడం దగ్గర నుంచి గుత్తేదారులుగా తమ పార్టీ వారికే సమర్పించుకుని అరకొర వసతులతో మమ అనిపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ నిర్మాణాలు పూర్తికాని పాఠశాలలు సుమారుగా 1200కు పైగా ఉన్నాయి. గత ఐదు సంవత్సరాల కాలంలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలు పూర్తిగా నిషేధితమయ్యాయి. గురువు లేకుండా విద్యనేర్పడం అసాధ్యమనే విషయం కూడా ఎరుకలేని ప్రభుత్వంగా వైసీపీ ప్రభుత్వం మిగిలిపోయింది. విద్యాశాఖ అధికారులు కూడా అదే ధోరణితో ఉపాధ్యాయులను బానిసలకన్నా హీనంగా చూస్తూ ప్రకటనలు చేశారు. కానీ ఎన్నికల సమయంలో తామేదో 25 వేల ఉపాధ్యాయులను నియమించినట్లు తప్పుడు ప్రకటనలు ఇస్తూ 1998 డీఎస్సీలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులకు కోర్టు



ఆదేశాల ప్రకారం నియామకపు ఉత్తర్వులు ఇచ్చి అదేదో తమ గొప్పతనం అని ప్రకటించుకున్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో 2002 ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో అందరికీ విద్య లక్ష్యంతో గ్రామాల్లోని కొంతమంది పెద్దలు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తే, ప్రభుత్వం వారికి అవసరమైన ఉపాధ్యాయులను నియమించి విద్యాభివృద్ధికి తోడ్పడటమే. దశాబ్దాల కిందట ఆయా పాఠశాలలకు అమరిన భూమి విలువ పెరగడం వలన, పాలకుల దృష్టి ఆ భూముల మీద పడింది. దాంతో ఆ పాఠశాలలను పూర్తిగా తమకు అప్పగిస్తే ప్రభుత్వమే నిర్వహిస్తుందని లేదంటే ఎయిడ్‌ను తక్షణమే నిలిపివేస్తామని ప్రకటించింది. అదీ కాదంటే ప్రైవేట్‌గా యాజమాన్యాలు తమకు తామే నిర్వహించుకోవాలని చెప్పింది. దీన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించడంతో ప్రభుత్వం వెనుకకు తగ్గినా, 845 పాఠశాలలు తమకు వస్తున్న గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను వదులుకొని ప్రైవేటు పాఠశాలలుగా మారిపోయాయి. 423 పాఠశాలలు పూర్తిగా మూతబడ్డాయి. ప్రస్తుతం కేవలం 837 పాఠశాలలు మాత్రమే మిగిలాయి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 117 జీవో ద్వారా పాఠశాలల విలీనం ఒక పెద్ద దెబ్బ అయితే ఎయిడెడ్ పాఠశాలలు మూతపడడం మరొక దెబ్బ.

విద్యార్థులు ఒక సంవత్సర కాలంలో నేర్చుకోవాల్సిన విషయాలను ఎంతో పరిశోధన చేసి ప్రణాళికబద్ధంగా అమలు చేస్తేనే ఆ విద్య విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆ ప్రణాళికను తయారు చేసేటప్పుడు విద్యార్థుల వయసుకు తగిన మానసిక పరిణతిని కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. ఉపాధ్యాయుల నియామకం కూడా అందుకు తగినట్లుగానే ఉండాలి. కానీ గత ప్రభుత్వం విద్యార్థుల సిలబస్ మీద రకరకాల సర్కస్ ఫీట్లు చేయడం వలన ఈ రోజు విద్యావ్యవస్థ ఎక్కడ ఉందో అర్థం కాని పరిస్థితి నెలకొని ఉంది. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు ఈ పాఠ్య పుస్తకాలను తయారు చేయడానికి ఎస్‌సీఈఆర్‌టీ ఉంది. అయితే ఆ సంస్థను నిర్వీర్యం చేస్తూ సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. ఇక్కడ సిలబస్ అంటే కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే. అన్ని తరగతులకు అది పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టక ముందే 2022–24లో బైజూస్ పేరుతో ట్యాబ్‌లు ఇవ్వడం మొదలుపెట్టారు. అవి ఎందుకు పనికిరాకుండా పోయాయి.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలన్నిటికీ ఒకే విద్యా విధానం అమల్లో ఉండాలి. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య సుమారుగా 39 లక్షలు ఉంటే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య 38 లక్షలు ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం కేవలం ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే మార్పులు, నూతన అంశాలు ప్రవేశపెట్టింది. ఒక్క సిలబస్ మాత్రమే అన్ని పాఠశాలలకు కామన్‌గా ఉంది. ఇటీవల ప్రచురించిన 10వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ప్రైవేటు విద్యార్థులకు వేరుగాను ప్రభుత్వ విద్యార్థులకు వేరుగాను కొన్ని అంశాల తేడాతో పుస్తకాలను ప్రచురించడం గమనార్హం. ఈ విధమైన వ్యత్యాసాల వలన విద్యాశాఖలో జరుగుతున్నది ఏమిటో ఎవరికి అర్థం కానంత గందరగోళం నెలకొన్నది. నిజానికి ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యావ్యవస్థలో చోటుచేసుకుంటున్న ఈ విధమైన మార్పులు విద్యార్థుల భవిష్యత్తు మీద తీవ్ర పరిణామాలను చూపుతున్నాయి. విద్యాశాఖ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ, ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థకు అప్పజెప్పినప్పుడు ఒక తరం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఒక నిర్మాణాత్మకమైన కార్యక్రమం అమలు చేయడానికి వీలు ఉంటుంది. కొత్త ప్రభుత్వం వీటికి సంబంధించిన సమగ్ర నివేదికను వేగంగా తెప్పించుకొని, అవసరమైన మార్పులు చేపడితే విద్యార్థులు మరో విద్యా సంవత్సరం నష్టపోకుండా కాపాడినవారవుతారు.

○ బండ్ల మాధవరావు
కవి, విద్యావేత్త

తగువుపెట్టి లాభపడే అమెరికాతో జాగ్రత్త!

'దలైలామాకి జూన్ 23 నాడు స్వాగతం పలికి, అమెరికన్ ప్రభుత్వ వాహనంలో ఆయన్ని పెద్ద హోటల్‌కి తీసుకెళ్లారు' – అని 'వాయిస్ ఆఫ్ అమెరికా' వార్త. 2017 తర్వాత దలైలామాకి ఇదే మొదటి విదేశీయాత్ర. మోకాలి చికిత్స కోసం జూన్ 21 నాడు బయలుదేరి, స్విట్జర్లాండ్‌లో మధ్యలో ఆగి, అమెరికా చేరారు. ఈ వార్త భారతీయ, తెలుగు మీడియాల్లో పెద్దగా ప్రచారం కాలేదు. ఇంత హఠాత్తుగా గుట్టుగా ఇప్పుడే ఈ యాత్ర ఎందుకు చేయాల్సి వచ్చింది? మోకాలి చికిత్స ఇండియాలో లేదా? 88 ఏళ్ల వృద్ధుడికి అమెరికా యాత్ర ఎందుకు? ఆయన అమెరికాకి వస్తున్నాడని తెలిసిన అమెరికన్ ఎంపీల బృందం ఇండియా దాకా ఎందుకు వచ్చింది? ఈ ప్రశ్నలకు జవాబు జూన్ 21న బ్రహ్మ చెల్లాని రాసిన వ్యాసంలో ఉన్నది. ఈ చైనా వ్యతిరేక నిపుణుడు ఈ అవకాశాన్ని తీసుకొని బైడెన్ దలైలామాని కలిస్తే బాగుంటుందని, జిన్‌పింగ్ పథకాలకు వ్యతిరేకంగా అమెరికా ఇండియాతో కలిసి ఒక 'బహుముఖ వ్యూహా'న్ని రూపొందించాలనీ తన వ్యాసంలో సూచించారు.

అమెరికన్ ఎంపీల బృందం జూన్ 19 నాడు ఇండియా వచ్చి ధర్మశాలకి వెళ్లి దలైలామాను, ఆ మర్నాడు ప్రధాని మోదీని కలిసింది ఇలాంటి వ్యూహంలో భాగంగానే. దలైలామాతో పాటు టిబెట్ ప్రవాస ప్రభుత్వ బృందాన్ని కూడా కలిసి వారు చర్చలు జరిపారు. అంతకుముందు జూన్ 12నాడు టిబెట్ సమస్య పరిష్కారానికై అమెరికా పార్లమెంటులో ఒక బిల్లుని రెండు పార్టీల వారు కలిసి ఆమోదించే ప్రక్రియ ముగిసింది. ఈ బిల్లు ప్రతిని ఫోటో ఫ్రేమ్ కట్టి తెచ్చి దలైలామాకు ఇచ్చి ఆయనకు అమెరికా మద్దతు గట్టిగా ఉంటుందని వాగ్దానం చేశారు. టిబెట్ సమస్యపై దలైలామాతో చర్చలు జరపాలని, ఆయన వారసుడి నియామకంలో చైనా ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర ఉండరాదని ఆ బిల్లులో ప్రకటించారు. కొంత బడ్జెట్‌ను కూడా కేటాయించారు. అతి త్వరలో బైడెన్ ఈ బిల్లుకి ఆమోదం తెలుపుతారని వార్త. దలైలామా వారసుడి నియామకంలో అమెరికాకి ఏం పాత్ర ఉంది? ఇందులో వారి జోక్యం ఏమిటి? దాని కోసం ఇండియా రావటం ఏమిటి?

మోదీ ప్రభుత్వం ఈ వ్యూహానికి అనుకూలంగా ఉందని చెప్పటానికి ఇదంతా స్పష్టమైన సిగ్నల్ అని ఒక అమెరికన్ వ్యాఖ్యాత రాశారు. అందుకే ప్రధానమంత్రి అధికారిక ప్రకటనలో దలైలామా ప్రస్తావన లేదు; కానీ అమెరికాతో 'వ్యూహాత్మక మైత్రి ప్రగతి' ప్రస్తావన ఉంది. దానికి అమెరికాలోని 'ఉభయ పార్టీల గట్టి మద్దతు కొనసాగుతుంది' అన్న సంతోషం విదేశాంగమంత్రి జయశంకర్ చేసిన ట్వీట్లో ఉంది. జూన్ 17–18 తేదీల్లోనే అమెరికా భద్రత సలహాదారు జేక్ సుల్లివాన్ బృందం జయశంకర్‌ను, ఇండియా భద్రత సలహాదారు అజిత్ దోవల్ని కలిసింది. దలైలామా రహస్య యాత్ర ఏర్పాట్లను వారు చర్చించే ఉంటారు.

అమెరికా ప్రతినిధుల్లో నాన్సీ పెలోసి ధర్మశాలలో బహిరంగంగా మాట్లాడి దలైలామాని ఆకాశానికెత్తి, చైనా అధ్యక్షుడిని 'నువ్వు ఎంతోకాలం ఉండవు, పోతావ్, నువ్వు సాధించిందేమీ లేదు' అని బహిరంగంగా తిట్టిపోసింది. 2022లో ఆమె జరిపిన తైవాన్ పర్యటన పెద్ద కల్లోలాన్ని సృష్టించి, అమెరికా – చైనా సంబంధాల్ని చెడగొట్టింది. ప్రస్తుత పరిణామాలు భారత – చైనా సంబంధాలను, సరిహద్దుల్లో శాంతిని దెబ్బతీసే అవకాశం ఉందని అమెరికన్ నిపుణుడు మైఖేల్ కుగెల్మాన్ సూచించారు. అమెరికాతో అక్రమ సంబంధాలే భారత సరిహద్దుల్లో ఘర్షణకి దారితీసి ఉంటాయి అని లోగడ రాశారు. భారత చైనాల మధ్య తగవుపెట్టి లాభపడే అమెరికా వైఖరిపట్ల జాగ్రత్తగా ఉండాలి అని చైనాపత్రిక గ్లోబల్ టైమ్స్ (2023 ఏప్రిల్ 26) లోగడ వ్యాఖ్యానించింది. భారత – చైనా సంబంధాల్లో దలైలామా పాత్ర గయోపాఖ్యానం వంటిదని ప్రముఖ విప్లవకవి జ్వాలాముఖి వివరించేవారు.

రానున్న అమెరికా ఎన్నికల తరుణంలో 'ఉభయుల' ప్రస్తావనకి ప్రాముఖ్యత ఉంది. పైకి ఎన్ని తగవులున్నా ఇండియా పాలకుల్లోనూ అమెరికా సేవ పట్ల ద్వైపాక్షిక ఐక్యత ఉంది. కాంగ్రెస్ ముఖ్యనేత శశి థరూర్ బృందం ఎన్నికల తుదిఘట్టంలో మే 30 నాడు వెళ్లి దలైలామా బృందాన్ని కలిశారు. ఆయన విదేశాంగ శాఖలో మంత్రిగానూ యునైటెడ్ నేషన్స్‌లోనూ పని చేశారు.



అమెరికా, కొన్ని యూరప్ దేశాలూ తమ ఆయుధవ్యాపారాల్ని – ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాలు, చైనాతో కయ్యం ద్వారా – కొనసాగించుకుంటూనే, చైనాతో వ్యాపారాలూ చేస్తున్నాయి. అమెరికా వ్యూహానికి మన దేశ విధానాల్ని లోబరచి, చైనాతో వైరం కొనసాగించి, మన పాలకులు ఇక్కడా అదే పని చేయాలనుకొంటున్నారు. ఇది మన దేశానికీ, ప్రజలకూ, అభివృద్ధికీ, దక్షిణాసియాలో శాంతికీ హానికరం.

దలైలామా కేవలం ఒక ధార్మికగురువు, ఆయనకు రాజకీయ పాత్ర ఏమీలేదు, ఆ పాత్రకి అనుమతి లేదని విదేశాంగ శాఖ ప్రకటించింది. కానీ, పైదంతా రాజకీయమేకదా! అమెరికా ప్రతినిధులు దలైలామాను కలిసి రాజకీయం చేశారు కదా అంటే దానికి వారినే ప్రశ్నించాలి అని ఆ శాఖ ప్రతినిధి దాటవేసారు (టైమ్స్ ఆఫ్ ఇండియా, జూన్ 22).

భారత చైనాల మధ్య ప్రత్యక్ష మీడియా సంబంధాల్లేక, పాశ్చాత్య మీడియాపైనే మొత్తం ఆధారపడే పరిస్థితి ప్రస్తుతం ఉన్నది. చైనా వార్తా సంస్థ 'Xinhua'కు చెందిన ముగ్గురు విలేఖరులని 2016లో మన దేశం నుంచి పంపించేశారు. వీసాలను పొడిగించకుండా జర్నలిస్టులను పంపించివేసే పద్ధతిని అనుసరిస్తున్నారని, 2020 తర్వాత 14 మంది ఉండే చోట ఒక్కరే మిగిలారని చైనా నిపుణులు అనురాగ్ విశ్వనాథ్ ప్రకటించారు. ప్రభుత్వాన్నీ ఎండగట్టే వార్తలు వస్తే బీబీసీకైనా తిప్పలు తప్పలేదు.

కర్ణాటకలోని బైలెకుప్పలో బౌద్ధ ధార్మిక యూనివర్సిటీకి, ముండుగోడులో మరో బౌద్ధ పీఠంకి చెందిన టిబెటన్లను Xinhua విలేఖరులు 2016 ఏప్రిల్లో కలిశారట. ఒక బౌద్ధ తెగవారు దలైలామాను వ్యతిరేకిస్తున్నారని, ఈ తెగకి చెందిన వందలాదిమంది అనేక దేశాల్లో దలైలామా వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించారని వార్త. దలైలామాపై నిరంకుశత్వం, బంధుప్రీతి, మతవిద్వేషం, అవినీతి తదితర ఆరోపణలు చేశారు. అలాంటివారిని కలిసినందువల్ల భారతప్రభుత్వం Xinhua విలేఖరులను సాగనంపిందని, ఈ విషయంలో ఒక పాశ్చాత్య సంస్థ పాత్ర ఉందని ఎకనామిక్ టైమ్స్ పత్రిక (2016 జులై 28) వెల్లడించింది.

టిబెట్టుని ఒక దేశంగా ప్రపంచంలో – అమెరికా ఇండియా యూరోపుల్లో ఏ ఒక్కరూ – గుర్తించరు. అయినా చాటుమాటు సంబంధాలు పెట్టుకుని చైనాని వ్యతిరేకించటానికి దలైలామాను పావుగా వాడుకుంటూ ఉంటారు. 2010 ఫిబ్రవరి 19నాడుదలైలామా అధ్యక్షుడు ఒబామాను కలిసి దొడ్డిదారిగుండా బయటికి వెళుతున్న ఫోటోని అమెరికా పత్రిక 'క్రిస్టియన్ సైన్స్ మానిటర్' ప్రచురించింది. అలాంటి దొడ్డిదారి సంబంధాలే ప్రభుత్వాలతో ఆయనకి నేటికీ ఉన్నాయి. ఇప్పుడు బైడెన్ కూడా అలాగే దలైలామాను కలవాలి అని బ్రహ్మ చెల్లాని సూచించారు. దలైలామా అమెరికా చేతిలో పావు అని; సీఐఏ సంబంధాలు, నిధులు ఉన్నాయని వారే అంగీకరించిన వార్తలు వెలువడ్డాయి. యుద్ధం దాకా వెళ్లకపోయినా 'టిబెట్ కార్డు'ని ఇండియా ప్రయోగించాలి అని నిపుణులు చెబుతూ ఉంటారు. అది మంచిది కాదని, కాశ్మీర్‌ని ఈశాన్యం సమస్యని ఉపయోగించుకొని ఒక్క టిబెట్టు కార్డుకి ప్రతిగా చైనా ఆరు కార్డుల్ని ఉపయోగించగలదని చైనా నిపుణులు అల్కా ఆచార్య (జేఎన్‌యూ) లోగడ వ్యాఖ్యానించారు. అయినా ఈ వ్యవహారంలో మోదీ ప్రభుత్వం ఒకడుగు ముందుకు వేసిందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని వ్యాఖ్యాతలు చెప్పారు.

అమెరికా భద్రతాశాఖ అధికారి జాన్ కిర్బీ జూన్ 17నాడు వాషింగ్టన్‌లో 'ఇదంతా మన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠపరుస్తుంది. ఇంకా ఇండో–పసిఫిక్ ప్రాంతాన్ని మరింత సంపద్వంతం చేస్తుంది' అన్నారు. అమెరికా వ్యూహం ఆయుధ రంగ మృత్యుబేహారులకు వేలాదికోట్ల లాభం చేకూర్చదా మరి! అందులో మన అంబానీ, అదాని, టాటాలు ఉంటారు. అందుకే రక్షణ రంగంలో ఎఫ్‌డీఐని ప్రైవేటురంగాన్ని వందశాతం అనుమతించారు. అమెరికా ఇండియాలది చైనాతో ప్రస్తుతానికి వాణిజ్య సమరమే; అయితే దానికి దోహదకారిగా రక్షణ మౌలిక వసతులతో పాటు ఏటా 7లక్షల కోట్ల రూపాయల రక్షణ బడ్జెట్ ఉన్నది. లక్ష కోట్ల రూపాయల రక్షణ శాఖ ఎగుమతి లక్ష్యం ఉన్నది. ప్రపంచంలోనే నెంబర్ త్రీగా భారత్ ఎదగటానికి ఇది దోహదం చేస్తుంది మరి!

అమెరికా, కొన్ని యూరప్ దేశాలూ తమ ఆయుధవ్యాపారాల్ని – ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాలు, చైనాతో కయ్యం ద్వారా – కొనసాగించుకుంటూనే, చైనాతో వ్యాపారాలూ చేస్తున్నాయి. అమెరికా వ్యూహానికి మన దేశ విధానాల్ని లోబరచి, చైనాతో వైరం కొనసాగించి, మన పాలకులు ఇక్కడా అదే పని చేయాలనుకొంటున్నారు. ఇది మన దేశానికీ, ప్రజలకూ, అభివృద్ధికీ, దక్షిణాసియాలో శాంతికీ హానికరం. ఈ విధానాల్ని గట్టిగా వ్యతిరేకించాలి.

■ ఎమ్. జయలక్ష్మి
'ఆప్కాబ్' రిటైర్డ్ ఏజీఎం

పేదింటి పొట్ట నింపేందుకు ఒకరు.. సొంతూరు వదిలి వలస వచ్చి బతుకీడుస్తున్న వారు ఇంకొకరు.. కష్టాల కుటుంబంలో కన్నీటితో జీవిస్తున్నవారు మరొకరు.. కదిలిస్తే చాలు.. పరిటాల రాతి క్వారీ ప్రమాదంలో మృతులు, వారి కుటుంబ సభ్యుల కన్నీటి కథలు కంటతడి పెట్టిస్తున్నాయి. మృతుల్లో ఒకరు ఎన్టీఆర్ జిల్లా వాసి కాగా, మరో ఇద్దరు ఒడిశా, ఛతీస్‌గఢ్ నుంచి వలస వచ్చి కూలి పనులు చేసుకుంటున్నవారు. కుటుంబాలకు ఆధారమైన వీరు ఒక్కసారిగా తనువు చాలించడంతో మిగిలినవారంతా అనాథలయ్యారు. - జి.కొండూరు/కంచికచర్ల రూరల్

నాలుగు మెతుకుల కోసం రాతి క్వారీల్లో ప్రమాదకర పరిస్థితుల్లో జీవన పోరాటం చేస్తున్న కూలీల బతుకులు నిర్లక్ష్యపు బండరాళ్ల మధ్య నలిగిపోతున్నాయి. ఆదాయమే పరమావధిగా లీజుదారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుంటే, పట్టించుకోవాల్సిన అధికారులు తనిఖీల ఊసెత్తకుండా కూర్చుంటే.. పొట్టకూటి కోసం అల్లాడుతున్న కూలీల బతుకులు కొండెక్కిపోతున్నాయి. పరిటాల పరిధిలోని రాతి క్వారీలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ముగ్గురు కూలీల దుర్మరణం వెనుక లీజుదారుల అంతులేని నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

కొండంత నిర్లక్ష్యం

పరిటాల క్వారీలో ప్రమాదానికి కారణమదే..



బండరాళ్ల మధ్య కార్మికుడి మృతదేహం

- ఎక్కడా నిబంధనలు పాటించని లీజుదారులు
- క్వారీ పైన బండలు తొలగించకుండా దిగువ భాగంలో పనులు
- వర్షానికి ఒక్కసారిగా జారిన బండరాళ్లు
- రాళ్ల మధ్య నలిగిపోయి మృతిచెందిన కూలీలు
- దాదాపు అన్ని క్వారీల్లోనూ నిబంధనలు తూచ్..

కంచికచర్ల, జూలై 15 : కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు తదితర మండలాల్లో 185కు పైగా రాతి క్వారీలు ఉన్నాయి. కంచికచర్ల మండలం పరిటాల గ్రామ పరిధిలోనే కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ సమీపంలో 90కి పైగా క్వారీలు ఉన్నాయి. బండరాళ్లను క్రషింగ్ చేయటం వల్ల రోడ్లు, భవనాలు, ప్రాజెక్టుల నిర్మాణంలో వినియోగించే పలు సైజుల కంకర తయారవుతుంది.

నిబంధనలకు విరుద్ధంగా..

కొండలను పగలగొట్టేందుకు క్వారీల లీజుదారులు జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్ ఫ్యూజ్‌లు, బూస్టర్స్ పవర్‌జెల్, అమ్మోనియం నైట్రేట్ తదితర పేలుడు పదార్థాలను వాడుతున్నారు. క్వారీల్లో భద్రతా ప్రమాణాలు పాటించట్లేదని, బ్లాస్టింగ్ ప్రక్రియ అత్యంత ప్రమాదకరంగా జరుగుతోందని కొద్ది సంవత్సరాల క్రితం కేంద్ర మైనింగ్ శాఖాధికారులు స్పష్టం చేశారు. అయినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. క్వారీల్లో మందుగుండు సామాను వినియోగించి బ్లాస్టింగ్ చేసే సమయంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవట్లేదు. బ్లాస్టింగ్ కోసం కొండలను ఎక్కేందుకు ప్రస్తుతం గట్టితాడు (రోప్)లను వాడుతున్నారు. కానీ, రోప్‌లు వాడకూడదు. కొండ ఎక్కేందుకు, దిగేందుకు వీలుగా ముందుగా మెట్ల మార్గాన్ని (ట్రెంచెస్) ఏర్పాటు చేసుకోవాలి. కానీ, క్వారీల్లో చూద్దామన్నా మెట్ల మార్గాలు కనిపించవు. కూలీలు ఎక్కువగా రోప్‌లనే వాడుతున్నారు. నిత్యం ప్రమాదకరమైన క్వారీల్లో పనిచేస్తున్న కూలీల రక్షణకు లీజుదారులు తగిన పరికరాలు సమకూర్చట్లేదు. పైగా బ్లాస్టింగ్.. శిక్షణ పొందిన

- మిగతా 6లో



ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎక్స్‌కవేటర్లతో బండల తొలగింపు

బతుకు బండలు

పరిటాల రాతి క్వారీ ప్రమాదంలో కన్నీటి కథలు



దుర్గారావు (ఫైల్)



బీబీ నాయక్ (ఫైల్)



రామ్‌దేవ్ బాగేల్ (ఫైల్)

రూ.8.5 లక్షల చొప్పున పరిహారం

కంచికచర్ల రూరల్, జూలై 15 : క్వారీ ప్రమాదంలో మృతిచెందిన బత్తుల దుర్గారావు, బీబీ నాయక్, రామ్‌దేవ్ బాగేల్ కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.8.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు క్వారీ యజమాని రామ్మోహన్‌రావు ఒప్పుకున్నారు. ఇందుకు మృతుల కుటుంబాలు సైతం అంగీకారం తెలిపాయి.

చేతికొచ్చిన బిడ్డను కోల్పోయి ఒకరు

- పొట్టకూటి కోసం వలస వచ్చి మరో ఇద్దరు మృతి
- ఆధారం కోల్పోయి విలపిస్తున్న కుటుంబ సభ్యులు

చితికిన బతుకులు

జి.కొండూరు మండలం చెర్వుమాధవరం గ్రామానికి చెందిన బత్తుల చంద్రం-రాఘవుల పెద్ద కుమారుడు దుర్గారావు. టెన్త్ వరకు చదివి తండ్రి చేస్తున్న డ్రిల్లింగ్ పని నేర్చుకుని కుటుంబానికి ఆధారంగా ఉంటున్నాడు. కాగా, క్వారీ ప్రమాదంలో దుర్గారావు మృతిచెందడంతో ఆ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. త్వరలో మంచి సంబంధం చూసి, పెళ్లి కూడా చేయాలనుకుంటున్న తరుణంలో కన్నబిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని కంటతడి పెట్టారు.

పొట్టకూటి కోసం వలస వచ్చి..

పొట్టకూటి కోసం ఒడిశా నుంచి 20 ఏళ్ల కిందట ఇక్కడికి వలస వచ్చాడు బీబీ నాయక్. ఈ ప్రాంతంలో క్వారీ పనులు చేసుకుంటూ జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో ఓ చిన్న రేకుల షెడ్డులో అద్దెకు ఉంటున్నాడు. రెక్కాడితే కానీ, డొక్కాడని నాయక్ రోజూ మాదిరిగానే భార్య, పిల్లలకు చెప్పి పని నిమిత్తం బయల్దేరాడు. కాసేపటికే ఆయన మరణ వార్త విన్న ఆ కుటుంబం గుండెలవిసేలా విలపిస్తోంది.

ఆధారం కోల్పోయి..

మరో కార్మికుడైన రామ్‌దేవ్ బాగేల్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవాడు. ఈయన కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ ప్రమాదంలో భర్తను కూడా కోల్పోయిన జయమణి బోరున విలపించింది. కూతురు అనీషా (12) ఉంది. తండ్రికి ఏమైందో తెలియక అనిషా బిక్కుబిక్కుమంటూ ఇంటి వద్దే ఉండటం చుట్టుపక్కల వారికి కన్నీరు తెప్పించింది.

కుమ్మేసిన వాన



నిండుకుండను తలపిస్తున్న ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ

నగరంలో భారీ వర్షం

- జిల్లాలో 21.85 మి.మీ వర్షపాతం నమోదు
- పొంగుతున్న కట్టలేరు, వైరా వాగులు
- నిండుకుండలా ప్రకాశం బ్యారేజీ

విజయవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షం దంచికొట్టింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో జిల్లా తడిసిముద్దైంది. ఇక జిల్లావ్యాప్తంగా 21.85 మిల్లీమీటర్ల సరాసరి వర్షం కురిసింది. జి.కొండూరు మండలంలో అత్యధికంగా 59.6, వత్సవాయిలో అత్యల్పంగా 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పొంగుతున్న వాగులు

తెలంగాణలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వాగులు ఉప్పొంగుతున్నాయి. వైరా, కట్టలేరు నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజీ నిండుకుండలా మారింది. వైరా, కట్టలేరు వాగుల నుంచి 3200 క్యూసెక్కుల నీరు వస్తోంది.



నిర్మల కాన్వెంట్ రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

మరోపక్క, పట్టిసీమ నుంచి 6801 క్యూసెక్కుల నీరు కృష్ణానదికి చేరుతోంది. ఈ మొత్తం నీటిని కాల్వలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నీటి అవసరాలు ఎక్కువగా ఉన్నందున ప్రకాశం బ్యారేజీ గేట్లను ఇప్పట్లో ఎత్తే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా, వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో మెట్ట ప్రాంత రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. డెల్టా ప్రాంత రైతాంగం సాగుకు సమాయత్త మవుతోంది. సోమవారం కురిసిన భారీ వర్షానికి నగరం నీట మునిగింది. రహదారులపై నీరు నిలిచిపోయింది. మురుగు కాల్వలు పొంగి ప్రవహించాయి.



వారంలో కొత్త టీమ్

కమిషనరేట్‌లో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

- టెక్నికల్ స్కిల్స్ ఉన్న వారికి ప్రాధాన్యం
- జిల్లాల నుంచి రావడానికి కొందరి ప్రయత్నాలు
- వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్న మరికొందరు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్ వ్యవహారం త్వరలో కొలిక్కిరానుంది. వారంలో ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ పోలీసు కమిషనరేట్ ఏలూరు రేంజ్ పరిధిలో ఒక భాగంగా ఉన్నందున డీఐజీతో చర్చించి బదిలీలు, పోస్టింగ్‌లను ముగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. విజయవాడ సిటీ నుంచి జగ్గయ్యపేట వరకు ఉన్న మొత్తం ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగే సూచనలు కనిపిస్తున్నాయి.

ఎవరు ఉంటారో.. ఎవరు వెళ్తారో..

స్టేషన్ హౌస్ ఆఫీసర్ల సీట్లలో కూర్చోడానికి ఇన్‌స్పెక్టర్లు పోటీ పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది రాజకీయ నేతలను కలిసి తమ మనోగతాన్ని వివరించుకున్నారు. వాస్తవానికి ఇంతకుముందు పనిచేసిన పీహెచ్‌డీ రామకృష్ణ ఇన్‌స్పెక్టర్ల బదిలీలను పూర్తి చేయాలని భావించారు. యూనిట్ ఆఫీసర్‌గా తాను ఉంటానో లేదో తెలియని పరిస్థితుల్లో బదిలీ జోలికి వెళ్లలేదు. ఎన్నికల బదిలీల్లో భాగంగా స్పెషల్ బ్రాంచ్‌కు వచ్చిన ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లకు మాత్రం అటాచ్‌మెంట్లు ఇచ్చారు. ఐదేళ్లుగా మూసధోరణి పోలీసింగ్‌కు అలవాటుపడిన ఇన్‌స్పెక్టర్లు అధికారులను బట్టి కమిషనరేట్‌లో ఉండడమో, వెళ్లడమో చేయాలని నిర్ణయించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలను ఎన్నికల కోడ్ రావడానికి ముందు బదిలీ చేశారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్, కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలను ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న వారిని కృష్ణాజిల్లా, పోలీసు కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఎన్నికల బదిలీలు కావడంతో ఉభయగోదావరి జిల్లాల నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు ఇక్కడ పనిచేయడానికి అంతగా ఆసక్తిని చూపట్లేదు. కొంతమంది మాత్రం పిల్లల విద్యాభ్యాసం రీత్యా ఇక్కడే కొనసాగాలనుకుంటున్నారు.

టెక్నాలజీపై పట్టున్న వారికి పట్టం

త్వరలో జరగబోయే బదిలీల్లో టెక్నాలజీపై పట్టున్న ఇన్‌స్పెక్టర్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచనలో పోలీసు బాస్ ఉన్నట్టు కనిపిస్తోంది. గడిచిన ఐదేళ్ల కాలంలో ఇన్‌స్పెక్టర్లు సీసీటీఎన్ఎస్ జోలికి వెళ్లలేదు. ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ను వదిలేశారు. క్రిమినల్ ట్రాకింగ్ సిస్టంను పక్కన పెట్టేశారు. 'ఈ' బీట్‌ను ఇంటికి పంపేశారు. ఈ మొత్తం ప్లాట్‌ఫాంలను పనిచేయిస్తానని బాధ్యతలు స్వీకరించిన సమయంలో సీపీ రాజశేఖర్‌బాబు వెల్లడించారు. ఈ అంశాలపై పూర్తిస్థాయిలో పట్టున్న ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌ల్లో మొదటి ప్రాధాన్యం ఇచ్చే యోచనలో సీపీ ఉన్నట్టు తెలుస్తోంది. ఇన్‌స్పెక్టర్ల బదిలీలు రేంజ్ మొత్తం మీద జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఏలూరు రేంజ్ డీఐజీతో భేటీ అయ్యాక కొత్త టీంకు సంబంధించిన జాబితాను రూపొందించే సూచనలు కనిపిస్తున్నాయి. కమిషనరేట్‌లో పనిచేసే ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలకు టెక్నాలజీకి సంబంధించిన అంశాలపై శిక్షణ ఇప్పించే యోచనలో రాజశేఖర్‌బాబు ఉన్నారని తెలుస్తోంది.



రహదారిపై విద్యుత్ లైన్లకు అడ్డు ఉన్నాయని..

- ఇష్టానుసారంగా భారీ వృక్షాల నరికివేత
- ఇటుకబట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- మైలవరంలో చెట్ల తొలగింపుపై ప్రజల ఆగ్రహం

6లో..

ప్రతి నీటిబొట్టు ఒడిసి పట్టి..

- విజయవంతంగా జలశక్తి అభియాన్
- ఈ ఏడాది రూ.60.58 కోట్ల వ్యయంతో 4,804 పనుల పురోగతి
- 2023లో రికార్డు స్థాయి పనులు
- కలెక్టర్ సృజన వెల్లడి

6లో..

మరొకరు మృతి

అల్ట్రాటెక్ ప్రమాదంలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



బొంతు శివనారాయణ (ఫైల్)

జగ్గయ్యపేట రూరల్, జూలై 15 : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొంతు శివనారాయణ (45) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం పేరాల గ్రామానికి చెందిన శివనారాయణ.. అల్ట్రాటెక్ కంపెనీలో ఎలక్ట్రీషియన్ సెక్షన్‌లో పని చేస్తూ, ఆ కంపెనీ క్వార్టర్స్‌లోనే ఉంటున్నాడు. ఆయనకు భార్య సీత ఉన్నారు. ఆయన మృతితో పరిహారం కింద ఇస్తున్న రూ.50 లక్షల చెక్కును తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజు కుటుంబ సభ్యులకు అందించారు.

మరో ఇద్దరి పరిస్థితి విషమం

అల్ట్రాటెక్ కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో గాయపడిన 16 మందిలో ఆరుగురి పరిస్థితి విషమంగా మారటంతో ఆంధ్ర, మణిపాల్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. శివనారాయణ సహా ఇప్పటికే నలుగురు మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

కెనాల్ రోడ్డులో కార్ల పార్కింగ్



కమిషనర్ వచ్చేలోపు కమీషన్లు..!

వీఎంసీలో జోరుగా సెటిల్‌మెంట్ దందాలు

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పాలన ఇష్టానుసారంగా సాగుతోంది. పది రోజులుగా పర్యవేక్షించే నాయకుడు లేకపోవడంతో అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ఎవరికి వారు పాత లెక్కలు సరిచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో అనధికార కట్టడాలుగా గుర్తించి కూలగొట్టిన భవన యజమానులతో బేరాలు కుదుర్చుకుంటున్నారు. కీలకమైన పార్కింగ్ ప్రాంతాలను తమకు నచ్చిన ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

- కార్పొరేషన్ కూల్చేసిన భవన నిర్మాణానికి మళ్లీ ఓకే
- భవన యజమానితో టౌన్‌ప్లానింగ్ లాలూచీ
- కెనాల్ రోడ్డు పార్కింగ్ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి..!

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ జూలై 5న బదిలీ అయ్యారు. అప్పటి నుంచి కార్పొరేషన్‌లో వివిధ విభాగాల ఇన్‌చార్జులు చెలరేగిపోతున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కామకోటి నగర్‌లో కన్యకాపరమేశ్వరి కల్యాణమండపం ఎదురుగా ఉన్న ఆరు అంతస్థుల భవనాన్ని జూన్‌లో అనధికార కట్టడంగా గుర్తించి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది శ్లాబ్‌ను స్వల్పంగా ధ్వంసం చేశారు. తాజాగా ఈ భవన యజమానితో కుమ్మక్కైన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మళ్లీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. సుమారు 250 గజాల్లో నిర్మించిన ఈ ఆరు అంతస్థుల భవనానికి రెండు ప్లాన్లను విడివిడిగా తీసుకోవడం గమనార్హం. రెండు ప్లాన్లు తీసుకుని ఒకే భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. ఇంకా నగరంలో పలు అనధికార భవనాల విషయంలోనూ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఇదే విధంగా వ్యవహరిస్తున్నారు.

అప్పనంగా ప్రైవేట్ వ్యక్తులకు

వన్‌టౌన్ కెనాల్ రోడ్డులోని రథం సెంటర్ ఎదురుగా ఉన్న బ్రిడ్జి కింద కార్పొరేషన్‌కు చెందిన

- మిగతా 6లో

అడ్డుగోలుగా..!

- రహదారిపై విద్యుత్ లైన్లకు అడ్డు వున్నాయని..
- ఇష్టానుసారంగా భారీ వృక్షాల నరికివేత
- ఇటుకబట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- చెట్ల తొలగింపుపై ప్రజల ఆగ్రహం

మైలవరంరూరల్, జూలై 15 : కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కొందరు అధికారులు పెడచెవిన పెడుతున్నారు. అభివృద్ధి పనుల పేరుతో రహదారి వెంబడి ఉన్న చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. సంవత్సరాల నాటి భారీ వృక్షాలను సైతం తెగనరికి సొమ్ముచేసుకుంటున్నారు. మైలవరం-పొందుగల, పొందుగల-అనంతవరం పంచాయతీరాజ్ రహదారి వెంట భారీ వృక్షాలు సంవత్సరాలుగా ప్రజలకు నీడనిస్తున్నాయి. అయితే కొద్దిరోజులుగా మైలవరం సబ్‌స్టేషన్ నుంచి పొందుగల, అనంతవరం గ్రామాలకు 24గంటల విద్యుత్ సరఫరా నిమిత్తం కాంట్రాక్టర్ పనులు నిర్వహిస్తున్నాడు. పంచాయతీరాజ్ రహదారి వెంబడి స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్‌ను లాగుతున్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను పదుల సంఖ్యలో మొదలు వరకు తొలగించివేస్తున్నారు. విద్యుత్ లైన్ పనులను కాంట్రాక్టర్‌కు అప్పచెప్పి అధికారులు చేతులు దులుపుకోవడంతో కాంట్రాక్టర్ చెట్లను నరికి ఇటుక బట్టీలకు అమ్ముకోవడం గమనార్హం. పెద్ద ఎత్తున చెట్లు నరుకుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అభివృద్ధి పనులకు చెట్లు అడ్డువస్తే కొమ్మలు తీసివేయడం సర్వసాధారణం. లేదా ఆధునిక పద్ధతిలో ఆ చెట్టును వేరొక చోటకు తరలించాలి. కానీ మొదళ్ల వరకు చెట్లు నరికివేస్తుండటంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీడనిచ్చే చెట్లను పెద్ద సంఖ్యలో నరికివేస్తుంటే బాధ్యత గల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికులు సైతం అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడీ వివరణ : ఈ విషయంపై మైలవరం విద్యుత్‌శాఖ ఏడీ సుధాకర్‌ను వివరణ కోరగా విద్యుత్ లైన్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా అవసరమైన మేరకు చెట్లను తొలగించవచ్చునని, చెట్లు నరికివేసిన విషయం తెలియదన్నారు. చెట్ల తొలగింపు విషయంపై ఆరా తీస్తానన్నారు.





పొందుగల సమీపంలో నరికేసిన చెట్లు.. ట్రాక్టర్‌పై కొమ్మల తరలింపు



జాతీయ రహదారిపై కట్టుబడిపాలెం వద్ద నిలిచిన వర్షపు నీరు

జాతీయరహదారిపై వర్షపు నీరు

- పట్టని అధికారులు.. వాహనదారుల కష్టాలు

జి.కొండూరు, జూలై 15 : ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ 30వ జాతీయ రహదారిపై వర్షపు నీరు 100 మీటర్ల మేర మోకాళ్ల లోతున నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇంజన్లలోకి నీరు చేరుతుందా అన్నంతగా నీరు నిలిచిపోయింది. కట్టుబడిపాలెం వద్ద హెచ్‌పీసీఎస్-బీసీపీఎల్ కంపెనీల మధ్య గతంలో సహజసిద్ధ వాగు కొందరు ఆక్రమణదారుల చెరపడటంతో పూడిపోయి వర్షపు నీరు దిగువకు వెళ్లకుండా రహదారిపైనే నిలుస్తున్నది. దీనిపై కట్టుబడిపాలెం సర్పంచ్ డి.సత్యావతి ఆర్.ఎస్ నంబరు 109, 110, 118, 111లను సర్వే చేయించి వాగును సరిచేయాలని వినతిపత్రం ఇచ్చినా అధికారుల్లో చలనం లేదు. ఎన్.హెచ్ అధికారులకు సమాచారం ఇద్దామన్నా ఫోన్‌కు స్పందించడం లేదని ఆమె తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం సర్వే చేయించి వాగును పునరుద్ధరించాలని, రోడ్డుపై వర్షపు నీటిని బయటకు పంపే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



పల్లపు ప్రాంతాల్లోకి చేరిన వరద నీరు.. పంట పొలాల్లోకి వరద నీరు

పొంగిపొర్లిన దొర్లింతల వాగు

- పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు.. ఇబ్బందులు పడిన ప్రజలు

జి.కొండూరు, జూలై 15 : మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలకు తోడు భారీ వర్షంతో పలు వాగులు పొంగి పొర్లాయి. గడ్డమణుగులోయ నుంచి దొర్లింతల వాగుకు భారీగా వరద వచ్చి చేరింది. అయితే వరద పులివాగులో కలిసే ప్రాంతంలో దొర్లింతల వాగు ఆక్రమణలకు గురికావడంతో వరద నీరు ఎగదన్ని కేజీవై రోడ్డుపై ఉన్న గెయిల్ నుంచి పరిసర ప్రాంతాల్లో ఉన్న పల్లపు ప్రాంతాలు, పొలాలను ముంచెత్తింది. దీంతో స్థానిక నివాసితులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



జోరువానలో జగ్గయ్యపేట డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

హైర్ బస్సుల బదలాయింపుపై జేఏసీ ధర్నా

జగ్గయ్యపేట, జూలై 15 : జగ్గయ్యపేట డిపో నుంచి హైర్ బస్సులను విజయవాడ డిపోకు బదలాయించడాన్ని నిరసిస్తూ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల జగ్గయ్యపేట డిపో మనుగడకే ముప్పు వాటిల్లనుందని, డిపో ఆదాయానికి ఆయువు పట్టులా ఉన్న రూట్‌లో బస్సులను విజయవాడ డిపోకు బదలాయించటం వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని ఆరోపించారు. అధికారులు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో జేఏసీ నేతలు ఆనంద్, హిమామ్, భాస్కరరావు, వీఆర్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిపో మేనేజర్ రఘురాంకు వినతిపత్రం అందజేశారు.

పార్లమెంట్‌లో జనగళం వినిపిస్తా.. : బాలశౌరి

మచిలీపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ వల్లభనేని బాలశౌరిని మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు, పవన్‌కల్యాణ్ ఆశయాలను నెరవేర్చేందుకు తన వంతుగా పార్లమెంటులో గళం వినిపిస్తానన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులను తీసుకువచ్చేందుకు కృషిచేస్తానని చెప్పారు. బందరుపోర్టు అభివృద్ధితోపాటు, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకోసం పనిచేస్తానని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో జాతీయరహదారుల నిర్మాణానికి, విస్తరణకు అనుమతులు, నిధులు తీసుకువస్తానని పేర్కొన్నారు.





ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌లో చాంపియన్ ఎన్టీఆర్ జిల్లా

విజయవాడ స్పోర్ట్స్, జూలై 15 : కర్నూలు డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం ముగిసిన 9వ ఆంధ్రప్రదేశ్ జూనియర్, సబ్‌జూనియర్ అంతర్ జిల్లాల(రాష్ట్రస్థాయి) స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. 30 స్వర్ణాలు, 21 రజతాలు, 14 కాంస్యాలతో మొత్తం 227 పాయింట్లతో అగ్రస్థానాన్ని జిల్లా స్విమ్మర్లు వశం చేసుకున్నారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ తెలిపారు. కృష్ణాజిల్లా 89 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ట్రెజరర్ డీవీడీ భాస్కర్‌లు అభినందించారు.

ప్రతి నీటిబొట్టు ఒడిసి పట్టి..

- విజయవంతంగా జలశక్తి అభియాన్
- ఈ ఏడాది రూ.60.58 కోట్ల వ్యయంతో 4,804 పనుల పురోగతి
- 2023లో రికార్డు స్థాయి పనులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



జలశక్తి అభియాన్‌పై అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

విజయవాడ లీగల్, జూలై 15 : నీటి సంరక్షణ, పారుదల సామర్థ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లాలో చేపడుతున్న జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, సమన్వయ అధికారి జి.సృజన అన్నారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జలశక్తి అభియాన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో పూర్తయిన, చేపడుతున్న పనుల పురోగతిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ డైరక్టర్, జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి బి.మాధవరావు, 'సి' ఎస్ఆర్ శాస్త్రవేత్త రేష్మా ఎస్. రామన్ పిళ్లైకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నీటి బొట్టు ఒడిసిపట్టి కేంద్ర ప్రభుత్వ నీటి సంరక్షణ నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచే జలశక్తి అభియాన్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని రెండు దశల్లో చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో తొలిసారిగా జలశక్తి అభియాన్ 2019 జూలై నుంచి అక్టోబరు వరకు మొదటి దశ, రెండవ దశలో నవంబర్ నుంచి డిసెంబర్ వరకు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంజీఎస్ఆర్ ఈజీఎస్, జలశక్తి వనరులు, అటవీ, వ్యవసాయ, ఉద్యాన, ఆర్‌డబ్ల్యుఎస్, గ్రౌండ్‌వాటర్ తదితర శాఖల సమన్వయంతో జల సంరక్షణ, వర్షపునీటి పెంపుదలకు ఫార్మపాండ్ చెక్‌డ్యాం పనుల్లో భాగంగా చిన్న, సన్నకారు రైతుల పొలంలో పంట కుంటలు, ఊట కుంటల తవ్వకం, నదీ పరీవాహక ప్రాంతాల్లో చెక్‌డ్యాం నిర్మాణం, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, సాంప్రదాయ నీటి వనరులు/చెరువుల పునరుద్ధరణలో చెరువులు పూడిక తీయడం, గట్లపై మొక్కల పెంపకం, కాలువల పూడిక తీయడం, బోర్‌వెల్ రిచార్జ్ నిర్మాణాలు, వాటర్ షెడ్ల అభివృద్ధి సమగ్ర అటవీకరణలో పనులు చేపట్టి పూర్తిచేయడం జరిగిందన్నారు. చెరువుల్లో పూడికతీత, గట్ల వెంబడి మొక్కలు నాటడం, ఆహ్లాదకర వాతావరణం కల్పించడం వంటి లక్ష్యంతో చేపట్టిన అమృత్ సరోవర్ కార్యక్రమంలో లక్ష్యానికి మించి విజయవంతంగా పూర్తిచేశామన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా చేసేలా చర్యలు తీసుకొన్నామన్నారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్, మ్యాపింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ ఏడాది వర్షాకాల రుతుపవన సీజన్‌లో జలశక్తి అభియాన్ ద్వారా, అమృత్ సరోవర్ ద్వారా మొత్తంగా 4,804 పనులను రూ.60.50 కోట్ల వ్యయంతో చేపట్టామని, ఇప్పటికే కొన్ని పూర్తి కాగా మరికొన్ని ప్రగతిలో వున్నామని కలెక్టర్ తెలిపారు. జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి బి.మాధవరావు మాట్లాడుతూ, జిల్లాలో చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్, మ్యాపింగ్ నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. 'సి' ఎస్ఆర్ శాస్త్రవేత్త రేష్మా ఎస్ రామన్ పిళ్లై మాట్లాడుతూ, జలశక్తి అభియాన్‌లో పంచాయతీ భూములు, నిరుపయోగ భూములలో రీచార్జి నిర్మాణాలను చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం జలశక్తి అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో భూగర్భ జల శాఖ జిల్లా అధికారి నాగరాజు, డ్వామా పీడీ జె.సునీత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, ఉద్యానవన శాఖ అధికారి పి.బాలాజీ కుమార్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీఓ శివప్రసాద్ యాదవ్, ఎస్‌సి ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ డీవీ రమణ, గ్రౌండ్ వాటర్ డీడీ నాగరాజా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నున్నలో కేంద్ర బృందం పర్యటన

విజయవాడ లీగల్ : జలసంరక్షణ పథకం అమలుపై జలశక్తి అభియాన్ కేంద్ర బృందం నున్నలో పర్యటించింది. నోడల్ అధికారి మాధవరావు, సైంటిస్టు రేష్మ నున్న, పాతపాడులో ఫారం పాండ్‌లు, చెట్ల పెంపకం, రింగ్ ట్రెంచ్‌లు, రీచార్డ్ పిట్‌లు తదితర పనులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఎన్టీఆర్ జిల్లాలో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు జిల్లా అధికారులను అభినందించారు. ఎన్టీఆర్ జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం కేంద్ర బృందం సోమవారం ఎన్టీఆర్ జిల్లాకు వచ్చింది. తొలిరోజు విజయవాడ రూరల్ మండలం నున్న, పాతపాడు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భూగర్భ జలాలు, నీటి సంరక్షణ కోసం మామిడి తోటలో తవ్విన ఫారంపాండ్, రింగ్ ట్రెంచ్ పనులను పరిశీలించారు. క్షేత్ర పర్యటన సందర్భంగా కేంద్ర బృందం రైతులు, లబ్ధిదారులతో మాట్లాడి పథకాలపై అభిప్రాయాన్ని సేకరించింది. అలాగే పథకం అమలు, వినియోగంపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరక్టర్ జె.సునీత, జిల్లా పంచాయతీ అధికారి శివప్రసాద్ యాదవ్, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండింగ్ ఇంజినీర్ రమణతో కలిసి బృంద సభ్యులు కాలువ ప్లాంటేషన్, తాగునీటిని పరిశీలించారు. క్షేత్ర పర్యటనకు ముందు బృందం సభ్యులు జిల్లా కలెక్టర్, ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ జి.సృజనతో సమావేశం నిర్వహించారు.



నున్నలో పర్యటించిన జల అభియాన్ కేంద్ర బృందం

విధుల్లో అలసత్వం వద్దు

- ప్రజల అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సృజన, జేసీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

కృష్ణలంక, జూలై 15 : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని బాధ్యతతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారులు ప్రజలకు జవాబుదారులుగా వ్యవహరించినప్పుడే లక్ష్యాలు సాధించగలుగుతామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సోమవారం కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విధుల నిర్వహణ, ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోమన్నారు. ఉద్యోగులు, అధికారులకు ప్రభుత్వం సెలవులు వినియోగించుకోవడంలో నిర్దిష్టమైన నిబంధనలు ఉంటాయన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సెలవులు పెడితే అనుమతించబోమన్నారు. విధి నిర్వహణలో అధికారుల పనితీరు ప్రభావం కిందిస్థాయి సిబ్బందిపై కూడా పడుతుందన్నారు. ఎప్పటికప్పుడు ప్రతి శాఖపై ప్రత్యేక దృష్టి పెడతానని, లక్ష్యసాధనలో జాప్యాన్ని గుర్తిస్తే చర్యలకు వెనుకాడనన్నారు. వార్తా పత్రికల్లో వచ్చే సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించి అదేరోజు వివరణ నివేదికను అందచేయడంతో పాటు పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలకు నిర్దిష్ట గడువులోగా శాశ్వత పరిష్కారం చూపి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ టీఈఎం రాజు, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఈఓ వెంకట సుబ్బారావు, వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, జిల్లా క్షయవ్యాధి కంట్రోల్ అధికారిణి ఉషారాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ప్రియాంక, ఉద్యాన అధికారి బాలాజీకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డి.వెంకటరమణ, సర్వశిక్ష అభియాన్ ఉమామహేశ్వరరావు, డీఐపీఆర్ఓ యు.సురేంద్రనాథ్, వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అన్నేకు మంత్రులు, నేతల నివాళి



గొల్లపూడి, జూలై 15 : గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ నేత అన్నే రామకృష్ణ (ఓటర్ రాము)కు టీడీపీ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. గొల్లపూడిలో ఎస్.ఎస్.ఎస్ అపార్ట్‌మెంట్‌లో ఉంచిన ఆయన పార్థివ దేహంపై మంత్రి కొల్లు రవీంద్ర, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌లు టీడీపీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. అనంతరం అంతిమయాత్రలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొని రాముకు జోహార్లు అర్పించారు.

గోనెసంచుల డబ్బులు ఇప్పించండి

- కలెక్టర్‌కు డీలర్ల అసోసియేషన్ నేతల విజ్ఞప్తి

కృష్ణలంక, జూలై 15 : వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించి రేషన్ డీలర్ల నుంచి తీసుకున్న 5 లక్షల ఖాళీ గోనె సంచుల తాలూకా బకాయిలు రూ.1 కోటి వెంటనే ఇప్పించాలని కోరుతూ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల శేషు అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సృజనకు రేషన్ డీలర్లు వినతి పత్రం సమర్పించారు. చంద్రబాబు హయాంలో డీలర్లకు ఇస్తున్న కమీషన్‌తో పాటు గోనెసంచులు కూడా డీలర్లకే చెందుతాయని ఇచ్చిన జీవోను వైసీపీ ప్రభుత్వం రాగానే డోర్ డెలివరీ పేరుతో తుంగలో తొక్కిందన్నారు. జిల్లాలో ఎంఎల్ఎస్ పాయింట్లలో వున్న కాటాను వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి శివప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ వచ్చేలోపు కమీషన్లు..!

(5వ పేజీ తరువాయి)

పార్కింగ్ ప్రదేశంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా పార్కింగ్ నిర్వహిస్తున్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పేరుతో ఉన్న టోకెన్లను జారీ చేస్తున్నారు. కారుకు రూ.50 చొప్పున పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు. వినాయకుడి గుడి వెనుక ప్రాంతంలో పార్కింగ్ ఫీజు వసూలు వేలం పాటను గత ఏడాది జూన్ 28న కార్పొరేషన్ అధికారులు నిర్వహించారు. ఏడాది పాటు వాహనాల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేసేందుకు వన్‌టౌన్‌కు చెందిన కాంట్రాక్టర్ వెన్నం రజనీ కుమార్ పాడుకున్నారు. ఏడాదికి రూ.5.71 లక్షలు కార్పొరేషన్‌కు చెల్లించారు. లీజు కాలపరిమితి ఈ ఏడాది జూన్ 27తో ముగిసింది. అప్పటి నుంచి ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా పార్కింగ్ ఫీజు వసూలు చేసుకుంటున్నారు. ఇక్కడి పార్కింగ్ వ్యవహారంపై నగరానికి చెందిన ఒక వ్యక్తి గత ఏడాదే కోర్టును ఆశ్రయించారు. వెన్నం రజనీకుమార్‌కు తక్కువ ధరకే టెండర్ కట్టబెట్టారని, తాను కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.20 లక్షలు చెల్లిస్తానని, తనకు లీజుకు ఇవ్వాల్సిందిగా కోరారు. దీనిపై కోర్టు స్పందిస్తూ పిటిషన్‌దారుడు ఎక్కువ సొమ్ము చెల్లిస్తానని అంటున్నాడని, అతను వేలం పాటలో పాల్గొంటే అనుమతించాల్సిందిగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసు ఈనెల 23న విచారణకు రానుంది. ఈలోగానే ఈ పార్కింగ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమవుతున్నారు. కొత్త కమిషనర్ బాధ్యతలు స్వీకరించేలోపు ఈ వ్యవహారాన్ని ముగించేయాలని చూస్తున్నారు.

కొండంత నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

నిపుణుల పర్యవేక్షణలో జరగాలి. కానీ, నిపుణులెవరూ ఇక్కడ కనిపించరు. కూలీలే ప్రాణాలను పణంగా పెట్టి బ్లాస్టింగ్ చేస్తుంటారు. రెక్కలు ముక్కలయ్యేటట్టుగా బండ చాకిరీ చేయటం తప్ప కూలీలను పట్టించుకునేవారు ఉండరు.

గాతాల మాటున ఘాతుకాలు

రెండు దశాబ్దాల కిందట పది గాతాలు ఏర్పాటుచేసి మందుగుండు సామాను నింపి పేల్చేవారు. ఇప్పుడు వందల సంఖ్యలో గాతాలు వేసి ఒకేసారి పేల్చుతుండటంతో తీవ్రస్థాయిలో ప్రకంపనాలు వస్తున్నాయి. మైనింగ్ నిబంధనల ప్రకారం గాతం లోతు 7.5 మీటర్లలోపు ఉండాలి. ప్రస్తుతం రిగ్గుల ద్వారా 30 మీటర్లకు పైగా లోతు తవ్వేస్తున్నారు. వందల గాతాల్లో జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, అమ్మోనియం నైట్రేట్ కూర్చి ఒకేసారి పేల్చుతుండటంతో కొండ ముక్కలై మూడు, నాలుగు వేల టిప్పర్ల బండ రాళ్లు పడతాయి. పేలుడు తీవ్రతకు ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోతోంది. ప్రకంపనాలకు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతింటున్నాయంటే పేలుడు తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. క్వారీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, కూలీల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నప్పటికీ లీజుదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని దొనబండ కొండల్లోని క్వారీలో సోమవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతిచెందడం వెనుక యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వర్షాకాలంలో క్వారీల్లో పనులు చేసేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రోజుల తరబడి వర్షాలు పడుతున్నప్పుడు పనులు చేయకూడదు. క్వారీల్లోకి కూడా వెళ్లకూడదు. వర్షాలకు మట్టి జారి పైభాగంలోని బండరాళ్లు కింద పడతాయి. జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు పడుతున్నాయి. మరో రెండు రోజులు ఇలాగే కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ప్రమాదం జరిగిన క్వారీ పైభాగంలో కొద్దిరోజుల క్రితం బ్లాస్టింగ్ జరిగింది. పైభాగంలో పగిలిన బండలను తొలగించకుండా క్వారీ దిగువ భాగంలో పనులు చేయించకూడదు. క్రషర్‌లో క్రషింగ్ చేయటానికి వీలుపడని బండలను బ్రేకర్స్‌తో పగలగొట్టాలి. అయితే, కొంతమంది లీజుదారులు బండలకు డ్రిల్లింగ్ మిషన్‌తో గాతాలు పెట్టి బ్లాస్టింగ్ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో బండలకు గాతాలు పెట్టేందుకు వెళ్లిన ముగ్గురు కూలీలు ప్రమాదానికి గురయ్యారు. గాతాలు పెడుతుండగా, పై భాగం నుంచి ఒక్కసారిగా బండరాళ్లు మీద పడ్డాయి. రాళ్ల మధ్య నలిగిపోయిన కూలీలు క్షణాల్లో మృత్యుఒడికి చేరారు.

ఎంపీ కేశినేని చిన్ని సంతాపం

పరిటాల ప్రమాదంలో మృతులకు ఎంపీ కేశినేని చిన్ని సోమవారం సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేస్తూ క్వారీ ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడటం బాధాకరమన్నారు. సంఘటన తెలిసిన వెంటనే కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన సహాయం అందించాలని సూచించారు.




రాజుపేటలో ఆధార్ ఆన్‌లైన్ చేస్తున్న సభ్యులు

ఆన్‌లైన్ రుణాల పేరుతో నగదు వసూళ్లు!

తిరువూరు, జూలై 15 : మెప్మా సభ్యులు ఆధార్‌కార్డులు ఆన్‌లైన్ చేసుకుంటే రుణం పొందవచ్చని, మహిళల్ని నమ్మించి నగదు వసూలు చేసిన వారిని మునిసిపల్ కమిషనర్ సూచన మేరకు పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సోమవారం పట్టణ పరిధిలోని మెప్మాగ్రూపులకు చెందిన కొందరు లీడర్లు, చేతివృత్తుల వారికి రుణాలు ఇస్తారని, మీ ఆధార్ కార్డు ఆన్‌లైన్ చేసేందుకు విజయవాడ నుంచి సిబ్బంది వచ్చారని, సభ్యులు రావల్సిందిగా ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చి ఎక్కడి రావాలో సూచించారు. విజయవాడ నుంచి వచ్చిన వ్యక్తులతో స్థానిక మెప్మా సిబ్బంది ఉండటం గమనార్హం. ఆన్‌లైన్ చేసేందుకు ప్రతి సభ్యురాలు రూ.150లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సుమారు 400 మంది సభ్యుల నుంచి రూ.150 చొప్పున వసూలు చేసినట్టు సమాచారం. రాజుపేట ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చిన కొందరు సభ్యులు మీరు ఎవరు.. ఆన్‌లైన్ చేసేందుకు నగదు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో మెప్మా గ్రూపుల వివో ఒకరు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకంలో చేతివృత్తుల వారికి రుణాలు ఇచ్చేందుకు, ఆధార్‌కార్డు ఆన్‌లైన్ చేయిస్తున్నట్టు వివరించింది. నగదు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించడంతో, మెప్మా సిబ్బందికి, సభ్యులకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ లోవరాజును వివరణ కోరగా, తనదృష్టికి ఈ విషయం వచ్చిందని, అనుమతులు ఉన్నాయని వారు చెబుతున్నా.. ఉన్నాతాధికారుల నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో విషయం పోలీసుల దృష్టికి తీసుకువెళ్లామని, విజయవాడ నుంచి వచ్చిన వారినుంచి సమాచారం సేకరిస్తున్నారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగ్గయ్యపేట రూరల్, జూలై 15 : జాతీయ రహదారిపై ఆదివారం గుర్తు తెలయని వాహనం ఢీకొన్న ఘటనలో మండలంలోని అనుమంచిపల్లి గ్రామానికి చెందిన నల్లమట్ల గోపి (25) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిల్లకల్లు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి విచారణ చేస్తున్నారు. మృతుడికి భార్య సింధు, మూడేళ్ల రిషిత, ఐదు నెలల సంగీత ఉన్నట్టు బంధువులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. టీడీపీకి సానుభూతిపరుడిగా ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న గోపి ఆదాయం లేక ఆటోఫైనాన్స్ కట్టకపోవటంతో ఇటీవల యాజమాన్యం ఆటోను తీసుకెళ్లింది. కుటుంబాన్ని పోషించేందుకు భవన నిర్మాణ కార్మికునిగా పనులకు వెళ్తున్నాడని బంధువులు తెలిపారు. గోపి మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

18న తాగునీటి సరఫరా నిలిపివేత

చిట్టినగర్, జూలై 15: హెడ్ వాటర్‌వర్క్స్‌లో 5 ఎంజీడీ సంపు మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 18 సాయంత్రం పశ్చిమలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని సర్కిల్-1 ఈఈ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనివాస్‌మహల్, ఫిష్‌మార్కెట్, గాంధీబావి-1, గాంధీబావి-2, అంబేద్కర్‌కాలనీ, ఓఆర్ఆర్ఎస్, గాంధీజీ హైస్కూల్, రథం సెంటర్, పూలబావి, శివాలయం, కొట్టేటి కోటయ్యవీధి, నైజాంగేటు తదితర ప్రాంతాల్లో ఈ నెల 18న సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపి వేయటం జరుగుతుందని, ప్రజలు ముందుగానే తాగునీరు పట్టుకుని నిల్వ చేసుకోవాలని ఆయన సూచించారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్



అర్జీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

చిట్టినగర్, జూలై 15: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఏ.మహేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 19 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని ఇన్‌చార్జి కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) కె.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ మ్యాన్‌హోల్స్ రోడ్డు లెవల్‌కు సరి చేయండి

వర్షాకాలం ప్రజలకు, వాహనచోదకులకు ఇబ్బందులు కలగకుండా రోడ్ల వెంబడి వర్షంనీరు నిల్వకుండా చూడాలని సంబంధిత అధికారులను నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ ఆదేశించారు. సోమవారం ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ అధికారులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంలో పలు చోట్ల రోడ్ల వెంబడి వర్షంనీరు నిలిచి పోవడాన్ని గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. 27, 28 డివిజన్లలో బీఆర్టీఎస్‌రోడ్డు, భానునగర్, 29వ డివిజన్ పప్పుల మిల్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రాజభవన్ రోడ్డులో మ్యాన్‌హోల్స్ రోడ్డుకు కంటే ఎత్తు తక్కువగా ఉండటంతో నీరు నిలిచిపోవడాన్ని గమనించి వెంటనే సరి చేయాలని ఆదేశించారు. విజయ టాకీస్ సిగ్నల్ వద్ద పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్‌ను గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 27, 28, 29, 49 డివిజన్లలో పారిశుధ్య పనులతోపాటు ఆయా ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్రీరాం ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటాం

● హోం మంత్రి అనిత



వన్‌టౌన్, జూలై 15: ఇటీవల హత్యకు గురైన పశ్చిమకు చెందిన రాం ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని, నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండి రాకేష్ సోమవారం రాం ప్రసాద్ కుటుంబసభ్యులను అనిత వద్దకు తీసుకు వెళ్లారు. రాం ప్రసాద్ కుటుంభ్యులు హోం మంత్రి వద్ద కన్నీరు పెట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. రాం ప్రసాద్ హత్య కేసులో నలుగురు నిందితులు ఉండగా, ఒకరిని మాత్రమే అరెస్టు చేశారని, వారితో తనకు ప్రాణహాని ఉందని రాం ప్రసాద్ భార్య తెలిపారు. తన కుమార్తెలకు రోజూ బెదిరింపు కాల్స్ కూడా వస్తున్నాయని వివరించారు. హోం మంత్రి అనిత స్పందిస్తూ ప్రభుత్వం నుంచి సహాయం చేస్తామని, నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోం మంత్రిని కలిసిన వారిలో కారంశెట్టి రాధ, గురునాథం తదితరులున్నారు.



శివాజీకేఫ్ సెంటర్‌లో



కేఎల్ రావునగర్‌లో,



పాత బస్టాండ్ వద్ద

నేటితరానికి ఆదర్శప్రాయుడు కేఎల్ రావు

సత్యనారాయణపురం, జూలై 15: సాగు, తాగునీరు, విద్యుత్ రంగంలో ప్రణాళికల రూపకర్త డాక్టర్ కేఎల్ రావు అని సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. స్థానిక శివాజీకేఫ్ సెంటర్‌లో సత్యనారాయణపురం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ కేఎల్ రావు (కానూరి లక్ష్మణరావు)122వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎల్ రావు జీవితం నేటి తరాలకు, యువతరానికి ఆదర్శప్రాయం అన్నారు. అభివృద్ధి కమిటీ నేతలు మురళీ, రమణ, ప్రవీణ్, రమేష్, సాగర్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్: పాతబస్తీ పలు ప్రాంతాల్లో సోమవారం డాక్టర్ కేఎల్ రావు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోతిన పైడిరావు, దేవంగుల వెంకటరమణ, మద్దిరాల కమలాకర్, కడిమెళ్ల కాశేశ్వరరావు, నన్నం దుర్గాదేవి తదితరులు కేఎల్ రావునగర్‌లో డాక్టర్ కేఎల్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వరకల సుధీర్‌కుమార్, దుద్దూకూరు శివ, కుంభా నాగేశ్వరరావు, పద్మ, ఉన్నాం శ్రీరాములు, జి.క్రాంతి, శ్రీనివాస్ స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ బై బ్రాహ్మణ ట్రస్ట్ నివాళి

వన్‌టౌన్: డాక్టర్ కేఎల్ రావు జయంతి సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బిజినెస్ బై బ్రాహ్మణ ట్రస్ట్ నివాళి సమర్పించింది. ముఖ్య అతిథిగా విజయవాడ మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, ట్రస్ట్ ఫౌండర్, ట్రస్టీ బుర్రా ఫణిచంద్ర, కోర్ కమిటీ సభ్యులు చెరువు రామకోటయ్య, వెంకట శర్మ, పవన్‌కుమార్, దూబగుంట శ్రీనివాస్, విజయవాడ శాఖ కార్యవర్గ సభ్యులు కృష్ణకుమార్, గండూరి మహేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్ రావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా కేఎల్ రావుతో తనకున్న పరిచయాన్ని జంధ్యాల శంకర్ గుర్తు చేసుకున్నారు. బుర్రాఫణి చంద్ర మాట్లాడుతూ జనహితుడుగా కేఎల్ రావు కీర్తి పొందారన్నారు. తన సాంకేతికతను జోడించి చరిత్రలోనే మహాద్భుతమైన నాగార్జునసాగర్ డ్యామ్ కేఎల్ రావు ఆధ్వర్యంలో జరిగిందని వక్తలు కొనియాడారు.

నిత్యావసర సరుకుల విక్రయ కేంద్రం ప్రారంభం

పాయకాపురం, జూలై 15 : సామాన్య ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన నిత్యావసర సరుకులను అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే బొండా ఉమా అన్నారు. పాయకాపురంలోని మోడరన్ రైతు బజార్‌లో తగ్గింపు ధరకు కందిపప్పు, బియ్యం విక్రయించే కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఈ విక్రయ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఐ శరత్, రైతుబజార్ ఈవో, సిబ్బంది, నేతలు పైడి శ్రీను, తులసి తదితరులు పాల్గొన్నారు.



కందిపప్పు అందజేస్తున్న బొండా ఉమా

మనస్తాపంతో ఆత్మహత్య

పాయకాపురం, జూలై 15 : పాయకాపురం రాజీవ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం పాత రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న పిట్టల గోపి(43)కి గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయాడు. దీంతో కొంత కాలంగా ఖాళీగా ఉంటున్నాడు. 15 రోజుల క్రితం గోపికి అతని భార్యకు గొడవ జరిగింది. దీంతో ఆమె తన ముగ్గురు పిల్లలను తీసుకుని సుందరయ్యనగర్‌లోని మరో ఇంటికి మారింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురైన గోపి ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. శనివారం నుంచి గోపి కనిపించకపోవడంతో తల్లి అంజలి సోమవారం ఇంటి తలుపు తీసి లోపలికి వెళ్లి చూసింది. అయితే గోపి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఉన్నాడు. మృతదేహం దుర్వాసన వస్తుండటంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారు డ్రైవర్ ...

వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన ఓ కారు డ్రైవర్ సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం కాలనీలోని డీ బ్లాక్‌కు చెందిన చేబ్రోలు దుర్గాప్రసాద్(35) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 17 ఏళ్ల క్రితం ఓ యువతితో వివాహం జరుగగా పెళ్లయిన ఏడాదికే భార్య భర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. అప్పటి నుంచి తల్లితో పాటే ఉంటున్న దుర్గాప్రసాద్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన నున్న రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి అక్రమ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలి

వన్‌టౌన్, జూలై 15: గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా మట్టి తవ్వి దోచుకున్న వారిపై చర్య తీసుకోవాలని విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లికి చెందిన మెండెం జమలయ్య సోమవారం జిల్లా కలెక్టర్‌కు, మంత్రి కొల్లు రవీంద్రకు వినతిపత్రం సమర్పించారు. 2019 నుంచి 2024 వరకు ఫారెస్ట్, అసైన్డ్ భూములు, పోలవరం కాలువ, కొండలు, కొండవాగు భూములలో మట్టి అక్రమంగా తవ్వుకుని దోచుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎన్జీటీ, హైకోర్టు ఆదేశాలు కూడా పట్టించుకోకుండా దోచుకున్నారని తెలిపారు.



ఆక్రమణల తొలగింపు

పాయకాపురం, జూలై 15 : స్థానిక రాజీవ్‌నగర్ ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలను సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. రాజీవ్‌నగర్ సెంటర్‌లో చాలా కాలంగా రోడ్డును ఆక్రమించుకుని పలువురు వ్యాపారాలు చేస్తున్నారు. సదరు ఆక్రమణలపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు అందటంతో టౌన్‌ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణా నాయక్ సిబ్బందితో ప్రధాన రహదారి వెంబడి ఉన్న 20 అక్రమ దుకాణాలను తొలగించారు. ఏపీఎస్ రెడ్డి రోడ్డులో ఉన్న ఆక్రమణలను కూడా తొలగించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

వన్‌టౌన్, జూలై 15: ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని 52 వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు డివిజన్‌లో సోమవారం నిర్వహించిన శుభోదయం ప్రజా దర్బార్ కార్యక్రమంలో స్థానికులకు సూచించారు. స్థానికులు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. తాను వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఎస్ఎస్ శివరామప్రసాద్, 38, 52 డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురేంద్రబాబు, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే గద్దె

రామలింగేశ్వరనగర్, జూలై 15: కరకట్ట వాసులకు ప్రధాన సమస్య అయిన డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సోమవారం 16వ డివిజన్ రామలింగేశ్వరనగర్ స్క్యూ బ్రిడ్జి, కె బిల్డింగ్ ప్రాంతాల్లో అయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ పక్కనే రోడ్డు నిర్మాణం చేసి దాని కింద డ్రెయినేజీ నిర్మాణం చేయడం వలన సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఎవరికి ఇబ్బందులు లేని విధంగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలనే ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఈ ప్రాంతంలో పర్యటించినట్లు తెలిపారు. వచ్చే వారంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో ఈ అంశంపై చర్చించి నిధులు మంజూరు చేయించడం జరుగుతుందని తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

పటమట: కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని సీఐటీయూ నాయకులకు తెలిపారు. సీఐటీయూ నాయకులు బి. బెనర్జీ, వీవీ.రాజు, కె. విజయ్‌కుమార్, పరసా కిరణ్‌కుమార్, పి.రవి, ఎన్.రమేష్‌లు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ముమ్మనేని జన్మదిన వేడుకలు



పటమట, జూలై 15 : 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ పుట్టినరోజు వేడుకలను డివిజన్ కార్యకర్తలు, నాయకులు జేడీనగర్‌లోని డివిజన్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముమ్మనేనికి తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ముమ్మనేనికి మరిన్ని మంచి పనులు చేయడానికి శక్తినివ్వాలని ఆ భగవంతుణ్ని కోరుకుంటున్నట్లు రామ్మోహన్ తెలిపారు. గద్దె ప్రసాద్, రాధారపు యల్లబాబు, రామాయణపు కోటి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో ప్రగతిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

● పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి



వన్‌టౌన్, జూలై 15: సాంకేతిక రంగంలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న వేగవంతమైన ప్రగతిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి అన్నారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్ల విభాగం ఏర్పాటు చేసిన ఫ్యూచర్ స్కిలింగ్ సెంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంప్యూటర్ రంగంలో ఊహించని రీతిలో ప్రగతి పరుగులు తీస్తోందన్నారు. సాంకేతికరంగంలోనూ వినూత్న ధోరణలు చోటు చేసుకున్నాయని, వేగవంతంగా ముందుకు సాగుతున్న సాంకేతికను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉపాధి పొందాలని తెలిపారు. ఫ్యూచర్ స్కిలింగ్ వంటి ల్యాబ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల కోశాధికారి హరగోపాల్, ఎస్ఆర్ ఎస్వీ బీఎడ్ కళాశాల కార్యదర్శి మాజేటి సతీష్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కే.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేనకోడలు కనిపించడం లేదని అత్త ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 15 : తన మేనకోడలు కనిపించడం లేదని ఓ మహిళ సోమవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం శ్రీకాకుళంకు చెందిన బాలిక(15) పది రోజుల క్రితం న్యూ ఆర్ఆర్‌పేటలోని బంధువల ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం డాబాపైన బట్టలు ఆరేసి వస్తానని చెప్పి వెళ్లింది. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాలు వెతికిన బాలిక బంధువులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొడవ వద్దన్నందుకు కత్తితో దాడి

వన్‌టౌన్, జూలై 15: బకాయి చెల్లించే విషయమై ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతుండగా వారించేందుకు యత్రించిన వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం కృష్ణలంక మహితా పబ్లిక్ స్కూల్ వద్ద జరిగింది. బకాయి చెల్లించే విషయమై యడ్లపల్లి ఉదయ్‌కుమార్, అరుణ్‌కుమార్‌లు ఆదివారం సాయంత్రం గొడవ పడుతుండగా ఉదయకుమార్ తమ్ముడు మహేష్ కత్తి తీసుకువచ్చాడు. గొడవ పడుతున్న వారి మధ్యకు వెళ్లి వారించేందుకు ప్రయత్నిస్తున్న అరుణ్‌కుమార్ స్నేహితుడు వుంగరాల హేమంత్‌పై ఉదయకుమార్, మహేష్‌లు కత్తితో దాడికి దిగారు. తనకు ఎటువంటి సంబంధం లేదని హేమంత్ చెబుతున్నా వినకుండా అతనిపై దాడికి దిగారు. చంపాలన్న ఉద్దేశ్యంతో వెంటపడుతుండగా హేమంత్ పారిపోయాడు. పోలీసుల సహాయంతో ఆసుపత్రికి వెళ్లాడు. సోమవారం హేమంత్ కృష్ణలంక పోలీసుస్టేషన్‌కు వచ్చి దాడిపై ఫిర్యాదు చేశాడు.

ఓపెన్ డ్రెయినేజీకి రక్షణ ఏదీ?

పటమట, జూలై 15 : అజాగ్రత్తగా ఉన్నారా.. డ్రెయినేజీలో పడిపోగలరు జాగ్రత్త. పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద విజయ డైరీ పార్లర్ పక్కన ఓపెన్ డ్రెయినేజీ ఉంది. దాని మీద ఎటువంటి ఐరన్ మెష్ ఏర్పాటు చేయలేదు. అధికార, ప్రతిపక్ష పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి నాయకులు, కమ్యూనిస్టులు నిరంతరం ఏదో ఒక రూపంలో ఈ ప్రాంతంలో నిరసనలు, దీక్షలు, విజయోత్సవాలు నిర్వహిస్తూ ఉంటారు. ఆయా సందర్భాల్లో వేల మంది అక్కడ చేరుతూ ఉంటారు. ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా రోజూ వేలమంది ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రయాణం సాగిస్తుంటారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం బారినపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఓపెన్ డ్రెయినేజీపై ఐరన మెష్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పంటకాల్వ రోడ్డులో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు

పటమట, జూలై 15 : పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పంటకాల్వ వైపు వెళ్లే వాహనదారులు, దానయ్యబజారు, అచ్చమ్మవీధి ప్రజలు నిత్యం ట్రాఫిక్ స్తంభించడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. మారిస్ స్టెల్లా ఆడిటోరియంలో జరిగే కార్యక్రమాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది ఆటోల్లో, కార్లలో, ద్విచక్ర వాహనాల్లో తరలి వస్తున్నారు. వీరందరికీ స్టెల్లా ప్రాంగణంలో పార్కింగ్ సదుపాయం కల్పించలేకపోవడం, వచ్చిన వారు తమ వాహనాలను అచ్చమ్మవారి వీధి, దానయ్యగారి వీధుల్లో, ఆర్టీసీ కాలనీలోని 1వ రోడ్డుల్లో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. కార్యక్రమాలు నిర్వహించే సమయాల్లో స్టేడియం పక్కన మాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోడ్డు పూర్తిగా ట్రాఫిక్‌లో మూసుకు పోతోంది. కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయంగా పార్కింగ్ స్థలం చూపించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



స్టెల్లా ఆడిటోరియం గోడ పక్కన మాల్స్



అచ్చమ్మ వీధిలో వాహనాల పార్కింగ్

జయశంకర్ వర్సిటీలో బీటెక్, బీఎస్సీ ఆనర్స్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ)-ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీటెక్‌లో గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం అలాగే బీఎస్సీ ఆనర్స్‌లో రూరల్ కోటా కింద 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.


బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- ఫార్మర్స్ కోటాలో రిజర్వేషన్ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు గ్రామీణ రైతు కుటుంబాలకు చెందినవారై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ (కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లో రూరల్ కోటా కింద అప్లయ్ చేసుకోవాలంటే కూడా గ్రామాల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఆగస్టు 19.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

దిక్సూచి DIKSUCHI

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్‌ఆర్‌టీవీయూ), సిద్దిపేట్-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీల సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీఎస్సీ ఆనర్స్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి.
- పీజేటీఎస్‌ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్, తోర్నాల అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.
- ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'.
- పీజేటీఎస్‌ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.
- బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో 20 శాతం సీట్లను ఐకార్ కోటా కింద ప్రత్యేకించారు. వీటిని 'సీయూఈటీ(ఐకార్-యూజీ)2024' ఎగ్జామ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ల ద్వారా ఐకార్ భర్తీ చేస్తుంది.

బీవీఎస్సీ & ఏహెచ్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్ఎస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బేర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఇంటర్ స్థాయిలో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లలో చేరాలంటే అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/hY129nKలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

రాజ్‌తరుణ్ ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్





రాజ్‌తరుణ్, లావణ్య, హీరోయిన్ మాల్వీ మల్హోత్రా ఎపిసోడ్ సోమవారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ ఎపిసోడ్‌లోకి కొత్త పాత్ర ఎంటర్ అయింది. తన కుమారుణ్ని ట్రాప్ చేసి, మాల్వీ ఆస్తి కాజేసిందని ముంబై నిర్మాత యోగేశ్ తల్లి సంచలన ఆరోపణలు చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. యోగేశ్, మాల్వీ కాల్ లిస్ట్‌ను కూడా ఆమె బయట పెట్టారు. ఆమె వెల్లడించిన సమాచారం ప్రకారం యోగేశ్ ముంబైలో ఓ చిన్న నిర్మాత. తన చిత్రంలో నటించడానికి వచ్చిన మాల్వీతో ప్రేమలో పడ్డారు యోగేశ్. వీళ్లిద్దరూ రెండేళ్ల సహజీవనం కూడా చేశారు. ఆ తర్వాత ఏమైందో ఏమో, తనని పెళ్లి చేసుకోవడానికి యోగేశ్ నిరాకరించాడనీ, కత్తితో తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడనీ ఆరోపిస్తూ మాల్వీ కేసు పెట్టడంతో యోగేశ్‌ను ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా మాల్వీ తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతోందని, తప్పుడు కేసులు పెట్టి తన కుమారుడిని జైలుకి పంపించిందని యోగేశ్ తల్లి వెల్లడించారు. రాజ్‌తరుణ్, లావణ్య కేసులో మాల్వీ ఇన్‌వాల్వ్ అయిన విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్నాననీ, అందుకే మాల్వీ బండారం బయటపెట్టాలని వీడియో విడుదల చేస్తున్నాననీ, తన కొడుకు ఇంకా జైలులోనే ఉన్నాడనీ, మాల్వీ అతని కెరీర్‌ను సర్వనాశనం చేసిందని చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు యోగేశ్ తల్లి.



ఆ లోటు తీర్చేలా 'డార్లింగ్'

నాని

ప్రియదర్శి, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా ఈ నెల 19న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ "ఈ మధ్య కామెడీ చిత్రాలు తక్కువైపోయాయి. ఆ లోటు తీర్చేలా వచ్చే చిత్రమే 'డార్లింగ్'. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్. త్వరలోనే జగదీశ్ అనే కొత్త డైరెక్టర్‌తో మా నిర్మాణ సంస్థలో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇందులో ప్రియదర్శినే హీరో" అని చెప్పారు. "ఈ సినిమా హిలేరియస్ ఎంటర్టైనర్. నాకు నటన పరంగా నానినే రోల్ మోడల్" అని ప్రియదర్శి అన్నారు. "కపుల్స్ మధ్య జరిగే సరదా సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు అందరూ కనెక్ట్ అవుతారు" అని దర్శకుడు అశ్విన్‌రామ్ చెప్పారు. "ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని నిర్మాత కె.నిరంజన్ రెడ్డి తెలిపారు.

మేడమ్ టుస్సాడ్స్‌లో రామ్‌చరణ్ విగ్రహం?



లండన్‌లో ఉన్న మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మన హీరో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారా? అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. రామ్‌చరణ్ పాపులారిటీ, ఆయన ఫాలోయింగ్‌ను గమనించిన మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తన విగ్రహం తయారీలో సహకరించడం కోసం రామ్‌చరణ్ లండన్‌లోనే ఉన్నారు. ఈ విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే.. రామ్‌చరణ్ ఫ్రెంచ్ బార్బెట్ జాతికి చెందిన ఓ కుక్క పిల్ల రైమ్‌ను పెంచుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా, ఏ దేశం సందర్శించినా తమతో పాటు రైమ్‌ను తీసుకెళ్లడం రామ్‌చరణ్ దంపతులకు అలవాటు. అందుకే రైమ్‌ను ఎత్తుకుని ఉన్న రామ్‌చరణ్ మైనపు బొమ్మనే మేడమ్ టుస్సాడ్స్‌లో ఏర్పాటు చేయనున్నారని సమాచారం.

అందుకే ఆ పెళ్లికి వెళ్లలేదు

తాప్సీ



అపర కుబేరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ వివాహం రాధికతో జరిగిన సంగతి విదితమే. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు భారతీయ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులందరూ హాజరయ్యారు. ఆడారు, పాడారు. నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అయితే ఈ పెళ్లికి వివిధ కారణాల వల్ల హాజరు కాని సినీ ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో హీరోయిన్ తాప్సీ ఒకరు. తను ఆ పెళ్లికి ఎందుకు వెళ్లలేదో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడిస్తూ ఆసక్తికరమైన వాఖ్యలు కూడా చేసింది. 'నాకు వాళ్లతో వ్యక్తిగత పరిచయం లేదు. నా ఉద్దేశంలో పెళ్లి అనేది అనుబంధాలతో కూడిన వేడుక. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి, అతిథికి మధ్య ఏదో రకమైన అనుబంధం ఉండి తీరాలి. అటువంటి వివాహాలకే నేను హాజరవుతా. తెలియని వారి ఇంట జరిగే పెళ్లికి వెళ్లి ఇబ్బంది పడలేను' అని తాప్సీ చెప్పింది. ఏ విషయం గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడడం మొదటినుంచీ తాప్సీకి అలవాటు. అందుకే అంబానీ ఇంట పెళ్లి గురించి కామెంట్ చేయడానికి ఆమె వెనుకాడలేదు.

థౌజండ్ వాలా టపాసులు



ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక సినిమా హిట్ అనిపించుకుంటే సరిపోదు.. కలెక్షన్లలో సునామీ సృష్టించి.. నిర్మాతలకు లాభాల పంట పండించాల్సిందే. వసూళ్ల పరంగా ఒకప్పుడు రూ.వంద కోట్ల కలెక్షన్స్ సాధించడమే అద్భుతమనిపించేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పెరిగిన టికెట్ రేట్ల కారణంగా కలెక్షన్ల లెక్కలు మారిపోయాయి. రూ.వంద కోట్లు .. రూ.రెండు వందల కోట్లు.. రూ.మూడు వందల కోట్లు.. రూ..నాలుగు వందల కోట్లు.. రూ.ఐదొందల కోట్లు... ఇదీ లెక్క ఇప్పుడు. అలా పెరుగుతూ వచ్చిన కలెక్షన్ల లెక్కలకు తాజా టార్గెట్ రూ. వెయ్యి కోట్లు. తాజాగా 'కల్కి' చిత్రం రూ. వెయ్యి కోట్ల రికార్డును సాధించడంతో తెలుగు సినిమా సత్తా మరోసారి చాటిచెప్పినట్లయింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతవరకు రూ. వెయ్యికోట్లు వసూలు చేసిన చిత్రాల సంఖ్య ఏడైతే వాటిలో మూడు సినిమాలు మనవే కావడం గర్వంతో కాలర్ ఎగరెయ్యాల్సిన అంశమే.

'యుద్ధం.. యుద్ధం' అంటూ బరిలోకి దిగి బాక్సాఫీస్‌ను షేక్ చేశారు ఆమిర్ ఖాన్. ఆయన నటించిన 'దంగల్' చిత్రం 2016లో రిలీజై.. అప్పటివరకూ ఉన్న సినిమా రికార్డులను కోలుకోలేని దెబ్బ కొట్టింది. నితీశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. గ్లోబల్ బాక్సాఫీస్ దగ్గర రూ.2వేలపై చిలుకు కలెక్షన్లను సాధించింది. ఈ సినిమా మల్లయోధుడు మహావీర్‌సింగ్ ఫోగట్, ఆయన కుమార్తెల జీవితాల్లోని సంఘటనల ఆధారంగా తెరకెక్కింది.


కలెక్షన్లలో 'మాహిష్మతీ సామ్రాజ్య' విజృంభన

దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'బాహుబలి'కి కొనసాగింపుగా వచ్చిందే 'బాహుబలి 2'. 2017లో రిలీజైన ఈ సినిమా తెలుగు చిత్ర పరిశ్రమ హద్దులు దాటి ప్రపంచవ్యాప్త హిట్‌గా నిలిచి.. అసలు సిసలు పాన్ ఇండియా సినిమా సక్సెస్ అంటే ఎలా ఉంటుందో అందరికీ రుచి చూపించింది. ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా రూ.1810 కోట్లు కలెక్షన్ల మార్క్ అందుకుంది.

'అసలు సిసలు మల్టీస్టారర్'

దర్శకధీరుడు రాజమౌళి రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌తో చేసిన మ్యాజికల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆర్‌ఆర్‌ఆర్'. ఈ కల్పిత పీరియాడికల్ యాక్షన్ డ్రామాలోని పోరాటఘట్టాలు.. పాటలు చూసి పరదేశీయులు ఫిదా అయ్యారు. ఈ సినిమాతో రాజమౌళి సినిమాలకు గ్లోబల్ క్రేజ్ పీక్స్‌కు చేరింది. ఇందులోని 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. హాలీవుడ్ దిగ్గజ దర్శకులు జేమ్స్ కామెరూన్, రూసో బ్రదర్స్ ప్రశంసలు పొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1400 కోట్లు వసూళ్లు చేసింది.





'రాకీ భాయ్' మానియా

యష్ నటించిన 'కేజీఎఫ్'తో కన్నడ ఇండస్ట్రీ వైపు దేశం మొత్తం చూసేలా చేసిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్. ఆయన దర్శకత్వంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కిన 'కేజీఎఫ్ 2'తో కన్నడ సినిమా స్థాయి గ్లోబల్ రేంజ్‌కు ఎదిగింది. యాక్షన్ ప్రియులకు అత్యంత చేరువైన ఈ సినిమా దాదాపు రూ.1300 కోట్లను కలెక్ట్ చేసింది.

'వింటేజ్ కింగ్ ఖాన్' ప్రభంజనం

వరుస ఫ్లాపుల్లో ఉన్న షారుక్ ఖాన్‌ను మళ్లీ హిట్ ట్రాక్‌లోకి ఎక్కించిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.వెయ్యి కోట్లు పైచిలుకు కలెక్షన్లను రాబట్టింది. ఇందులో రా ఏజెంట్‌గా షారుక్, ఐఎస్ఐ ఏజెంట్ పాత్రలో నటించిన జాన్ అబ్రహమ్‌తో చేసిన పోరాటాలు సినిమాకే స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.

'జవాన్' మ్యాజిక్

తమిళ దర్శకుడు అట్లీతో షారుక్ ఖాన్ చేసిన సినిమా 'జవాన్'. సమాజాన్ని దుర్మార్గుల బారి నుంచి కాపాడడానికి తండ్రిగా.. కొడుకుగా షారుక్ ఇందులో డ్యూయెల్ రోల్ పోషించారు. అత్యద్భుత పోరాట ఘట్టాలతో అందరినీ కట్టిపడేసిన ఈ చిత్రం దాదాపు రూ.1200 కోట్ల కలెక్షన్లు కొల్లగొట్టింది.

'కల్కి' హవా

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'కల్కి 2898 ఏ.డీ'. జూన్‌లో విడుదలైన ఈ సినిమాలో పురాణాల్ని, సైన్స్ ఫిక్షన్‌ను మిళితం చేసి దర్శకుడు అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఇందులో అమితాబ్, ప్రభాస్ మధ్య వచ్చే పోరాట ఘట్టాలు.. కాంప్లెక్స్, కాశీ, శంభల ప్రాంతాల విజువల్స్. పతాక సన్నివేశాల్లో ప్రభాస్ కర్ణుడిగా కనిపించే దృశ్యం సినిమా విజయాన్ని మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. రిలీజైన 15 రోజులకే రూ.1000 కోట్ల కలెక్షన్లను అందుకుని.. మరిన్ని రికార్డులు నెలకొల్పే దిశగా దూసుకుపోతోంది.

ఓ మంచి సినిమా మీకు ఇవ్వబోతున్నా



'క' అనే ఒకే ఒక్క పదం టైటిల్‌తో హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న చిత్రం ట్రేడ్‌లో ఇప్పుడు ఆసక్తిగా మారింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం త్వరలో తెలుగు సహా తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'మూడు 'క' లను నమ్ముకుని ఈ 'క' చిత్రం తీశాను. మొదటి క.. కథ. చాలా కథలు విని విభిన్నంగా ఉన్న ఈ చిత్రకథను ఎన్నుకున్నాం. రెండో క.. కిరణ్ అబ్బవరం., మూడో క.. కల. ఒక మంచి సినిమా తీసి పదిమందికి తోడుగా ఉండాలన్నది నా కల, అది ఈ సినిమాతో నెరవేరుతోంది. దర్శకులుగా పరిచయమవుతున్న సందీప్, సుజిత్ తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకుంటారు' అని తెలిపారు.

'ఎటువంటి కథనైనా తెర పైకి తీసుకురావడానికి ధైర్యం కావాలి. కిరణ్ మాకు సపోర్ట్ ఇచ్చారు. మంచి టీమ్‌ను ఇచ్చారు. కొత్త డైరెక్టర్స్‌కు అలాంటి టీమ్ దొరకడం అదృష్టమే' అన్నారు దర్శకుల్లో ఒకరైన సుజిత్. మరో దర్శకుడు సందీప్ మాట్లాడుతూ 'ఎంతో రిసెర్చ్ చేసి, 80ల కాలం నాటి వస్తువులను సేకరించి, హై స్టాండర్డ్స్‌లో ఈ సినిమా తీశాం. ఫ్యామిలీ వాతావరణాన్ని క్రియేట్ చేసి మేం టెన్షన్ లేకుండా పని చేసే అవకాశాన్ని కిరణ్ కల్పించారు. 'క' అంటే కిరణ్ అబ్బవరం కాదు.. ఇందులో ఒక ప్రధాన పాత్ర ఉంది. అదేమిటో థియేటర్లలోనే చూడాలి' అన్నారు.

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ' 'వీడి పని అయిపోయింది' అని ఎవరైనా అంటే నమ్మకండి. మన పని అయిందా లేదా అనేది మనకు మాత్రమే తెలుసు. అలాగే నా పని అయిపోయిందా లేదా అనేది నాకు తెలుస్తుంది. అలా అనిపించినప్పుడు సినిమాలు చేయను. 'క' సినిమా మొదలై ఏడాదిన్నర అయింది. ఒక మంచి సినిమా కోసం మేమంతా కష్టపడ్డాం. ఒక మంచి సినిమాను మళ్లీ మీకు ఇవ్వబోతున్నా. మీ ప్రేమను పొందడానికి ఎదురు చూస్తున్నా. 'క' ప్రొడక్షన్ వర్క్ అంతా రహస్య చూసుకుంది. సినిమా రీచ్ అయ్యాక మాట్లాడతా అని చెప్పింది. అందుకే ఇక్కడికి రాలేదు' అన్నారు.

నటుడు రక్షిత్ శెట్టిపై కేసు



కాపీరైట్ ఉల్లంఘించారనే ఆరోపణలతో శాండల్‌వుడ్ నటుడు రక్షిత్‌శెట్టిపై కేసు నమోదైంది. 'న్యాయ ఎల్లిదె..?', 'గాలి మాతు' అనే రెండు సినిమాల పాటలను అనుమతి లేకుండా ఆయన వినియోగించుకున్నారని ఎంఆర్‌టీ మ్యూజిక్ సంస్థ భాగస్వామి నవీన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బెంగళూరు యశ్వంతపుర పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రక్షిత్‌శెట్టిని పోలీసులు విచారణకు పిలిచే అవకాశం ఉంది.

\- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పాత్రను ఇష్టపడి చేసిన సినిమా



బిగ్‌బాస్ ఫేమ్ రవికృష్ణ కీలక పాత్రలో నటించిన చిత్రం 'బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో ఐ.భరత్ నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా రవికృష్ణ మీడియాతో ముచ్చటించారు. "నాకు రియల్ లైఫ్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కే చిత్రాలంటే చాలా ఇష్టం. ఇందులో నా పాత్ర బాగా నచ్చి కథ విన్న వెంటనే ఒప్పేసుకున్నాను. ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతీ పాత్ర కూడా ఎంటర్టైన్ చేస్తుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల జీవితం చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుంది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది." అని చెప్పారు.

సులువైన చికిత్సలు

- నీటి సంబంధ రుగ్మతలు దరి చేరకుండా వేడి చేసిన నీరే తాగాలి.
- వానాకాలంలో అత్యంత సాధారణమైన గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందడం కోసం గోరువెచ్చని పాలలో పసుపు కలుపుకుని తాగాలి.
- తులసి నీళ్లలో పసుపు కలిపి, కషాయం తయారుచేసుకుని నోరు పుక్కిలిస్తున్నా గొంతు నొప్పి తగ్గుతుంది.
- కషాయాలతో వర్ష రుతువు రుగ్మతలు దూరం!



గుడ్ ఫుడ్

పదార్థాలు- ప్రత్యామ్నాయాలు

తోచింది, నచ్చింది తినడం కాదు. ఆరోగ్యానికి మేలు చేసేదీ, పోషకభరితమైనదీ తినాలి. అందుకోసం వీలున్న ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.

- **జంక్ ఫుడ్:** పిజాలు, బర్గర్లు మొదలైన జంక్ ఫుడ్స్‌లో అత్యధిక క్యాలరీలుంటాయి. వీటిలోని రిఫైన్డ్ దినుసులు ఆరోగ్యానికి హానికరం కాబట్టి వీటికి బదులుగా తక్కువ క్యాలరీలున్న సలాడ్లు, మొలకలు ఎంచుకోవాలి.
- **పునుగులు, బజ్జీలు:** ఈ స్నాక్స్ తరచూ తింటూ ఉంటాం. ఇంట్లో తయారుచేసుకున్నవే తిన్నా వీటి ద్వారా అధిక మొత్తాల్లో కొవ్వులు శరీరంలోకి చేరతాయి. కాబట్టి వీటికి బదులుగా నట్స్, సీడ్స్ తినాలి. వేరుసెనగలు, బాదం లాంటి వాటిలో ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి.
- **బిస్కెట్లు, కేకులు:** ఈ స్నాక్స్‌లో అత్యధికంగా పాలిష్ పట్టిన దినుసులుంటాయి. అలాగే అత్యధిక కొవ్వులు, చక్కెరలు ఉంటాయి. వీటికి బదులుగా సంప్రదాయ తీపి పదార్థాలైన వేరుసెనగ చిక్కీలు, పల్లీ ముద్దలు, మిల్లెట్ ఉండలు లాంటివి తినాలి.



- **కూల్ డ్రింక్స్:** వీటిలో చక్కెర ఎక్కువ. ఎనర్జీ డ్రింక్‌లు, జీరో షుగర్ డ్రింకులు కూడా హానికరమే! కాబట్టి వీటికి ప్రత్యామ్నాయంగా కొబ్బరినీళ్లు, మజ్జిగ, తాజా చెరకు రసాలు తాగాలి.
- **పళ్ల రసాలు:** వీటిని ఇంట్లో తయారుచేసుకునే అలవాటు ఉండదు కాబట్టి బయట దొరికే పండ్లరసాల మీదే ఆధారపడుతూ ఉంటాం. వీటిలో చక్కెరలు ఎక్కువ. పైగా పండ్ల రసాలతో తగిన పీచు శరీరానికి అందకుండా పోతుంది. కాబట్టి పండ్ల రసాలకు బదులుగా నేరుగా పండ్లనే తినడం అలవాటు చేసుకోవాలి.
- **జామ్స్, సాస్, డిప్స్:** వీటిలో ఉప్పు, చక్కెరలు, నిల్వ పదార్థాలు, కృత్రిమ రంగులు ఎక్కువ. వీటికి బదులుగా ఇంట్లో తయారుచేసిన పచ్చళ్లు ఎంచుకోవాలి.

ఆయుర్వేదం

వర్షాకాలం చల్లని వాతావరణం ఆహ్లాదాన్ని కలిగించడంతో పాటు, కొన్ని రుతుపరమైన ఇబ్బందులనూ తెచ్చి పెడుతూ ఉంటుంది. కాబట్టి వాటి మీద ఓ కన్నేసి ఉంచి, మెలకువగా వ్యవహరించాలి.



హాయ్.. హాయ్

సూర్యభగవానుని కదలికల ఆధారంగా, ఉత్తరాయణం, దక్షిణాయణాలు రెండింట్లోనూ చెరో ఆరు నెలలు చొప్పున ఏడాది కాలం సాగుతుంది. ఈ ఏడాది కాలంలో శిశిరం, వసంత, గ్రీష్మ, వర్ష, శరద్, హేమంతం.. ఆరు రుతువులు సాగుతూ ఉంటాయి. ఉత్తరాయణంలో సూర్యుడు భూమి, దాని మీద ఉన్న జీవరాశిలో ఆవరించి ఉన్న చల్లదనాన్ని, శక్తినీ సంగ్రహించేస్తాడు. దక్షిణాయణంలో ఇందుకు విరుద్ధంగా, భూమి మేఘాల చేత ఆక్రమించేలా చేసి, చల్లని గాలులు, వానలతో చల్లబరుస్తాడు. ఫలితంగా శిశిరం, వసంతం, గ్రీష్మ రుతువుల్లో కోల్పోయిన శక్తి తిరిగి వర్ష రుతువులో పొందడం జరుగుతూ ఉంటుంది. అయితే ఈ కాలంలో వాత, పిత్త దోషాలు కలిగిన వారికి వివిధ రకాల రుగ్మతలు తిరగబెడుతూ ఉంటాయి.

వాత: వేసవి ఫలితంగా భూమిలో బిగదీసుకుపోయిన వాయువులు, ఆమ్లసహిత వాతావరణం మూలంగా, వాతం పెరిగి, వానాకాలంలో జీర్ణశక్తి సన్నగిల్లుతుంది.

పిత్త: వానాకాలంలో క్షీణించిన జీర్ణశక్తి మూలంగా వేసవిలో వేడి పెరగడంతో పాటు, పిత్తం కూడా పెరుగుతుంది. వానాకాలం చల్లని వాతావరణం చెలరేగిన వెంటనే లక్షణాలు ఇబ్బంది పెట్టడం మొదలుపెడతాయి. కాబట్టి వర్ష రుతువులో వాతం పెరగడం, పిత్తం పేరుకుపోవడం మూలంగా ఈ కాలంలో కొన్ని రకాల సమస్యలు విపరీతంగా వేధిస్తాయి.

కాబట్టి వాతం, పిత్తాలను సమతుల్యం చేసే ఆహారపు టలవాట్లు, జీవనశైలి మార్పులను స్వాగతించాలి. లేదంటే వర్ష రుతువులో వేధించే టైఫాయిడ్, కలరా, కామెర్లు, జలుబు, దగ్గు మొదలైన ఇబ్బందులు తప్పవు. ఈ రుగ్మతలు దరి చేరకుండా ఉండాలంటే అభ్యంగనం లేదా నూనెతో మర్దన, స్వేదనం, బస్తి చికిత్సలను క్రమంతప్పక అనుసరించాలి.

అభ్యంగనం

వర్షాకాలంలో పెరిగే కీళ్ల నొప్పులు, ఎముకల నొప్పుల నుంచి విముక్తి పొందడానికి అభ్యంగనం ఆచరించాలి. వర్షాకాలంలో వన్నె తగ్గి, నిర్జీవంగా తయారయ్యే చర్మానికి కూడా ఈ చికిత్స ఎంతో మేలు చేస్తుంది. చర్మానికి తేమ, మెరుపులను ఇవ్వడంతో పాటు ఎముకలు బలపడేలా చేస్తుంది అభ్యంగనం. నూనెతో మర్దన తర్వాత తీసుకునే ఆవిరి స్నానం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుని విషతుల్య వ్యర్థాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా వాపులు, నొప్పులు తగ్గడంతోపాటు బిగుసుకుపోయిన కీళ్లు వదులవుతాయి.

స్వేదనం

దీన్లో రెండు రకాల చికిత్సలు ఉంటాయి. ఔషధ మొక్కల ఆకులను ఉడికించి ఉపయోగించే 'పత్ర స్వేదనం' చికిత్స వల్ల ఆర్థ్రయిటిస్ నొప్పులతో పాటు, ఎముకలు, కీళ్లకు సంబంధించిన వెన్ను సంబంధ స్పాండిలోసిస్ సమస్యలు కూడా అదుపులోకి వస్తాయి. రుక్ష స్వేదనం అనే ఉష్ణ చికిత్స వల్ల రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ నొప్పులు తగ్గుముఖం పడతాయి.

బస్తి (ఎనీమా)

ఈ చికిత్సలో వాడే నూనెలు, ఇతర కషాయాలు వాత దోషాన్ని హరిస్తాయి. వాత దోషం మూలంగా శరీరంలో చేరుకున్న మలినాలు నూనె లేదా కషాయ ఎనీమాల వల్ల బయటకు వెళ్లిపోతాయి.

జలుబు, దగ్గులకు ఆయుర్వేద చికిత్స!

వర్షాకాలం జలుబు, దగ్గు అత్యంత సహజం. ఈ రుగ్మతలను తేలికగా వదిలించుకోవాలంటే....

- కొన్ని చుక్కల నిమ్మరసం, చిటికెడు దాల్చినచెక్క పొడి, అర చెంచా తేనెలను కలిపి రోజూ రెండు పూటలా తీసుకోవాలి.

మూలికలు, పత్రాలు, సుగంధద్రవ్యాలతో తయారయ్యే కషాయాలు వర్ష రుతువు వేధించే పలు రుగ్మతలకు దివ్యౌషధంలా పని చేస్తాయి. అవేంటంటే...

- **రోగనిరోధకశక్తి:** ఈ రుతువులో సన్నగిల్లే వ్యాధి నిరోధకశక్తిని మెరుగు పరుచుకోవడం కోసం యాలకులు, దాల్చినచెక్క, తెల్ల మిరియాలు వేసిన నీటిని మరిగించి తాగాలి. రుచి సహించకపోతే కొద్దిగా తేనె కలుపుకోవచ్చు. ఈ కషాయం ప్రతి రోజూ తీసుకుంటే వ్యాధినిరోధకశక్తి మెరుగ్గా ఉండి, వ్యాధులు దరి చేరకుండా ఉంటాయి.
- **అజీర్తి:** వానాకాలం తగ్గే ఆజీర్తిని సరిచేయడం కోసం నీటిలో వాము, సోంపు వేసి మరిగించి, తేనె కలిపి తీసుకోవాలి. భోజనం చేసిన ప్రతి సారీ ఈ కషాయం తాగుతూ ఉంటే, అజీర్తి సమస్య తలెత్తదు.
- **సాధారణ జ్వరం:** ఏడు తులసి ఆకులు, ఐదు లవంగాలు తీసుకుని దంచాలి. వీటిని మరిగించిన నీటిలో కలిపి, కొద్దిగా సముద్రపు ఉప్పు చేర్చి, రెండు రోజులపాటు రోజుకు రెండుసార్లు తాగాలి. ఇలా చేస్తే వర్ష రుతు సంబంధ సాధారణ జ్వరాలు తగ్గుతాయి.



- రోజంతా గోరువెచ్చని నీళ్లు తాగుతూ ఉండాలి. వేడి నీళ్లు జలుబు, దగ్గు, గొంతునొప్పులకు కారణమయ్యే వైరస్‌లతో పోరాడే శక్తినిస్తాయి. అలాగే శరీరంలోని ఇన్‌ఫెక్షన్లను బయటకు తోలి, శరీరానికి సరిపడా హైడ్రేషన్‌ను అందిస్తాయి.
- రోజుకొక ఉసిరి కాయ తింటూ ఉన్నా కాలేయం ఆరోగ్యం భేషుగ్గా ఉండి, రక్త ప్రసరణ మెరుగై వ్యాధి కారక క్రిముల నుంచి రక్షణ పొందగలుగుతాం!
- అవిసె గింజలను నీళ్లలో చిక్కబడేవరకూ ఉడికించి, వడకట్టాలి. ఈ కషాయంలో నిమ్మరసం, తేనెలను కలిపి తీసుకున్నా జలుబు, దగ్గులు తగ్గుతాయి.
- నల్లమిరియాలు, బెల్లం, జీలకర్ర నీళ్లలో మరిగించి, తీసుకున్నా జలుబు, దగ్గు వల్ల పట్టేసిన ఛాతీ వదులై ఊపిరి అందుతుంది.
- క్యారట్ రసం తాగడం వల్ల జలుబు దరి చేరకపోగా, వచ్చిన జలుబు కూడా త్వరగా తగ్గిపోతుంది.

ఆయుర్వేద చికిత్సలతో జ్వరాలు బలాదూర్!

ఆయుర్వేదం జ్వరాలను రెండు రూపాల్లో అంచనా వేస్తుంది. జ్వరాన్ని జ్వరంగానూ లేదా ఇతర రుగ్మతల లక్షణంగానూ పరిగణించి, తదనుగుణ చికిత్స అందిస్తే రుగ్మత అదుపులోకి వస్తుంది. రుతువును బట్టి ఆ కాలంలో వచ్చే జ్వరాలకు ఆయుర్వేదంలో వేర్వేరు పేర్లు ఉన్నాయి. వర్ష రుతువులో వచ్చే జ్వరాలకు ఆయుర్వేదంలో 'వతజ జ్వరం' అని పేరు. ఈ జ్వరాలకు ఆయుర్వేదంలో చక్కని చిట్కాలు ఉన్నాయి.

- గ్లాసుడు నీళ్లలో చిటికెడు దాల్చినచెక్క పొడి, చిటికెడు మిరియాలపొడి కలిపి వేడి చేసి, నిమ్మరసం కలుపుకుని తాగితే జ్వరంతోపాటు, గొంతు నొప్పి కూడా తగ్గుతుంది.
- జీలకర్ర అద్భుతమైన యాంటీసెప్టిక్! జీలకర పొడి కలిపి మరిగించిన నీటిలో తేనె కలుపుకుని తాగితే వర్షాకాల సంబంధ జ్వరాలు తగ్గుముఖం పడతాయి.
- జ్వరంతోపాటు విపరీతమైన జలుబు, దగ్గు కూడా ఉంటే గోరువెచ్చని తేనెలో పావు చెంచా దాల్చిన చెక్క పొడి కలిపి రోజుకు మూడు సార్లు తీసుకోవాలి.

డెంగ్యు జ్వర చికిత్స

ఆయుర్వేదంలో ఈ జ్వరాన్ని 'దండక జ్వరం' అంటారు. ఈ జ్వరం వేధిస్తున్నప్పుడు తేలికగా అరిగే గంజి ఆహారంగా ఇవ్వాలి. తులసి, యాలకులు వేసి కాచిన కషాయాన్ని ఇవ్వాలి. కారాలు, నూనెలు తగ్గించి వండిన ఆహారం ఇవ్వాలి. పునర్నవ మూలికతో తయారైన కషాయంతో డెంగ్యు జ్వరం అదుపులోకి వస్తుంది. అలాగే వ్యాధినిరోధకశక్తిని పెంచడం ద్వారా పరోక్షంగా ఈ జ్వరం తగ్గేలా చేయవచ్చు. కాబట్టి రోగనిరోధశక్తిని పెంచే తులసి నీళ్లను రోజంతా తాగించాలి. అలాగే రోజు మొత్తంలో 10 నుంచి 15 తులసి ఆకులు నమిలించాలి. డెంగ్యు జ్వరాన్ని తగ్గించే 'దతుర' మూలికను ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో వాడాలి. మెంతి ఆకులతో తయారు చేసిన తేనీరు తాగుతూ, ద్రాక్ష, దానిమ్మ రసాలు తీసుకున్నా డెంగ్యు జ్వరం తగ్గుముఖం పడుతుంది.

ఎన్నెన్ని వర్ణాలో..

కూరగాయలను వాటి వాటి రంగులను బట్టి వర్గీకరించవచ్చు. ఒక్కో రంగు వర్గానికి చెందిన కూరగాయలు నిర్దిష్టమైన ఆరోగ్యప్రయోజనాలను కలిగి ఉంటాయి. వాటి గురించి అవగాహన ఏర్పరుచుకుంటే ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయలను అవసరాన్ని బట్టి ఎంచుకోవచ్చు. రంగుల ఆధారంగా కూరగాయలను ఎలా వర్గీకరించుకోవచ్చో చూద్దాం.

తెలుపు

ఈ రంగు కూరగాయలు శరీరానికి వ్యాధినిరోధకశక్తిని అందిస్తాయి. తెల్లచిక్కుళ్లు, బంగాళాదుంపలు, ముల్లంగి, కాలిఫ్లవర్, పుట్టగొడుగులు ఈ కోవలోకి వస్తాయి. తెల్ల చిక్కుళ్లు, బంగాళాదుంపలు రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తాయి. పుట్టగొడుగుల్లో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు ఎక్కువ. కాలిఫ్లవర్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గర్భిణిలు, ఇతర మహిళలకు వీటి అవసరం ఎక్కువ.

ఆకుపచ్చ

ఈ రంగుతో కూడిన కూరగాయలు శరీరం నుంచి విషాలను బయటకు వెళ్లగొట్టడానికి తోడ్పడతాయి. బఠాణీ, చిక్కుళ్లు, పాలకూర, క్యాప్సికం, కివి..ఇలా ఆకుపచ్చ రంగులో ఉన్న కూరగాయలన్నిటికీ ఈ గుణం ఉంటుంది. శరీర జీవక్రియలకు అవసరమైన పోషకాలతోపాటు, శక్తిని అందించే పోషకాలు, శరీరం నుంచి విషాలను హరించి, బయటకు వెళ్లగొట్టే తత్వం ఆకుపచ్చ రంగు కూరగాయలకు ఉంటుంది.

పసుపుపచ్చ

ఇవి సౌందర్యపోషణకు అవసరం. అరటి, పసుపుపచ్చని క్యాప్సికం, మొక్కజొన్నల్లో ఉండే కెరోటినాయిడ్లు, బైఫ్లేవనాయిడ్లు- చర్మం,ఎముకలు, దంతాలకు మేలు చేస్తాయి.

నారింజ

ఈ రంగులో పండే నారింజ, క్యారెట్లలో కేన్సర్ నుంచి రక్షణ కల్గించే పోషకాలు ఉంటాయి. ఇవి గుండెకు మేలు చేయడంతోపాటు కళ్లకు ఆరోగ్యాన్ని అందించి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

ఎరుపు

టమాటో, ఎరుపు క్యాప్సికం, పండుమిరప, చెర్రీ, యాపిల్స్, దానిమ్మ మొదలైనవన్నీ ఈ కోవకు చెందినవి. ఈ పళ్లు, కూరగాయలన్నీ గుండెకు మేలు చేసేవే!

వంకాయ రంగు

ఈ రంగులో మనకు వంకాయలు పండుతాయి. ద్రాక్ష, బ్లాక్ బెర్రీ పళ్లు దొరుకుతాయి. ఇవన్నీ పొట్టలో అల్సరను తగ్గిస్తాయి. కేన్సర్ వృద్ధికి అడ్డుకట్టవేసి, మూత్రనాళ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్గిస్తాయి.

రంగుల్లో పోషకాలు

ఎరుపు

ఈ రంగు కూరగాయలు, పళ్లలో లైకోపీన్, ఎల్లాజిక్ ఆమ్లం, క్వెర్సిటిన్, హెస్పరిడిన్ మొదలైన పోషకాలు ఉంటాయి. ఇవి ప్రోస్టేట్ కేన్సర్ నుంచి రక్షణ కలిగించడంతో పాటు, కణితి పెరుగుదలను నియంత్రించి, చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. కీళ్ల మధ్య ఉండే మృదులాస్థిని ఆరోగ్యంగా ఉంచుతాయి.

నారింజ, పసుపుపచ్చ

ఈ రంగు కూరగాయలు, పళ్లలో - జీగ్జాంథిన్, బీటాకెరోటిన్, పొటాషియం, లైకోపీన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు వయసు పైబడే క్రమంలో వేధించే ప్రోస్టేట్ కేన్సర్, అధిక రక్తపోటు, కీళ్ల అరుగుదలను నియంత్రిస్తాయి. శరీరంలో ఆమ్ల స్థాయిని సరిచేసి, ఎముకల దారుఢ్యానికి అవసరమైన క్యాల్షియం, పొటాషియంలను శరీరం సక్రమంగా శోషించుకునేందుకు తోడ్పడతాయి.

ఆకుపచ్చ

ఈ రంగు కూరగాయలు పళ్లలో పత్రహరితం, పీచు, ల్యూటిన్, క్యాల్షియం, ఫోలేట్, విటమిన్ సి, బీటా కెరోటిన్ ఎక్కువగా ఉంటాయి. జీర్ణప్రక్రియ మెరుగుపరిచి, దృష్టిలోపాలు తలెత్తకుండా, ఫ్రీర్యాడికల్స్ శరీరం మీద దాడి చేయకుండా చేస్తాయి.

నీలం, వంకాయ

ఈ రంగుల్లోని కూరగాయలు, పళ్లలో ల్యూటిన్, క్సియాంథిన్, రెస్వెరెట్రాల్, విటమిన్ సి, పీచు, ఫ్లేవనాయిడ్లు, ఎల్లాజిక్ యాసిడ్, క్వెర్సెటిన్ అనే పోషకాలు ఎక్కువ. ఇవి కంటి చూపు మెరుగుకు ఉపయోగపడతాయి. వ్యాధినిరోధకశక్తిని పెంచుతాయి. జీర్ణప్రక్రియ మెరుగు పరచడంతోపాటు కేన్సర్ కణాల పుట్టుకను అడ్డుకుంటాయి.

తెలుపు

వీటిలో బీటాగ్లూకాన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధకశక్తిని పెంచుతాయి. పెద్దపేగు, రొమ్ము, ప్రోస్టేట్ కేన్సర్లు తలెత్తకుండా చేస్తాయి. హార్మోన్ వ్యవస్థను బలోపేతం చేసి, సంబంధిత రుగ్మతలు దరి చేరకుండా అడ్డుపడతాయి.

ఇవే అవి...

అత్యధిక ఆరోగ్యపరమైన పోషకాలు కలిగి ఉండే వివిధ రంగుల్లోని పళ్లు, కూరగాయలు ఇవే...

ఆకుపచ్చ: అవకాడొ, బ్రకోలి, చైనీస్ క్యాబేజి, ఆకుపచ్చ యాపిల్స్ పియర్స్ కివి.



తెలుపు: తెల్ల మొక్కజొన్న, టర్నిప్, తెల్ల పీచ్ పళ్లు.

ఎరుపు: బీట్రూట్, ఎర్రని జామ, పంపరపనస, ఎర్రని ద్రాక్ష, స్ట్రాబెర్రీ.

పసుపు: గోల్డెన్ కివి, నిమ్మ, మామిడి, పైనాపిల్, చిలకడ దుంప, అత్తిపళ్లు

నీలం, వంకాయ: బ్లాక్ కరెంట్, వంకాయలు, ద్రాక్ష, వంకాయ రంగు క్యాబేజీ, ఎండుద్రాక్ష.

పేగులు జారితే.. ప్రమాదమే

ఏదైనా అంతర్గత అవయవం తన స్థానం నుంచి బయటకు చొచ్చుకురావటాన్నే 'హెర్నియా' అంటారు. దీన్లో ఎన్నో రకాలున్నా అత్యంత సాధారణంగా కనిపించే సమస్య...' ఇంగ్వైనల్ హెర్నియా'. దీన్లో పొత్తికడుపులోని పేగులు పొట్ట దగ్గరున్న కణజాలాన్ని నెట్టుకుంటూ చర్మం అడుగున ఓ మూటలాగా బయటకు చొచ్చుకొని కనిపిస్తాయి. ఈ రకం హెర్నియా పొత్తికడుపు, గజ్జల దగ్గర స్పష్టంగా కనిపిస్తుంది.

ఎవరిలోనైనా హెర్నియా లక్షణాలు ఒకేలా ఉంటాయి. అవేంటంటే...

- దగ్గినప్పుడు, వంగినప్పుడు, వ్యాయామం చేస్తున్నప్పుడు నొప్పి ఎక్కువవుతుంది.
- నొప్పి సూదిదో గుచ్చినట్టు ఉంటుంది.
- గజ్జల్లో బరువుగా ఉంటుంది.
- పురుషుల్లో బీజాల వాపు కనిపిస్తుంది.

పసికందుల్లో

తల్లి గర్భంలో ఏడునెలల వయసు మగపిండంలో బీజాలు పొత్తికడుపులో ఉండి ప్రసవానికి ముందు కిందకి జారతాయి. ఒకవేళ బిడ్డ ముందుగానే ఏడు నెలలకే పుడితే బీజాలు కిందకి రాక లేదా పేగులు, కొవ్వు, ద్రవం పొత్తికడుపులోని బలహీన ప్రదేశంలోకి చొచ్చుకొచ్చి హెర్నియా తయారవుతుంది. దాంతో ఈ పిల్లలు బొడ్డు లేదా గజ్జల్లో వాపుతో పుడతారు. బొడ్డు వాచినట్టు కనిపిస్తుంది కాబట్టే ఈ రకం హెర్నియాను 'అంబెలికల్ హెర్నియా' అంటారు. ఈ సమస్య బిడ్డ పుట్టిన కొన్ని నెలల్లో కూడా కనిపించవచ్చు. ఇలాంటప్పుడు లాప్రోస్కోపీ టెక్నిక్‌తో ఆ ప్రదేశాన్ని చేరుకుని చర్మపు తిత్తికి దారంతో ముడి వేసి వదిలేస్తారు. ఇలా ముడివేయటం వల్ల పేగులు మళ్లీ తిత్తిలోకి చేరుకోకుండా ఉంటాయి.

ఎందుకొస్తుంది?

హెర్నియాకు ఎన్నో కారణాలున్నాయి. పుట్టుకతోనే మన పొత్తికడుపులో 'ఇంగ్వైనల్ కెనాల్' అనే సహజసిద్ధమైన ఓపెనింగ్ ఉంటుంది. ఏడవ నెల గర్భంలో మగపిల్లల్లోనైతే ఈ కెనాల్‌లో బీజాలు చోటు చేసుకుని ఉండి ప్రసవానికి ముందు కిందకి జారతాయి. ఆడపిల్లల్లోనైతే ఈ కెనాల్‌లో మూత్రాశయ లిగ్మెంట్లు ఉండి ప్రసవానికి కొద్ది రోజుల ముందు కిందకి జారతాయి. ఈ రకమైన శారీరక లక్షణం కారణంగా స్వతస్సిద్ధంగానే స్త్రీపురుషుల పొత్తికడుపుల్లో ఖాళీ ప్రదేశం ఉంటుంది. ఈ కెనాల్స్ ఉన్న చోట కణజాలం కూడా కాస్త బలహీనంగా ఉంటుంది.

స్త్రీలల్లో...

స్త్రీలల్లో కనిపించే వెంట్రల్ హెర్నియాకు ప్రధాన కారణం 'సిజేరియన్ ఆపరేషన్'. ఈ సర్జరీకి ఎక్కువ సమయం పట్టినా, సర్జరీ కోత నిలువుగా ఉన్నా, చర్మపు పొరలకు కుట్లు సరిగా వేయకపోయినా, కుట్లు ఇన్‌ఫెక్షన్‌కు గురయినా హెర్నియా వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అలాగే ఎక్కువ ప్రసవాల ఫలితంగా పొత్తికడుపు కండరాలు పటుత్వం తగ్గినా ఈ సమస్య తలెత్తవచ్చు. కాబట్టి సిజేరియన్ చేయించుకున్న స్త్రీలు హెర్నియా రాకుండా ఉండటం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. సర్జరీ నుంచి కోలుకున్న రెండు నెలల నుంచే పొత్తికడుపును బలపరిచే వ్యాయామాలు చేయాలి. సాధారణ ప్రసవమైన స్త్రీలు ప్రసవమైన రెండు వారాలనుంచే వ్యాయామాలు మొదలుపెట్టాలి.




వృద్ధుల్లో...

వయసు పెరిగేకొద్దీ కండరాల పటుత్వం తగ్గుతుంది. అలాగే చర్మం అడుగునుండే కణజాలం పటుత్వం కూడా! దాంతో ఆ ప్రదేశం ఒత్తిడికి లోనైనప్పుడు హెర్నియా వచ్చే అవకాశాలు పెరుగుతాయి. పిల్లలు దగ్గినంత బలంగా వృద్ధులు దగ్గలేరు. బలంగా దగ్గి కళ్లెను బయటకు తీసుకురాలేక తక్కువ శక్తితో దగ్గుతూ ఉంటారు. దాంతో పొత్తికడుపు ఒత్తిడికి గురై హెర్నియా వస్తుంది. కొందరిలో ప్రొస్టేట్ గ్రంథి వ్యాధులకు గురై పరిమాణం పెరుగుతుంది. దీని వల్ల కూడా హెర్నియా తలెత్తుతుంది. వృద్ధుల్లో మధుమేహం అదుపు తప్పినా హెర్నియా వచ్చే అవకాశాలు పెరుగుతాయి. వృద్ధుల్లో మలబద్ధకం సమస్య ఉంటుంది. దాంతో మల విసర్జన కోసం గట్టిగా ముక్కటం వల్ల కూడా హెర్నియా వస్తుంది.

నిర్లక్ష్యం చేస్తే?

చర్మపు తిత్తిలోకి పేగులు దిగిపోయి పొత్తికడుపు లేదా గజ్జల్లో హెర్నియా కనిపిస్తే వీలైనంత తొందరగా వైద్యుల్ని సంప్రతించి చికిత్స మొదలుపెట్టాలి. లేదంటే పొట్టలో చర్మం అడుగున ఏర్పడిన రంధ్రం పెద్దదైపోతూ సమస్య మరింత జటిలమవుతుంది. కొన్ని సందర్భాల్లో ఈ తిత్తిలోకి చేరుకున్న పేగులకు రక్త ప్రసరణ అందక కుళ్లిపోవచ్చు కూడా! ఇలాంటప్పుడు ఆ పేగులు సెప్టిక్ అవుతాయి. ఇన్‌ఫెక్షన్ పెరిగి ప్రాణాలకే ప్రమాదం సంభవించవచ్చు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసే కొంతమందిలోనైతే పేగుల పనితీరు తలకిందులై మలం, ఆహారం కలిసిపోయి అవి వెళ్లే మార్గాలు తారుమారవ్వచ్చు. ఇది ఎంతో ప్రమాదకరమైన పరిస్థితి. ఇలా జరగకుండా ఉండాలంటే హెర్నియా లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.

మనం ఎంత దూరం నడుస్తున్నామో.. మన గుండె ఎంత వేగంగా కొట్టుకుంటుందో.. బీపీ.. సుగర్‌లు ఎంత ఉన్నాయో చెప్పే పరికరాలు ఇప్పటికే మనకు మార్కెట్లో అందుబాటులోకి వచ్చేశాయి. మన చర్మం లోపల నుంచి సెన్సర్ల ద్వారా సమాచారాన్ని సేకరించి ఇవి మనకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ వస్తాయి. మన శరీరంలో ఉన్న అవయవాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవాలంటే ఎక్స్‌రేలు, అల్ట్రాసౌండ్, ఎంఆర్ఐలు అవసరమవుతాయి. అల్ట్రాసౌండ్ పరికరాలు- ఒక రకమైన ధ్వని తరంగాలను (సోనార్లు) శరీరంలోకి పంపి.. అవి వెనక్కి తిరిగి వచ్చినప్పుడు- వాటి ద్వారా శరీరంలోని అవయవాల పరిస్థితిని తెలియచెబుతాయి. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న అల్ట్రాసౌండ్ పరికరాలను ఒక చోట మాత్రమే ఉంచి ఉపయోగించగలుగుతాము. తాజాగా ఈ విషయంలో వైద్య శాస్త్రవేత్తలు జరుపుతున్న పరిశోధనలు విజయవంతమయ్యాయి. శరీరంపై టేపుల్లా అతికించుకొనే అల్ట్రాసౌండ్ పరికరాలు సమీప భవిష్యత్తులో అందుబాటులోకి రానున్నాయి. ఈ పరికరాలు ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం..



యూరో కింగ్ స్పెయిన్



నాలుగు టైటిళ్లతో రికార్డు
ఫైనల్లో 2-1తో విజయం
ఇంగ్లండ్ మరో'సారీ'

ప్రైజ్‌మనీ
స్పెయిన్‌కు: రూ. 72 కోట్లు
ఇంగ్లండ్‌కు: రూ. 45 కోట్లు

బెర్లిన్: యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో స్పెయిన్ జైత్రయాత్ర సంచలనరీతిలో ముగిసింది. పుష్కరకాలం తర్వాత ఫైనల్‌కు చేరిన ఈ జట్టు టైటిల్ కోసం పట్టువదలకుండా పోరాడింది. ఆదివారం అర్ధరాత్రి ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో 2-1 తేడాతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. తద్వారా ఏ జట్టుకూ సాధ్యంకాని రీతిలో ఏకంగా నాలుగో టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. వాస్తవానికి ఇరు జట్లు కూడా నువ్వా.. నేనా? అనే తరహాలో పోరాడిన తీరుకు ఎక్స్‌ట్రా సమయం తప్పదనిపించింది. కానీ ఆట చివర్లో స్ట్రయికర్ మైకేల్ ఓయర్జాబల్ (86) చేసిన మెరుపు గోల్‌తో విజయం అందుకుంది. గతంలో స్పెయిన్ 1964, 2008, 2012లో యూరో విజేతగా నిలిచింది. జట్టు తరపున మరో గోల్ నికో విలియమ్స్ (47) సాధించాడు. అటు ఇంగ్లండ్ తరఫున ఏకైక గోల్‌ను సబ్‌స్టిట్యూట్ మిడ్ ఫీల్డర్ కోల్ పామర్ (73) అందించాడు. మరోవైపు 2020 యూరోలోనూ రన్నరప్‌గా నిలిచిన ఇంగ్లండ్ ఈసారి కూడా అదే ఫలితంతో సరిపెట్టుకుంది. అలాగే 1996 యూరో క్వార్టర్స్‌లో చివరిసారి ఈ రెండు జట్లు తలపడగా.. అప్పటి ఓటమికి స్పెయిన్ గట్టిగానే బదులుతీర్చుకుంది.

ఆఖర్లో అద్భుతం: ఫైనల్ మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్ల ఆటగాళ్లు బంతిని తమ ఆధీనంలో ఉంచుకునేందుకు ప్రయత్నించారు. దీంతో హోరాహోరీగా సాగిన తొలి అర్ధభాగంలో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. 45వ నిమిషంలో ఇంగ్లండ్‌కు అవకాశం వచ్చినా సఫలం కాలేదు. ఇక రెండో భాగం 47వ నిమిషంలో లామినే యమాల్ అందించిన పాస్‌ను నికో విలియమ్స్ గోల్‌గా మల్చడంతో స్పెయిన్ ఖాతా తెరిచింది. అయితే 73వ నిమిషంలో ప్రత్యర్థి ఆటగాళ్లను ఏమార్చుతూ పామర్ నేరుగా సంధించిన బంతి గోల్‌పోస్టులోకి వెళ్లడంతో ఇంగ్లండ్ పోటీలోకి వచ్చింది. 1-1తో స్కోరు సమంగా మారిన వేళ.. పోటీ మరింత తీవ్రమైంది. అటు నిర్ణీత సమయం ముగుస్తున్నా మరో గోల్ నమోదు కాకపోవడంతో ఉత్కంఠ పెరిగింది. ఈ దశలో కుకురెల్లా లెఫ్ట్ వింగ్ వైపు బంతిని పాస్ చేయగా.. మెరుపు వేగంతో కదిలిన ఓయర్జాబల్ సిక్స్ యార్డ్ ఏరియా నుంచి బంతిని గోల్‌పోస్టులోకి పుష్ చేశాడు. అంతే.. స్పెయిన్ శిబిరంలో జోష్ ఆకాశాన్నంటింది. అయితే స్కోరును సమం చేసేందుకు 90వ నిమిషంలో ఇంగ్లండ్ ప్లేయర్ల రెండు హెడర్ ప్రయత్నాలను స్పెయిన్ అద్భుతంగా వమ్ము చేసి మ్యాచ్‌ను కాపాడుకోగలిగింది.

ఎదురుచూపులే..

సాకర్ పుట్టినిల్లుగా చెప్పుకొనే ఇంగ్లండ్ జట్టు దాదాపు ఆరు దశాబ్దాలుగా ఓ మేజర్ టైటిల్ కోసం ఎదురుచూస్తూనే ఉంది. 1966లో చివరిసారిగా ఈ జట్టు ఫిఫా వరల్డ్ కప్‌ను గెలిచింది. అప్పటి నుంచీ ఎన్ని ప్రయత్నాలు చేసినా వారిని అదృష్టం మాత్రం వరించడం లేదు. వరుసగా రెండుసార్లు యూరో ఫైనల్‌కు చేరినా కప్‌ను అందుకోలేకపోవడం ఆ జట్టు అభిమానులను దారుణంగా నిరాశపరిచింది. టోర్నీలో మెరుగ్గానే ఆడినా ఈ తుది పోరు ఓటమి తమను చాలాకాలం వెంటాడుతుందని కెప్టెన్ హ్యారీ కేన్ ఆవేదన వ్యక్తంచేశాడు.

1
యూరో చాంపియన్‌షిప్‌ను అత్యధిక సార్లు (4) గెలిచిన జట్టుగా స్పెయిన్. అలాగే టోర్నీలో వరుసగా ఏడు మ్యాచ్‌లను గెలవడం కూడా ఏ టీమ్‌కైనా ఇదే తొలిసారి. దీంతోపాటు అత్యధిక గోల్స్ (15) కూడా స్పెయిన్ ఆటగాళ్లే సాధించారు.



యమాల్‌కు అవార్డు

స్పెయిన్ యువ ఫార్వర్డ్ లామినే యమాల్‌కు యంగ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కింది. తాజా యూరోలో అతడు అత్యధికంగా నాలుగు గోల్స్‌లో భాగస్వామ్యం కాగా.. సెమీస్‌లో గోల్ సాధించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. యమాల్ శనివారమే 17వ వడిలోకి ప్రవేశించాడు.



థామస్ ముల్లర్ వీడ్కోలు

బెర్లిన్: జర్మనీ ఫుట్‌బాల్ దిగ్గజం థామస్ ముల్లర్ 14 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికాడు. స్వదేశంలో జరిగిన యూరో కప్‌లో అతడు పెద్దగా ప్రభావం చూపలేదు. అలాగే జట్టు కూడా క్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టింది. దీంతో 34 ఏళ్ల విడ్‌ఫీల్డర్ ముల్లర్ ఆటకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. 2010లో అరంగేట్రం చేసిన ముల్లర్ అదే ఏడాది జరిగిన వరల్డ్‌కప్‌లో గోల్డెన్ బూట్ దక్కించుకున్నాడు. మొత్తంగా 131 మ్యాచ్‌ల్లో 45 గోల్స్ సాధించిన ముల్లర్.. 2014లో ఫిఫా వరల్డ్ కప్ గెలుపులోనూ కీలకపాత్ర పోషించాడు.

సాత్విక్ జోడీకి సులువైన డ్రా

పారిస్ ఒలింపిక్స్

న్యూఢిల్లీ: స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయానికి పారిస్ ఒలింపిక్స్‌లో సులువైన డ్రా లభించింది. బ్యాడ్మింటన్ డబుల్స్ స్వర్ణ పతక రేసులో హాట్ ఫేవరెట్ సాత్విక్-చిరాగ్ జోడీకి మూడో సీడ్ దక్కింది. గ్రూప్-సిలోని భారత్ ద్వయానికి ఇండోనేసియా జోడీ, వరల్డ్ నెంబర్-6 ఫజార్ అల్ఫియాన్-మహ్మద్ రియాన్ నుంచి గట్టి పోటీ ఎదురవనుంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ప్రపంచ 31 ర్యాంకర్ మార్క్ లామ్స్‌ఫుస్-మార్విన్ సిడెల్ (జర్మనీ), వరల్డ్ ర్యాంక్ 43 లుకాస్ కోర్వీ-రొనాన్ లాబార్ (ఫ్రాన్స్)తో సాత్విక్ జోడీ పోటీపడనుంది. ఒలింపిక్స్ పురుషుల డబుల్స్‌లో ఈసారి మొత్తం 17 జోడీలు తలపడతున్నాయి.



దివ్యాంగులను కించపరుస్తారా?

యువీ, భజ్జీ, రైనాపై కేసు నమోదు

న్యూఢిల్లీ: దివ్యాంగుల మనోభావాలను కించపరిచేలా వారిని అనుకరిస్తూ చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్న ఫిర్యాదుతో మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, సురేశ్ రైనా, గుర్‌కీరత్ మాన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి శితే.. ఇంగ్లండ్ వేదికగా ఆదివారం రాత్రి ముగిసిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ క్రికెట్ లీగ్ ఫైనల్లో యువరాజ్ కెప్టెన్సీలోని హర్భజన్, రైనా, ఊతప్ప తదితర మాజీలతో కూడిన ఇండియా చాంపియన్స్ జట్టు పాకిస్థాన్‌ను ఓడించి విజేతగా నిలిచింది. ఈ విజయాన్ని సెలెబ్రేట్ చేసుకునే క్రమంలో యువరాజ్, భజ్జీ, రైనా కాస్త అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు.

మరికొంత కాలం ఆడతా!

రిటైర్మెంట్‌పై రోహిత్

డాలస్ (యూఎస్): మరికొంత కాలం టెస్టులు, వన్డేలు ఆడతానని భారత కెప్టెన్ రోహిత్ శర్మ చెప్పాడు. వరల్డ్‌కప్ నెగ్గిన అనంతరం టీ20లకు హిట్‌మ్యాన్ రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం క్రికెట్ నుంచి బ్రేక్ తీసుకొన్న 37 ఏళ్ల రోహిత్.. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అభిమాని అడిగిన ప్రశ్నకు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. 'సుదీర్ఘ ప్రణాళికలు అంటూ ఏమీ లేవు. మరికొంత కాలం నేను ఆడుతుండగా చూస్తారని చెప్పాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్, చాంపియన్స్ ట్రోఫీలో కూడా టీమిండియాకు రోహిత్ సారథ్యం వహిస్తాడని బీసీసీఐ కార్యదర్శి జై షా కొద్ది రోజుల క్రితమే స్పష్టం చేశాడు.



ప్రైజ్‌మనీ
అర్జెంటీనాకు: రూ. 133 కోట్లు
కొలంబియాకు: రూ.58 కోట్లు

వారెవ్వా.. అర్జెంటీనా

16వ సారి కోపా కప్ కైవసం

- మార్టినెజ్ లేటు గోల్
- ఫైనల్లో 1-0తో కొలంబియాపై విజయం

మయామి గార్డెన్స్ (యూఎస్): లాటెరో మార్టినెజ్ లేటు గోల్‌తో.. కోపా అమెరికా కప్‌లో డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా చరిత్ర సృష్టించింది. రికార్డు స్థాయిలో 16వ సారి టైటిల్‌ను సొంతం చేసుకొంది. సోమవారం జరిగిన ఫైనల్లో అర్జెంటీనా 1-0తో కొలంబియాను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరుజట్లూ గోల్ సాధించక పోవడంతో.. మ్యాచ్ ఫలితం అదనపు సమయానికి దారి తీసింది. ఈ క్రమంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మార్టినెజ్.. 112వ నిమిషంలో జియోవని లొ సెల్సో అందించిన చక్కని పాస్‌ను నేరుగా గోల్‌లోకి కొట్టి అర్జెంటీనాను గెలిపించాడు. దీంతో వరుసగా రెండోసారి మెస్సీ సేన టైటిల్‌ను ముద్దాడింది. 15 సార్లు కోపా విజేతగా నిలిచిన ఉరుగ్వేను అర్జెంటీనా అధిగమించింది. మ్యాచ్ బ్రేక్ సమయంలో కొలంబియా పాప్ స్టార్ షకీరా తన ఆటపాటలతో అభిమానులను ఉర్రూతలూగించింది. కాగా, అర్జెంటీనా విజయంతో స్వదేశంలో అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి.


షకీరా



బోరుమన్న మెస్సీ

అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ కాలి గాయంతో మధ్యలోనే మ్యాచ్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. 64వ నిమిషంలో వేగంగా పరిగెత్తుకొంటూ వెళ్లిన మెస్సీ కూలబడిపోయాడు. నడవలేకపోవడంతో ప్రాథమిక చికిత్స చేసి బయటకు తీసుకెళ్లారు. అయితే, అతడి కుడి కాలి చీలమండ వాచినట్టు స్పష్టంగా కనిపించింది. కీలక మ్యాచ్‌లో ఇలా దూరమవడంపై మెస్సీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. బెంచ్‌పై ఉన్న అతడు కన్నీళ్లు పెట్టుకొంటున్న వీడియో నెట్‌లో వైరల్‌గా మారింది.

ఫ్యాన్స్ రగడ..

భారీ సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చిన ఫ్యాన్స్ గందరగోళం సృష్టించడంతో మ్యాచ్ గంటా 22 నిమిషాలు ఆలస్యంగా మొదలైంది. కొలంబియా అభిమానులు ఎక్కువగా స్టేడియంలోకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపు తప్పింది. కొందరు గేట్లు దూకి స్టేడియంలోకి చొరబడే ప్రయత్నం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది అతి కష్టమ్మీద పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

లియోనెల్ చరిత్ర

కెరీర్‌లో అత్యధికంగా 45 టైటిళ్లు సాధించిన ఏకైక ఆటగాడిగా 37 ఏళ్ల లియోనెల్ మెస్సీ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో బ్రెజిల్ దిగ్గజం డానీ ఆల్వ్‌స్ అత్యధికంగా 44 టైటిళ్ల రికార్డును అధిగమించాడు. 2005లో అండర్-20 వరల్డ్‌కప్‌తో లియోనెల్ ప్రస్థానం ఆరంభమైంది. 2022 ఫిఫా వరల్డ్‌కప్ సహా గత మూడేళ్లలో జట్టుకు 4 టైటిళ్లు అందించాడు. 2021లో మెస్సీ హయాంలో కోపా కప్ నెగ్గిన అర్జెంటీనా.. మళ్లీ టైటిల్‌నిలబెట్టుకొంది. క్లబ్ కెరీర్‌లో అత్యధికంగా 39 టైటిళ్లను మెస్సీ సాధించాడు.

వాణిజ్య లోటు రూ.1.76 లక్షల కోట్లు

ఎగుమతుల్లో వృద్ధి 2.5 శాతం
దిగుమతుల్లో వృద్ధి 5 శాతం



న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలు తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో సైతం దేశీయ ఎగుమతుల రంగం జూన్ నెలలో 2.56 శాతం వృద్ధిని నమోదు చేసింది. జూన్ నెల ఎగుమతులు 3,520 కోట్ల డాలర్లుగా (రూ.2.95 లక్షల కోట్లు) నమోదు కాగా వాణిజ్య లోటు 2,098 కోట్ల డాలర్లకు (రూ.1.76 లక్షల కోట్లు) పెరిగింది. గత ఏడాది జూన్‌లో వాణిజ్య లోటు 1,919 కోట్ల డాలర్లుంది (రూ.1.61 లక్షల కోట్లు). కాగా దిగుమతులు 5 శాతం పెరిగి 5,618 కోట్ల డాలర్లకు (రూ.4.72 లక్షల కోట్లు) చేరాయి. సోమవారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జూన్ నెలలో క్రూడాయిల్, పప్పులు, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు పెరిగాయి. ఇదిలా ఉండగా ఏప్రిల్-జూన్ నెలల మధ్య కాలంలో ఎగుమతులు 5.84 శాతం వృద్ధితో 10,996 కోట్ల డాలర్లకు (రూ.9.24 లక్షల కోట్లు) చేరుకోగా దిగుమతులు 7.6 శాతం పెరిగి 17,223 కోట్ల డాలర్లకు (రూ.14.47 లక్షల కోట్లు) చేరాయి. ఈ మూడు నెలల వాణిజ్య లోటు 5,616 కోట్ల డాలర్ల (రూ.4.72 లక్షల కోట్లు) నుంచి 6,226 కోట్ల డాలర్లకు (రూ.5.23 లక్షల కోట్లు) పెరిగింది. ప్రస్తుత ధోరణిని చూసినట్టయితే ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతులు 80 వేల కోట్ల డాలర్ల (రూ.67.20 లక్షల కోట్లు) స్థాయిని దాటవచ్చని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అంచనా వేశారు. ఇదిలా ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వస్తు సేవల మొత్తం ఎగుమతులు 20 వేల కోట్ల డాలర్లుగా (రూ.16.80 లక్షల కోట్లు) ఉన్నాయని ఆయన చెప్పారు. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, కాఫీ, రసాయనాలు ప్రధానంగా ఎగుమతుల వృద్ధికి దోహదపడినట్టు తెలిపారు.

16 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

ఆహార వస్తువులు ప్రత్యేకించి కూరగాయలు, తయారీ వస్తువుల ధరలు పెరగడంతో జూన్ నెలలో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 3.36 శాతానికి దూసుకుపోయింది. ఇది 16 నెలల గరిష్ఠ స్థాయి. ద్రవ్యోల్బణం పెరగడం వరుసగా ఇది నాలుగో నెల. మే నెలలో ఇది 2.61 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో మైనస్ 4.18 శాతం ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆహార వస్తువుల ధరలు 10.87 శాతం, కూరగాయల ధరలు 38.76 శాతం పెరిగాయి. ప్రత్యేకించి ఉల్లిపాయల ధర 93.35 శాతం, బంగాళాదుంప ధర 66.37 శాతం పెరిగింది. పప్పుల ధరల్లో 21.64 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇవి కాకుండా పళ్ల ధర 10.14 శాతం, తృణధాన్యాల ధర 9.27 శాతం, పాల ధర 3.37 శాతం పెరిగాయి.

బిజినెస్



పబ్లిక్ ఇష్యూకి సాయి లైఫ్ సైన్సెస్

రూ.800 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చాలా కాలం తర్వాత మరో హైదరాబాద్ ఫార్మా కంపెనీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఈ ఐపీఓ ద్వారా రూ.800 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇష్యూలో భాగంగా రూ.800 కోట్ల మొత్తానికి కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయటంతో పాటు ప్రమోటర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా 6.15 కోట్ల షేర్లను విక్రయించనున్నట్లు ముసాయిదా పత్రాల్లో పేర్కొంది. ఓఎఫ్ఎస్ కింద ప్రమోటర్ సంస్థల్లో ఒకటైన సాయి క్వెస్ట్ సిన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు ప్రైవేట్ ఈక్విటీ సంస్థలైన టీపీజీ ఆసియా 7 ఎస్ఎఫ్ పీటీఈ లిమిటెడ్, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియా కొంతమేరకు తమ వాటాలను విక్రయించనున్నాయి. ప్రస్తుతం సాయి లైఫ్ సైన్సెస్ ఈక్విటీలో టీపీజీ క్యాపిటల్‌కు 39.69 శాతం, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాకు 5.5 శాతం వాటా ఉండగా సాయి క్వెస్ట్ సిన్‌కు 5.61 శాతం వాటాలున్నాయి.

రుణ చెల్లింపుల కోసమే రూ.600 కోట్లు

పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించనున్న రూ.800 కోట్ల మొత్తంలో రూ.600 కోట్లను రుణాల చెల్లింపులకు వినియోగించనున్నట్లు సాయి లైఫ్ సైన్సెస్ వెల్లడించింది. మిగిలిన మొత్తాలను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వెచ్చించనున్నట్లు తెలిపింది. కాగా సాయి లైఫ్ సైన్సెస్.. ప్రముఖ అంతర్జాతీయ ఫార్మా, బయోటెక్నాలజీ కంపెనీలకు కొత్త ఔషధాల అభివృద్ధికి అవసరమైన ఎండ్ టు ఎండ్ సేవలు అందిస్తోంది. కాగా ఈ ఇష్యూకి కోటక్ మహీంద్రా క్యాపిటల్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్, జెఫ్రీస్ ఇండియా, మోర్గాన్ స్టాన్లీ ఇండియా బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్స్‌గా వ్యవహరించనున్నాయి.

అరబిందో ఫార్మా షేర్ల బైబ్యాక్!

ఈ నెల 18న బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకునే చాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా షేర్ల బైబ్యాక్‌కు రెడీ అవుతోంది. ఈ నెల 18న జరగనున్న డైరెక్టర్ల బోర్డు సమావేశంలో జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలతో పాటు షేర్ల బైబ్యాక్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బోర్డు సమావేశంలో దీనికి ఆమోద ముద్ర పడితే కంపెనీ చరిత్రలో షేర్ల బైబ్యాక్‌కి రావడం ఇదే మొదటిసారి అవుతుంది.

షేరు దూకుడు: బైబ్యాక్ వార్తలతో సోమవారం అరబిందో ఫార్మా షేరు లాభాల బాట పట్టింది. బీఎస్ఈలో ఒక దశలో ఆరు శాతం లాభంతో రూ.1,409.25 చేరుకుంది షేరుకిది 52 వారాల గరిష్ఠ స్థాయి. అయితే చివరికి లాభాల స్వీకరణతో 3.53 శాతం లాభంతో రూ.1,373.85 వద్ద ముగిసింది. గత ఏడాది కాలంలో అరబిందో ఫార్మా కంపెనీ షేరు మదుపరులకు దాదాపు 90 శాతం లాభాలు పంచింది.

జీవీకే పవర్‌పై దివాలా ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్

ఆదేశాలు జారీ చేసిన ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్

ఐఆర్‌పీగా సతీష్ కుమార్ గుప్తా నియామకం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీవీకే నేచురల్ రీసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లపై దివాలా ప్రక్రియకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు గాను సతీష్ కుమార్ గుప్తాను ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ (ఐఆర్‌పీ)గా నియమించింది. ఆస్ట్రేలియాలో బొగ్గు గనుల అభివృద్ధి కోసం జీవీకే కోల్ డెవలపర్స్ (సింగపూర్) పేరుతో జీవీకే గ్రూప్, జీవీకే నేచురల్ రీసోర్సెస్.. ఐసీఐసీఐ బ్యాంక్ (దుబాయ్, బహ్రెయిన్ శాఖలు), కెనరా బ్యాంక్ (లండన్ శాఖ), బ్యాంక్ ఆఫ్ బరోడా (లండన్, సింగపూర్ శాఖలు) నుంచి 2021లో 100 కోట్ల డాలర్ల రుణం తీసుకుంది. ఈ రుణానికి తోడు మరో 3.5 కోట్ల డాలర్లను లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో తీసుకున్నాయి. వడ్డీతో కలిపి ఈ మొత్తం దాదాపు 200 కోట్ల డాలర్ల వరకు అయ్యింది. కాగా ఈ రుణాలను చెల్లించటంలో విఫలం కావటంతో దీనికి హామీగా ఉన్న జీవీకే పవర్, జీవీకే నేచురల్ రీసోర్సెస్ ఈ మొత్తాన్ని వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించాలని లండన్ హైకోర్టు గత ఏడాది స్పష్టమైన తీర్పు వెలువరించింది. అయినా జీవీకే గ్రూప్ నుంచి స్పందన లేకపోవటంతో ఐసీఐసీఐ బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం ఇంటెరిమ్ రిలీఫ్ కోసం ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం సోమవారం నాడు ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్-2 మెంబర్ రాజీవ్ భరద్వాజ్ (జుడిషియల్), సంజయ్ పురి (టెక్నికల్).. జీవీకే పవర్, జీవీకే నేచురల్ రీసోర్సెస్‌పై పూర్తి స్థాయి దివాలా ప్రక్రియకు ఆదేశాలు జారీ చేశారు.

జెన్ టెక్నాలజీస్.. ఏఐ ఆధారిత రోబో 'ప్రహస్థ'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పని చేసే జెన్ టెక్నాలజీస్ మరిన్ని కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. అంతర్జాతీయ, దేశీయ రక్షణ మార్కెట్ కోసం ప్రత్యేకంగా ఈ ఉత్పత్తులను రూపొందించింది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల రక్షణ దళాలకు ట్రైనింగ్ సొల్యూషన్స్, యాంటీ డ్రోన్ టెక్నాలజీలను అందిస్తున్న ఈ సంస్థ తాజాగా కృత్రిమ మేధ (ఏఐ)తో పని చేసే 'ప్రహస్థ' అనే రోబోను మార్కెట్లోకి విడుదల చేసింది. కంపెనీ అనుబంధ సంస్థ ఏఐ టూరింగ్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో కంపెనీ ఈ రోబోను అభివృద్ధి చేసింది. దీనికి తోడు యాంటీ డ్రోన్ సిస్టమ్ కెమెరా 'హ్యాక్‌ఐ', రిమోట్ కంట్రోల్డ్ వెపన్ స్టేషన్ 'బార్బారిక్-యూఆర్‌సీడబ్ల్యుఎస్', సైనికులను తీసుకు వెళ్లే వాహనాలు, తేలికపాటి పోరాట వాహనాలు (ఎల్‌సీవీ), బోట్లకు అవసరమైన 'స్థిర్ స్టాబ్ 640' అనే రగ్గడ్ స్టెబిలైజ్‌డ్ సైట్ డిజైన్డ్ పరికరాలను మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో ప్రహస్థ రోబో లిడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్)తో పనిచేస్తుంది. ఈ స్వయం చాలిత నాలుగు కాళ్ల రోబో ద్వారా రియల్ టైమ్ 3డీ టెరైన్ మ్యాపింగ్ చేసి మిషన్ ప్లానింగ్, నేవిగేషన్, త్రెట్ అసెస్‌మెంట్ చేయవచ్చని తెలిపింది.



బ్యాంకింగ్ షేర్ల జోరు

కొత్త శిఖరాలకు సూచీలు


ముంబై: విదేశీ నిధుల రాక పెరగడంతో పాటు పీఎస్‌యూ బ్యాంక్ షేర్లలో జరిగిన కొనుగోళ్ల ప్రభావంతో ఈక్విటీ మార్కెట్ రికార్డు ర్యాలీని కొనసాగించింది. సెన్సెక్స్ 145.52 పాయింట్ల లాభంతో 80,664.54 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 343.20 పాయింట్లు లాభపడి 80,862.54 పాయింట్లకు దూసుకుపోయింది. ఈ రెండూ చారిత్రక గరిష్ఠ స్థాయిలే. అదే విధంగా నిఫ్టీ కూడా కొత్త రికార్డులు నమోదు చేసింది. ఇంట్రాడేలో 132.9 పాయింట్లు లాభపడి 24,635.05 పాయింట్లకు దూసుకుపోయిన సూచీ చివరికి 84.55 పాయింట్ల లాభంతో 24,586.70 వద్ద స్థిరపడింది. పీఎస్‌యూ బ్యాంకులు ప్రకటించిన ఆర్థిక ఫలితాలు కూడా ఆశావహంగా ఉండడం బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు పెరిగేందుకు దోహదపడింది. పీఎస్‌యూ బ్యాంకుల్లో ఐఓబీ షేరు గరిష్ఠంగా 7.35 శాతం లాభపడగా కెనరా బ్యాంక్, పీఎన్‌బీ, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ షేర్లు కూడా లాభపడ్డాయి.

455 లక్షల కోట్లకు మార్కెట్ సంపద

ఈ ర్యాలీతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.455 లక్షల కోట్లకు దూసుకుపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి అది రూ.4,55,06,566.48 కోట్ల వద్ద స్థిరపడింది. రెండు రోజుల ర్యాలీలో ఇన్వెస్టర్ల సంపద రూ.3.85 లక్షల కోట్ల మేరకు పెరిగింది.

- ఆంధ్రప్రదేశ్‌లో ఉబర్ తన కార్యకలాపాలు విస్తరించింది. ద్విచక్ర వాహన సర్వీస్ ఉబర్ మోటోను రాజమండ్రి, నెల్లూరు నగరాలకు విస్తరించినట్లు ప్రకటించింది. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని నగరాలకు ఈ సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించింది
- ఐటీసీకి చెందిన అగర్‌బత్తీ బ్రాండ్ ఐటీసీ మంగళ్‌దీప్ ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. దిల్ సే కరో బాత్, భగవాన్ కే సాథ్ పేరుతో ఈ క్యాంపెయిన్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రకటన (టీవీసీ)ను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో విడుదల చేసింది.
- బెంగళూరుకి చెందిన ఇండ్‌కాల్ టెక్నాలజీస్ స్మార్ట్‌ఫోన్ విభాగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం ఏసర్ బ్రాండ్‌తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా ఏసర్ బ్రాండ్ కింద స్మార్ట్‌ఫోన్స్ డిజైన్, తయారీ, డిస్ట్రిబ్యూషన్‌ను ఇండ్‌కాల్ చేపట్టనుంది.
- టాటా ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన బిగ్‌బాస్కెట్.. తిరుపతికి తన క్విక్ డెలివరీ సర్వీస్‌లను విస్తరించింది. వినియోగదారులకు కేవలం పది నిమిషాల్లో రోజువారీ నిత్యావసరాలను డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది. మొత్తం 10,000కు పైగా ఉత్పత్తులు తమ ప్లాట్‌ఫామ్‌పై అందుబాటులో ఉంటాయని తెలిపింది.

టీవీఎస్ నుంచి రెండు కొత్త బైక్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టీవీఎస్ మోటార్ కంపెనీ అపాచీ ఆర్‌టీఆర్ సీరిస్‌లో రెండు సరికొత్త 160 సీసీ స్పోర్ట్స్ బైక్స్‌ను సోమవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో విడుదల చేసింది. అపాచీ ఆర్‌టీ ఆర్ 160, ఆర్‌టీఆర్ 160 4వీ ధరలు వరుసగా రూ.1,09,990, రూ.1.19,990 (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయని కంపెనీ ప్రీమియం బిజినెస్ హెడ్ విమల్ సంబ్లీ విలేకరులతో చెప్పారు. సోమవారమే ఈ బైక్స్ బుకింగ్ ప్రారంభమైంది. బుక్ చేసిన వారం పది రోజుల్లోనే ఈ రెండు బైకులను కస్టమర్లకు డెలివరీ చేస్తామని విమల్ తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,640 ▼	67,500 ▼	99,700 ▼
ముంబై	72,932 ▲	66,806 ▲	91,835 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ



హైదరాబాద్	535
వరంగల్	537
చిత్తూరు	573
విజయవాడ	555
గోదావరి	555
విశాఖపట్నం	575

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102
వరంగల్	102
కరీంనగర్	102
మహబూబ్‌నగర్	102
కర్నూలు	102
విశాఖపట్నం	102
గోదావరి	110
విజయవాడ	110
గుంటూరు	110
ఒంగోలు	110
చిత్తూరు	115
నెల్లూరు	115
అనంతపురం	110

ఎవర్నీ వదలం

ఆకాశమే హద్దుగా వైసీపీ నేతల దోపిడీ

ఇక ఎవరి క్వారీలు వారికే

గత పాలనలో వైసీపీ నేతలు లీజు దారులను బెదిరించి దౌర్జన్యంగా మైనింగ్ వ్యాపారాన్ని లాక్కున్నారు. ఇలాంటి బాధితులు ఉంటే ధైర్యంగా ముందుకొచ్చి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయండి. మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇకపై ఎవరి వ్యాపారాలు వారే చేయాలి. ఎవరి క్వారీలు వారే నిర్వహించుకోవాలి. ఇందుకు మేం అండగా ఉంటాం.

అడవులు ఖాళీ

వైసీపీ నేతలు కొందరు ఎర్రచందనం దోచుకొని చైనా తరలించారు. నేను కేవలం ఒకరిద్దరి పేర్లు చెప్పను. అందరి జాతకాలు బయటకు తీస్తాం. అక్రమాల కోసం స్మగ్లర్లు అడవిని ఖాళీ చేశారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. వారు తిరగడానికి వాహనాలు, డీజిల్ ఖర్చు కూడా ఇవ్వలేదు. అడవిలో పనిచేసే ఫ్రంట్‌లైన్ సిబ్బందిని ఇతర జిల్లాలకు పంపించి స్మగ్లర్లు దోచుకుపోయేలా సహకరించారు. ఒకాయన స్మగ్లింగ్‌తో వచ్చిన ఆదాయంతో చిత్తూరు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారు. పుంగనూరు, చిత్తూరు, పల్నాడు ప్రాంతాల్లో అడవులను పెద్ద ఎత్తున ధ్వంసం చేశారు. కర్నూలు జిల్లాలో బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసిన రవ్వలకొండను తవ్వేశారు.

రుషికొండ ప్యాలెస్ ఎందుకో?

విశాఖలో రుషికొండను తవ్వేసి ప్యాలెస్ కట్టారు. ఇది ఎందుకు కట్టారంటే.. ప్రధాని, రాష్ట్రపతి వస్తే ఉండటానికి అని కబుర్లు చెబుతున్నారు. 500 కోట్లు పెట్టి ప్యాలెస్ కట్టారు. దాన్ని ఏం చేయాల్నో నాకు అర్థం కావడం లేదు. పాలకులు ప్రజలకు సేవకులుగా ఉండాలే తప్ప రాజులుగా ఉండకూడదు. దోపిడీ జరిగిందని ప్రజలు చెబితే వారిపై దాడులు చేశారు. మీడియా వార్తలు రాస్తే వారిపై దాడులు చేసి జైల్లో పెట్టారు. దొంగలకు తాళాలు ఇచ్చి దోచుకునేలా చేశారు.

భూకబ్జాలపై టోల్ ఫ్రీ

వైసీపీ నేతల భూ కబ్జాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తాం. మా దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తాం. తప్పు చేసిన వారిని వదిలిపెట్టం. రెవెన్యూ వచ్చే శాఖల్లో బయటి నుంచి తీసుకొచ్చిన వారిని కూర్చోబెట్టి అక్రమాలు చేశారు. రేషన్ బియ్యంలో కూడా లెక్కలేనన్ని అక్రమాలు చేశారు.

ఇక షాక్ ట్రీట్‌మెంటే

రాష్ట్రంలో అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడ జరిగినా ఊరుకునేది లేదు. మచ్చుమర్రి, విజయనగరంలో జరిగిన ఘటనలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయి. మైనర్లు కూడా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. చర్యల్లేక ఉన్మాదులుగా తయారవుతున్నారు. గత ప్రభుత్వ అలసత్వమే ఈ దుర్మార్గాలకు కారణం. ఆ రెండు సంఘటనలపై స్పెషల్ కోర్టు ఏర్పాటు చేస్తాం. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారికి షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తాం.



భూ రక్ష సర్వే సందర్భంగా జగన్ బొమ్మలతో కూడిన హద్దు రాళ్లను సిద్ధం చేసిన వైనాన్ని వివరిస్తున్న సీఎం

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు పేదలపై ప్రతాపం చూపారని, భూములు, ఆస్తులను బలవంతంగా లాక్కున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజలు తమ భూములు, ఆస్తులు తమ పేరిటే ఉన్నాయా? లేదా? అని పరిశీలన చేసుకోవాలని కోరారు. భూములు తమ పేరిట లేకున్నా.. ఎవరైనా బలవంతంగా, దౌర్జన్యంగా లాక్కున్నా వెంటనే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే గనుల లీజులను భయపెట్టి లాక్కున్నా ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని, జరిగిన అన్యాయాన్ని ధైర్యంగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. 'మీ భూములు, ఆస్తులు, గనుల లీజులను తిరిగి మీకే ఇప్పిస్తాం. ఈ ప్రభుత్వం మీకు అన్ని విధాలుగా అండగా ఉంటుంది' అని ప్రజలకు భరోసా ఇచ్చారు. సోమవారం సచివాలయంలో భూమి, గనులు, అటవీ సంపదపై శ్వేతపత్రాలు విడుదల చేశారు. ఆయా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయన ఏం చెప్పారంటే..

ఇది కేవలం కేస్ స్టడీనే

గత ప్రభుత్వం పంచభూతాలను సైతం మింగేసింది. పెద్ద ఎత్తున భూకుంభకోణం జరిగింది. ఖనిజ సంపద, అడవులను ఇష్టానుసారం ధ్వంసం చేశారు. మాకు అందిన రికార్డుల ప్రకారం కంటే ఎక్కువగానే దోపిడీ జరిగింది. విశాఖ, ఒంగోలు, చిత్తూరు, తిరుపతిలో జరిగిన సహజ వనరుల దోపిడీ ఒక కేస్‌స్టడీ మాత్రమే. ఇళ్ల స్థలాల పేరిట అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు.

భూముల్లో 35 వేల కోట్ల దోపిడీ

వైసీపీ నేతలు ముందుగానే భూములు గుర్తించి, వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ తర్వాత రెండింతలు ధరకు ప్రభుత్వానికి విక్రయించారు. ఐదేళ్ల పాటు ప్రజాస్వామ్యానికి గంతలు కట్టారు. ఐదేళ్ల జగన్ పాలనలో 35,576 కోట్ల నష్టం జరిగింది. మా దగ్గర ఉన్న సమాచారం ఆధారంగానే ఈ లెక్క చెబుతున్నాం. ఇదింకా చాలా ఎక్కువే ఉంటుంది. మా అంచనా ప్రకారం 1.75 లక్షల ఎకరాల భూమిని దోచుకుతిన్నారు. తిరుపతి పరిధిలో నిషేధ భూముల జాబితా నుంచి అడ్డగోలుగా భూములను తొలగించి వైసీపీ నేతలకు కట్టబెట్టారు. ఆ భూముల విలువ 270 కోట్లపైనే. తిరుచానూరులో 4.5 ఎకరాల కాలువ పోరంబోకు, మంగళంలో 27.14 ఎకరాల ప్రభుత్వ భూమి, దామినీడులో 3.32 ఎకరాల కుంటపోరంబోకు, సూరప్పకాశంలో 12.69 ఎకరాల సీలింగ్ భూమి, కోట్రమంగళంలో 15.28 ఎకరాల భూమి, దుర్గసముద్రంలో 7.98 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా 22(ఏ) నుంచి తొలగించి కట్టబెట్టారు.

10 వేల ఎకరాల పేదల అసైన్డ్ భూమి...

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పేదలనే బలి తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో 10 వేల ఎకరాలను బలవంతంగా లాక్కున్నారు. ఇళ్ల స్థలాలకు భూములు సేకరిస్తున్నారని తెలిసి వైసీపీ నేతలు కారుచౌకగా భూములు దక్కించుకున్నారు. వాటిని రెండు, మూడు రెట్ల అధిక ధరలకు తిరిగి ప్రభుత్వానికి విక్రయించారు. అసైన్డ్, అవ, పోరంబోకు భూములను కూడా లాక్కున్నారు. అనర్హులకు ఇంటి స్థలాలు ఇచ్చారు.

ఇదీ భూముల అక్రమాల చిట్టా (రూ.కోట్లలో)

విశాఖలో భూ దోపిడీ	4469
ప్రకాశంలో రిజిస్ట్రేషన్ స్కామ్	101
తిరుపతిలో భూ దందా	270
చిత్తూరులో నొక్కేసిన ఇనాం భూమి	99
ఇళ్ల స్థలాల భూసేకరణలో అధిక ధరల వల్ల నష్టం	2850
నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఆఫీసులకు స్థలాలు	300
అనర్హులకు అసైన్డ్ భూముల విలువ	1300
అసైన్డ్ భూముల పరాధీనం	14831
అక్రమంగా చుక్కల భూములకు స్వేచ్ఛతో దోపిడీ	6189
షరతు గల పట్టా భూముల దోపిడీ	1002
ఇనాం (సర్వీసు) భూముల దోపిడీ	4165
మొత్తం దోపిడీ (1.75 లక్షల ఎకరాల విలువ)	35,576

విశాఖ భూదందాలో మచ్చుతునకలు

- టీడీపీ ప్రభుత్వంలో విశాఖలో సినిమా స్టూడియో కోసం రామానాయుడుతో మాట్లాడి భూములు కేటాయించాం. జగన్ సర్కారు ఆ భూములను నివాస సముదాయాల కోసం క్లాసిఫికేషన్ మార్చింది.
- ఓల్డేజ్ హోమ్ కోసం హయగ్రీవాకు 12.51 ఎకరాలు కేటాయిస్తే, జగన్ ప్రభుత్వంలో దాన్ని నివాసాల కోసం మార్చేశారు.
- శారదాపీఠానికి 22 కోట్ల విలువైన 15 ఎకరాల భూమిని కేవలం 15 లక్షలకే కట్టబెట్టారు.
- సాహీ హియరింగ్ కేర్ అనే సంస్థకు ఎండాడలో ఉచితంగా ఎకరం భూమిని కేటాయించారు. అక్కడ ఎకరా 15.33 కోట్లు ధర ఉంది. అదేదో ఈయన (జగన్) సొంత ఆస్తి అన్నట్లుగా ఉచితంగా ఇచ్చారు.
- దసపల్లా, ఎంవీవీ, ఎంకే హౌజింగ్ వంటి వాటిల్లో అడ్డగోలుగా వ్యవహరించారు. ఇలా ఒక్క విశాఖలో చేసిన భూ దందా విలువే 4,469 కోట్లు. ఇది కేవలం అంచనా. వాస్తవాలను పరిశీలిస్తే నష్టం మరింతగా ఉంటుంది.

వైసీపీ ఆఫీసులకు 300 కోట్ల భూములు

జీవో 340 ప్రకారం వైసీపీ ఆఫీసుల నిర్మాణం కోసం 300 కోట్ల విలువైన 40.78 ఎకరాల భూమిని కేటాయించారు. నిబంధనలను, ఇతర మార్గదర్శకాలను ఉల్లంఘించి 26 జిల్లాల్లో కేటాయింపులు చేశారు. అనుమతులు తీసుకోకుండా ఆఫీసుల నిర్మాణం చేపట్టారు.

అనర్హులకు 1300 కోట్ల 'అసైన్డ్'

అసైన్డ్ భూముల కేటాయింపులో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారు. ఏమాత్రం అర్హత లేని తమ కేడర్ 8,086 మందికి 13,081 ఎకరాల భూమి ఇప్పించారు. ఆ భూమి విలువ 1300 కోట్లపైమాటే. కడప జిల్లాలో 3,357 మందికి 5,796 ఎకరాలు, కర్నూలులో 856 మందికి 1145 ఎకరాలు, అనంతపురంలో 3,471 మందికి 5,554 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 84 మందికి 103.15 ఎకరాలు, నంద్యాలలో 318 మందికి 483 ఎకరాల చొప్పున వైసీపీ కేడర్‌కు భూములు కట్టబెట్టారు.

40 వేల ఎకరాల 'అసైన్డ్' దోపిడీ

వైసీపీ నేతలు చట్టాన్ని మార్చి, పేదల నుంచి 40 వేల ఎకరాల అసైన్డ్ భూములు తీసుకున్నారు. చట్టం వస్తే ఏ భూములకు హక్కులు వస్తాయో ముందుగా గుర్తించి ఆ భూముల రైతులతో జీపీఏ ద్వారా కొన్నారు. ఆ తర్వాత అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆ భూములను 22(ఏ) నుంచి తొలగించి హస్తగతం చేసుకున్నారు. పీఓటీ చట్టం లక్ష్యాలను నీరుగార్చారు.

టైటిల్ చట్టంతో కుట్ర

నీతి ఆయోగ్ సిఫారసులకు విరుద్ధంగా జగన్ సర్కారు టైటిల్ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని ఉపయోగించి ప్రజల భూములను వైసీపీ నేతలు దోచుకోవాలన్నదే అసలైన ప్లాన్. ఈ చట్టంతో ప్రజల ఆస్తులను ప్రమాదంలో పడేసే ప్రయత్నం చేశారు. జగన్ ప్రభుత్వంలో ఆయన పత్రిక సాక్షిలో పనిచేసిన వారిని సలహాదారులుగా పెట్టుకున్నారు. టైటిల్ చట్టం వస్తే సాక్షిలో పనిచేసిన వారినే కీలక స్థానాల్లో నియమించేవారు. సివిల్ కోర్టుల ప్రమేయం కూడా తీసేశారు. కాబట్టి ఈ ప్రజాకంటక చట్టాన్ని మేం రద్దుచేశాం.

భూకబ్జా నిరోధక చట్టం తెస్తాం

వైసీపీ నేతలు పంచభూతాలను దోచేశారు. ప్రజల సాగు భూములు, ఇంటి స్థలాలు కబ్జా చేశారు. అక్రమాలకు పాల్పడ్డ ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చేస్తాం. గుజరాత్ తరహాలో ఆంధ్రప్రదేశ్ భూ కబ్జా నిరోధక చట్టం తీసుకొస్తాం. ప్రజల ఆస్తులు, భూములను కాపాడుతాం. భూములు కోల్పోయిన ప్రజలు ధైర్యంగా ముందుకొచ్చి ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయండి. భూముల రీ సర్వే పేరుతో జగన్ ఫొటోలతో పాస్‌పుస్తకాలు, ఆయన పేరుతో సర్వే రాళ్ల ఏర్పాటు పేరిట 653 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ప్రభుత్వ రాజముద్ర లేకుండా జగన్ బొమ్మలు వేశారు. రాళ్లపై కూడా జగన్ బొమ్మలు వేద్దామని అనుకున్నారు. ఎవరన్నా చనిపోయిన తర్వాత రాళ్లపైన బొమ్మలు వేసుకుంటారు. జగన్ బొమ్మల పిచ్చికి వందల కోట్లు ఖర్చుపెట్టారు. ఇది పిచ్చా? మదమా? అహంకారమా?

గనుల్లో 19 వేలకోట్ల దోపిడీ

గత ఐదేళ్లలో గనుల రంగంలోనే రూ.19,137 కోట్ల దోపిడీ జరిగింది. ఐదేళ్ల పాటు ఇసుక తవ్వకాల్లో డాక్యుమెంట్లు లేకుండా చేశారు. మినరల్ రెవెన్యూలో 9,750 కోట్లు ప్రభుత్వానికి నష్టం వచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇసుక ధరలు పెరగడంతో 130 మంది పేదలు పనుల్లేక మరణించారు. దండా నాగేంద్ర అనే వ్యక్తి ఇసుక తవ్వకాలపై కోర్టులో కేసు వేసినందుకు అట్రాసిటీ కేసులు పెట్టి వేధించారు. టీడీపీ పాలనలో గనుల ఆదాయంలో 150 శాతం అభివృద్ధి ఉంటే, జగన్ పాలనలో 7 శాతమే ఉంది. జగన్ పాలనలో అటవీ, మైనింగ్ శాఖలు ఒకే వ్యక్తికి ఇచ్చారు. ఇసుక తవ్వకాలపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది. ఇసుక అక్రమ తవ్వకాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. క్వార్ట్జ్, సిలికా శాండ్ లీజుదారులను బెదిరించి అక్రమాలకు పాల్పడ్డారు. సొంత సిమెంట్ ఫ్యాక్టరీకే లేటరైట్ పంపిణీ చేసుకున్నారు. ప్రకాశం జిల్లాలో 155 క్వారీలపై దాడులు చేశారు. 23 మందిపై 614 కోట్లు ఫైన్ వేశారు. చిత్తూరు జిల్లాలో 248 కోట్లు జరిమానా వేశారు. పెద్దిరెడ్డి మనుషులకు, కావాల్సిన వారికి ఇష్టానుసారంగా లీజులు ఇచ్చారు. కుప్పంలో కూడా గ్రానైట్ దోచారు. ద్రవిడ యూనివర్సిటీలో కూడా అక్రమ తవ్వకాలు చేశారు.

భూముల రీసర్వే నిలిపివేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన భూముల సర్వేను కూడా నిలిపివేస్తామని స్పష్టంగా చెప్పారు. సోమవారం సహజవనరులపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రీ సర్వే రికార్డుల్లో అనేక తప్పులు వచ్చాయని, రైతులకు ఇబ్బందులు కలిగించారని తన ప్రజంటేషన్‌లో ఆయన తెలిపారు. మరి రీ సర్వేను ఇలాగే కొనసాగిస్తారా? అన్న మీడియా ప్రశ్నకు బాబు స్పందిస్తూ...కొనసాగించే ప్రసక్తేలేదని, దానిని నిలిపివేస్తామని తేల్చిచెప్పారు. పాస్ పుస్తకాలు, హద్దురాళ్లపై బొమ్మలేసుకునేందుకు రూ.కోట్లు ఖర్చుపెట్టి సర్వే ప్రక్రియను నాడు తెరపైకి తీసుకొచ్చారని మండిపడ్డారు. రీ సర్వే అనంతరం రూపొందించిన రికార్డుల వల్ల రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని, భూముల సరిహద్దులు, కొలతలు, సర్వే నెంబర్లు, భూమి విస్తీర్ణంలో అడ్డగోలుగా మార్చేశారని ఆయన పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. అవసరాన్ని బట్టి, రైతుల కోరికపై నిర్దిష్టంగా సర్వే కోరితే ఆ మేరకు చేపడుతామని చెప్పారు. జగన్ పేరిట ముద్రించిన పాస్‌పుస్తకాలను ఇప్పటికే రద్దుచేశామనీ, వాటి స్థానంలో కొత్తగా రాజముద్రతో పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు. అయితే, జగన్ పేర్లు, బొమ్మలతో ముద్రించిన సర్వేరాళ్లను ఏం చేయాలో తనకు అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. ఈ రాళ్లకోసం రూ.640 కోట్లు ఖర్చుపెట్టారని చెప్పారు. వైసీపీ చేసిన భూదోపిడీపై ప్రజల్లో చర్చ జరగాలని ఆయన ఆకాంక్షించారు. వైసీపీ భూ దందాలను ప్రజల్లో పెట్టి చర్చిస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే, 'పుంగనూరు మండలంలోని రాగానిపల్లెలో 982 ఎకరాల ఇనామ్ భూమికి నాడు జగన్ హయాంలో అడ్డగోలుగా రైత్వారీ పట్టా మంజూరు చేశారు. ఈ భూమిలో కొంతభాగాన్ని పెద్దిరెడ్డి స్వర్ణలత పేరిట రికార్డులు మార్చారు. ఆ భూమిపై ఏం చర్యలు తీసుకుంటా'రన్న ప్రశ్నకు సీఎం సమాధానమిస్తూ, ఆ రైత్వారీ పట్టాను రద్దుచేయాలని ఆదేశాలిచ్చామని, కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. కాగా, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి బంధువులు కొందరు విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో పెద్దఎత్తున అసైన్డ్ భూములు కొన్నారు. అనధికారిక ఒప్పందాలు చేసుకున్నారు. ఇది కూడా భూ దందా పరిధిలోకి వస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశాన్ని పరిశీలించి విచారణ చేయిస్తామని, తప్పుచేసిన ఏ ఒక్కరినీ వదలబోమని ఆయన హెచ్చరించారు.

ఈ వారంలో మరో మూడు శ్వేతపత్రాలు: సీఎం

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఈ వారంలో మరో మూడు శ్వేతపత్రాలు విడుదల చేయనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. మొత్తం ఏడు అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వరుసలో నాలుగో శ్వేతపత్రాన్ని సోమవారం ఇక్కడ విడుదల చేశారు. గురువారం నుంచి వరుసగా మూడు రోజులు మూడు శ్వేతపత్రాలు విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, మహిళల రక్షణపై గురువారం శ్వేతపత్రం విడుదల చేస్తారు. శుక్రవారం మరో అంశంపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శనివారం విడుదల చేసే శ్వేతపత్రంతో వీటి విడుదల పూర్తి కానుంది. వచ్చే వారం జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనూ వీటిని ప్రవేశపెట్టి చర్చించనున్నారు.

పెద్దిరెడ్డి దోపిడీ చాలా పెద్దది!

- అటవీ, గనుల శాఖల్లో భారీ అవినీతి
- వనరుల దోపిడీకి కొత్త పంథా పెట్టారు
- పోలవరం మట్టిలో 800 కోట్లు దోచేశారు
- జగన్ వనరుల దోపిడీపై చంద్రబాబు ఫైర్

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంతో సహా ఏ ప్రభుత్వాలు చేయని దుర్మార్గాలను జగన్ ప్రభుత్వం చేసిందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. రాష్ట్రంలో సహజ వనరులను వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డు పెట్టుకుని కొల్లగొట్టారని, అవినీతిని శిఖర స్థాయికి తీసుకెళ్లారని నిప్పులు చెరిగారు. సోమవారం సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. "గత ప్రభుత్వాలేవీ గనులు, అటవీ శాఖలను ఒక్కరికే కట్టబెట్టలేదు. వేర్వేరు మంత్రులకు ఇచ్చారు. వేర్వేరు మంత్రులు ఉంటే గనుల కోసం, అడవులను అడ్డగోలుగా వ్యవహరించకుండా ఉంటారని అలా చేసేవారు. జగన్ మొదటిసారి ఈ రెండు శాఖలను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికే అప్పగించారు. ఈ రెండు శాఖలను చేతిలో పెట్టుకున్న పెద్దిరెడ్డి.. అటవీ ప్రాంతంలో అడ్డగోలుగా గనుల తవ్వకాలు జరిపారు. జగన్ ఇలాంటివి చాలా చేశారు. రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడిని తీసుకువచ్చి పౌర సరఫరాల కార్పొరేషన్ ఛైర్మన్ చేశారు. మిల్లర్లు ఏవైనా అక్రమాలు చేస్తే పౌర సరఫరాల కార్పొరేషన్ అడ్డుకోవాలి. ఆ కార్పొరేషన్‌ను మిల్లర్ల సంఘం అధ్యక్షుడి చేతిలో పెడితే ఏమనాలి? రేషన్ బియ్యం పంపిణీ కోసం వ్యాన్లు పెట్టారు. బియ్యం అక్రమ రవాణాకు అవే సాధనాలుగా మారాయి. వాటితోనే రేషన్ బియ్యం స్మగ్లింగ్ జరిగింది. అన్నింటికీ ప్రాథమిక సాక్ష్యాలు సేకరిస్తున్నాం. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. అధికారుల పాత్రను కూడా లోతుగా పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం నడవాలంటే అధికారులు ఉండాలి. అయితే, మితిమీరి తప్పులు చేసిన అధికారులను వదిలిపెట్టం. అదే సమయంలో ప్రభుత్వం పని ఆగకుండా అధికారులతో పని చేయించుకొనే మార్గాలు కూడా చూస్తున్నాం. తన దోపిడీకి జగన్ ప్రభుత్వం కొత్త కొత్త పద్ధతులు అవలంబించింది. బాగా ఆదాయం వచ్చేచోట ఇక్కడి అధికారులను కాకుండా బయటివారిని డిప్యుటేషన్‌పై తెచ్చి నియమించారు. గనుల శాఖ, ఖనిజ సంస్థ, బేవరేజెస్ కార్పొరేషన్, టీటీడీ, ఫైబర్ గ్రిడ్ వంటి చోట బయటి నుంచి వచ్చిన అధికారులను నియమించి అడ్డగోలు దోపిడీ చేశారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. అక్రమ సంపాదన కోసం కాల్వల కట్టల మీద మట్టిని కూడా వదిలిపెట్టకుండా దోచుకొన్నారని తెలిపారు. "పోలవరం కుడి కాల్వ కోసం తవ్విన మట్టిని దాని పక్కనే కట్ట కింద పోశారు. ఆ మట్టి మొత్తం వేల సంఖ్యలో లారీలు పెట్టి తవ్వి అమ్ముకున్నారు. సుమారు రూ.800 కోట్ల మేర మట్టి అమ్మకాలు జరిగాయని అంచనా. కాల్వకు కట్టే లేకుండా మట్టిని తవ్వి అమ్ముకొంటే రేపు ఏదైనా వరద వస్తే కాల్వకు రక్షణ ఏది? మట్టి లేక కాల్వ కట్టలు బలహీనమై గండ్లు పడితే కిందకు నీళ్లు వెళ్లవు. రైతులు నష్టపోతారు. ఎవరు ఎటుపోయినా తమ జేబులు నిండితే చాలన్నట్లుగా వ్యవహరించారు. దీనిలో ఒకరు కాదు.. అనేక మంది పాత్ర ఉంది. ఒకరి పేరు చెబితే మిగిలిన వాళ్లు తప్పించుకొంటారు. ఎవరినీ వదలం. అందరినీ చట్టం ముందుకు తెస్తాం" అని చంద్రబాబు వివరించారు.

నేడు ఢిల్లీకి చంద్రబాబు

రేపు కేంద్ర మంత్రి షాతో భేటీ

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంగళవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లనున్నారు. మంగళవారం ఉదయం తొలుత ఆయన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పాల్గొంటారు. పలు అంశాలపై మంత్రివర్గంతో చర్చిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఢిల్లీకి వెళ్తారు. బుధవారం ఉదయం కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా మరికొందరు కేంద్ర మంత్రులను కలుస్తారు. అదే రోజు రాత్రికి రాష్ట్రానికి తిరిగి వస్తారు.



పురందేశ్వరి, శ్రీనివాసవర్మ, సత్యకుమార్, విష్ణుకుమార్‌రాజులను సత్కరిస్తున్న దృశ్యం

ఎన్‌డీఏ హయాంలో మరిన్ని సంక్షేమ పథకాలు: పురందేశ్వరి

- విశాఖలో బీజేపీ ప్రజాప్రతినిధులకు సత్కారం

విశాఖపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): 'భారతదేశం ప్రపంచంలో 5వ ఆర్థిక శక్తిగా ఉన్నప్పుడే కేంద్రం అనేక సంక్షేమ పథకాలు ఇచ్చింది. ఇప్పుడు 3వ ఆర్థిక శక్తిగా మారిన నేపథ్యంలో మరిన్ని పథకాలు అమలు చేస్తాం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాష్ట్రంలో పార్టీ తరపున ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు స్థానిక సాగరిక ఆడిటోరియంలో సోమవారం రాత్రి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'బీజేపీ నిర్మాణానికి ప్రతి కార్యకర్త పనిచేయాలి. ఏపీలో బీజేపీ గెలిచిన మూడు సీట్లలో రెండు లక్షలకు పైబడి మెజారిటీ వచ్చింది. భావసారూప్యం కలిగిన మూడు పార్టీలు సమన్వయంతో పనిచేయడం వల్ల అద్భుతమైన ఫలితాలు వచ్చాయి' అని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తదితులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఎన్.ఈశ్వరరావు, రాష్ట్ర సంఘటన్ కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథరాజు, రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రైతులకందని భూసార పరీక్షా ఫలితాలు

- సూక్ష్మ పోషకాల ఊసే ఎత్తని జగన్ సర్కార్
- ఆలస్యం కారణంగా ఈఏడు నమూనాల సేకరణ లేనట్లే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 20 భూసార పరీక్షా కేంద్రాలున్నాయి. అయినా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు భూసార పరీక్షా ఫలితాలు అందలేదు. నామమాత్రంగా మట్టి నమూనాలు సేకరణతో అధికారులు సరిపెట్టేశారు. భూసార పరీక్షలు, ఫలితాల కార్డుల పంపిణీ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం ఉన్నా... ఆ దిశగా చర్యలు లేవు. ఏటా ఏప్రిల్, మే నెలల్లో భూసార పరీక్షలు నిర్వహించాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-20లో 2.27 లక్షల నమూనాలు సేకరించగా, 2020-21లో కొవిడ్ సాకుతో నమూనాలు సేకరించలేదు. 2021-22లో అసలు కార్యక్రమానికి కేంద్రం అనుమతివ్వలేదు. 2022-23లో 2.72 లక్షల నమూనాలు సేకరించగా, 2023-24లో 4.5 లక్షల నమూనాల సేకరించాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ సగం కూడా జరగలేదు. పర్యవేక్షణ లోపం, నిధుల కొరతతో ఈ ప్రక్రియ సాగలేదు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర వాటా కింద ఆర్థిక శాఖ నుంచి రూ.18.71 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. 2024-25లో మట్టి నమూనాలు, భూసార పరీక్షలకు తక్షణం రూ.13.50 కోట్లు అవసరమని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ దాదాపు సగానికి వచ్చేసింది. ఇక ఇప్పుడు మట్టి నమూనాల సేకరణ సాధ్యం కాదు. ఇప్పటికే నిర్వహించిన పరీక్షల ఫలితాలను బట్టి రైతులకు సిఫారసులు చేసే అవకాశం ఉంది. రబీ పంటకు తగిన పోషకాలు పెంచుకోవచ్చు. మట్టి నమూనాలు, భూసార పరీక్షలు మళ్లీ వచ్చే సీజన్‌లో చేయాల్సిందే! గతంలో టీడీపీ ప్రభుత్వం రైతులకు ఉచితంగా సూక్ష్మపోషకాలను అందించేది. కానీ వైసీపీ సర్కార్ సూక్ష్మపోషకాల ఊసే ఎత్తలేదు.

సహకారానికి వైసీపీ కాటు

(మొదటి పేజీ తరువాయి)

జరపకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం సొంత పార్టీ నేతలకు జగన్ సర్కార్ పగ్గాలు అప్పగించింది. అవినీతి, అక్రమాలకు తావిచ్చింది. అనేక జిల్లాల్లో వ్యవసాయ, స్వయం ఉపాధి సంఘాల రుణాలు పక్కదారి పట్టాయి. వాటి రికవరీకి చర్యలు చేపట్టాల్సిన అధికారులు పెద్దల ఒత్తిళ్లతో తూతూమంత్రపు విచారణలతో మమ అనిపిస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో పశ్చిమగోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కడప, కృష్ణా, అనంతపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు మరికొన్ని జిల్లాల్లోని పీఏసీఎస్‌లు, డీసీసీబీల్లో బోగస్ పత్రాలతో అక్రమార్కులు భారీగా రుణాలు పొందారు. ఈ కుంభకోణాలపై టీడీపీ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర, రావి వెంకట రమణ వంటి నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేదు. దీంతో రాష్ట్రంలో సహకార సంఘాల్లో రూ.5 వేల కోట్ల కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. దీంతో పలువురు సహకార ఉద్యోగులపై చర్యలు చేపట్టారు. కుంభకోణాలకు అసలు బాధ్యులైన రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు, రాజకీయ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. ఈ మొత్తం వ్యవహారాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకుంటే తేరుకోలేని నష్టం జరుగుతుందన్న భయం సర్వత్రా వ్యాపించింది.

మచ్చుకు కొన్ని ఆరోపణలు

ఇప్పటికి సమకూరిన అధికారిక లెక్కల ప్రకారం రూ.2 వేల కోట్ల కుంభకోణం జరిగినట్లు తెలిసింది. గుంటూరు డీసీసీబీలో పదవి వెలగబెట్టిన ఓ నేత తెనాలి మార్గంలో వేసిన సొంత వెంచర్‌లో ప్లాట్లు తీసుకున్న డీసీసీబీ ఉద్యోగులకు క్విడ్ ప్రో కో తరహాలో పదోన్నతులు ఇచ్చారు. ఇక్కడే అనర్హులకు అప్పనంగా రుణాలిచ్చారు. అయితే బాధ్యులపై చర్యలేవీ లేకుండా అత్యంత జాగ్రత్తగా నివేదికలు రూపొందించారని సమాచారం. రికవరీ చేయడానికి పక్కదారి పట్టిన సొమ్ము ఎక్కడికి పోయిందో కూడా తెలియకపోవడం మరింత విషాదం. గుంటూరు డీసీసీబీ పాలకవర్గం తీరుతో విసిగిపోయిన మహిళా అధికారి రాజీనామాకు సిద్ధపడ్డారంటే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. గుంటూరు పరిధిలోని ప్రత్తిపాడు బ్రాంచ్‌లో రూ.10 కోట్లు, దుగ్గిరాల బ్రాంచ్‌లో రూ.40 లక్షలు, భట్టిప్రోలు బ్రాంచ్‌లో రూ.10 కోట్ల కుంభకోణం చోటు చేసుకున్నాయి. తెనాలి చెంచుపేట నకిలీ బంగారం కుంభకోణంలో కీలకమైన నోడల్ అధికారిపై చర్యలు తీసుకోకపోగా... పదోన్నతి ఇచ్చారని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. అలా ప్రమోషన్లు కొట్టేసిన అక్రమార్కులు చాలామందే ఉన్నారని తెలుస్తోంది. ఏలూరు డీసీసీబీలో స్వయంగా సీఈవోపై ఆరోపణలొచ్చినా చర్యలు లేవు. ఇక్కడ అక్రమాలకు అండగా నిలిచిన ఓ నాయకుడు పార్టీ ఫిరాయించి, మళ్లీ డీసీసీబీ ఛైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. పాలకవర్గంలో కీలక పాత్రధారి బంధువుల పేరుతో ఉన్న రూ.10 కోట్ల అప్పులు వాయిదాలు మీరినా రికవరీ చేయడానికి అధికారులు ముందుకు రావడం లేదు. శ్రీకాకుళం డీసీసీబీలో భూమి విలువ కన్నా రెట్టింపు మొత్తంలో తనఖా రుణాలిచ్చారు. ఇక్కడ ఓ కీలక వ్యక్తి భారీగా వసూళ్లకు పాల్పడి పదోన్నతులు కట్టబెట్టినట్లు తెలిసింది. కాకినాడ డీసీసీబీ పరిధిలోని ప్రత్తిపాడు బ్రాంచ్‌లో భారీ కుంభకోణం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇవన్నీ మచ్చుకు మాత్రమే.

వైసీపీ నేతల నియామకాలు

13 డీసీసీబీల్లో వైసీపీ నేతలు ఇష్టానుసారం కింది స్థాయి పోస్టులను పార్టీ సానుభూతిపరులతో నింపేశారు. వారిని కొనసాగించే అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. సహకార సంఘాలకు సుమారుగా ఏడేళ్లగా ఎన్నికలు లేవు. ఈ ఏడాది చివరిలోగా ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని చెబుతున్నారు.

పీఏసీఎస్‌ల నెత్తిపై గోడౌన్ల భారం

అగ్రి ఇన్‌ఫ్రా పథకం కింద పీఏసీఎస్‌ల ఆధీనంలో గోడౌన్ల నిర్మాణాలకు నాబార్డు రూ.వందల కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధులు సక్రమంగా ఖర్చు అయ్యేలా పర్యవేక్షించాల్సిన వైసీపీ ప్రభుత్వం 'సహకారం'లోని అనుయాయులకే వదిలేసింది. దీంతో స్వలాభాపేక్షతో రైతులకు అనువుకాని చోట... వాగులు, శ్మశనాలు, కొండ ప్రాంతాల్లో గోడౌన్లను నిర్మించి మమ అనిపించారు. దీంతో వీటివల్ల పీఏసీఎస్‌లకు ఆదాయం రాకపోగా, ఆర్థిక భారం ఎక్కువైంది. వీటిని నిర్మించిన వైసీపీకి చెందిన గుత్తేదారులకు మాత్రం జగన్ సర్కార్ సొమ్ము చెల్లించింది. ఇలా నిర్మించిన వాటిలో అక్రమ కట్టడాలు కూడా ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

నష్టాల్లో సొసైటీలు

రాష్ట్రవ్యాప్తంగా 2,042 పీఏసీఎస్ ఉండగా 848 నష్టాల్లో కూరుకుపోయాయి. మొత్తం 65.75 లక్షల మందికి పీఏసీఎస్‌ల్లో సభ్యత్వం ఉంది. ఇందులో 31.38 లక్షల మందికే ఓటు హక్కు ఉంది. ఏటా 17.50 లక్షల మంది రైతులు రుణాలు పొందుతున్నారు. రూ.3,698.07 లక్షల డిపాజిట్లు ఉండగా, రూ.2,136.88 లక్షల షేర్ క్యాపిటల్ ఉంది. రూ.24,008.51 లక్షలు అప్పులు ఉన్నాయి. అడ్వాన్సులు, రుణాల కింద మరో రూ.23,760.59 లక్షలున్నాయి. రూ.6,166.84 లక్షల పెట్టుబడులు ఉండగా, రూ.6,565.32 లక్షల గడువు తీరిన బకాయిలున్నాయి. 2023-24లో సభ్యులకు రూ.22,399.30 లక్షలు రుణాలు రీషెడ్యూల్ చేశారు. ఇందులో కౌలు రైతులకు కేవలం రూ.163.69 లక్షలే ఇచ్చారు. మొత్తంగా 6,547 మంది ఉద్యోగులు పని చేస్తుండగా, 1,999 పీఏసీఎస్‌లు డీసీసీబీల గుర్తింపు పొందాయి. 39 వాణిజ్య బ్యాంకుల కింద ఉన్నాయి. 1,951 పీఏసీఎస్‌లను కేంద్రం కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చింది.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్

బాబును కలిసిన జిందాల్ చైర్మన్

» పెట్టుబడి అవకాశాలపై చర్చ

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఉక్కు ఉత్పత్తుల తయారీలో ఈ గ్రూప్ పేరుమోసింది. సచివాలయానికి వచ్చిన సజ్జన్... సీఎం కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. రాష్ట్రంలో మంచి అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా ప్రతిపాదనలతో వస్తే ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని సజ్జన్‌తో ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంపై ముఖ్యమంత్రి... తర్వాత ఎక్స్‌లో స్పందించారు. 'సజ్జన్ జిందాల్‌తో సమావేశం సంతోషంగా ఉంది. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో జిందాల్ గ్రూప్‌తో కలిసి పనిచేయడానికి మేం ఆసక్తిగా ఉన్నాం. జిందాల్ సంస్థ ముందుకొస్తే రాష్ట్ర ప్రజలకు కొత్త అవకాశాలు వస్తాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

యువతపై కాంబోడియా వల

» ఉద్యోగాల పేరుతో లక్షలు వసూళ్లు
» వెళ్లిన వాళ్లంతా బాండ్‌పై సంతకాలు
» రోజుకు 18 గంటలకుపైగా పని
» 2.40 లక్షలు చెల్లించి మోసపోయాం
» గుంటూరు ఎస్పీకి బాధితులు ఫిర్యాదు

గుంటూరు, జూలై 15: 'డబ్బుల కోసం స్థానిక ఏజెంట్లు ఉద్యోగాల పేరుతో యువతను కాంబోడియా పంపిస్తున్నారు. అక్కడికి వెళ్లిన వారితో సైబర్ నేరాల కంపెనీలు బలవంతంగా పనిచేయిస్తున్నాయి. ఏజెంట్ మాట విని మోసంపోయాం. మా దగ్గర వసూలు చేసిన లక్షలు తిరిగి ఇప్పించండి. అక్కడ చిక్కుకుపోయిన వందలాదిమంది తెలుగు వారిని రక్షించండి' అంటూ ఇద్దరు యువకులు గుంటూరు జిల్లా ఎస్పీకి మొరపెట్టుకున్నారు. సోమవారం వారు చేసిన ఫిర్యాదు ప్రకారం... గుంటూరు జిల్లా తెనాలి కేంద్రంగా సుధాకర్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. తెనాలి చెంచుపేటకు చెందిన సాతా వీర శంకర్రావుకు ఇద్దరు కుమారులు... కోటేశ్వరరావు, నాగరాజు. ఇంటర్ చదివి ఖాళీగా ఉంటున్నారు. తెలిసిన వాళ్లద్వారా శంకర్రావుకు తెనాలికే చెందిన గాజుల సుధాకర్ పరిచయమయ్యాడు. కాంబోడియాలో మీ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ శంకర్రావుకు నమ్మబలికాడు. ఒక్కొక్కరికి రూ.60 వేలు చెల్లిస్తే సరిపోతుందని చెప్పాడు. దీంతో వీర శంకర్రావు, ఏజెంట్ సుధాకర్‌కు రూ.1.20 లక్షలు చెల్లించాడు. విజిటింగ్ వీసాపై శంకర్రావు కుమారులిద్దరినీ గత ఫిబ్రవరి 19న కోల్‌కతా నుంచి కాంబోడియా పంపాడు. అక్కడి ఎయిర్‌పోర్టులో తనిఖీ చేసిన అధికారులు వీరు మోసపోతున్నారని గ్రహించి వారిని నేరుగా ఇండియాకు పంపించేశారు. దీంతో ఏజెంట్ సుధాకర్‌ను వీర శంకర్రావు నిలదీశారు. మరోసారి తన మాయమాటలతో సుధాకర్ వాళ్లను బోల్తా కొట్టించాడు. ఆ తరువాత గత మార్చిలో మళ్లీ రూ.1.20 లక్షలు తీసుకొని బిజినెస్ వీసా తెప్పించాడు. ఈసారి హైదరాబాదు నుంచి వియత్నాం పంపించాడు. అక్కడ నుంచి క్యాబ్ ద్వారా కాంబోడియాకు పంపాడు. అప్పటికే అక్కడ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాదిమందితో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాదిమంది యువకులు ఉన్నారు. కోటేశ్వరరావు, నాగరాజులను చూసిన తెలుగువారు అక్కడ పరిస్థితిని అన్నదమ్ములకు వివరించారు. వారిచ్చే బాండ్లపై సంతకాలు చేయవద్దని చెప్పారు. సంతకాలు చేస్తే పాస్‌పోర్టులు గుంజుకుంటారని, నిర్బంధిస్తారని, ఆ తర్వాత నరకం చూపిస్తారని, తిరిగి ఇంటికి వెళ్లే అవకాశం ఉండదని హెచ్చరించారు.

ఉద్యోగాల పేరుతో సైబర్ నేరాలు చేయిస్తున్నారని చెప్పారు. రోజుకు 18గంటలు పని చేయాలని, యూరినల్స్‌కు నాలుగు నిమిషాల్లోనే వెళ్లి రావాలని, ఆలస్యమైతే జీతంలో డబ్బులు కట్ చేస్తారని చెప్పారు. దీంతో భయపడిన కోటేశ్వరరావు, నాగరాజు సోదరులు వెనక్కి వెళ్లిపోతామని బాండ్లపై సంతకాలు చేయమని అడ్డం తిరిగారు. తెనాలిలోని ఏజెంట్ సుధాకర్‌కి ఫోన్ చేసి వెనక్కు పిలిపించాలని ఒత్తిడి చేశారు. లేదంటే బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని అక్కడి కంపెనీ వారితో పాటు ఏజెంట్ సుధాకర్‌ను కూడా ఫోన్‌లో బెదిరించారు. మరోవైపు వీరశంకర్రావు, సుధాకర్‌ను గట్టిగా నిలదీశారు. దీంతో మరో రూ.1.20 లక్షలు చెల్లిస్తే వెనక్కు పిలిపిస్తానని చెప్పాడు. పిల్లలు రాగానే డబ్బు సెటిల్ చేస్తానని చెప్పడంతో ఎట్టకేలకు ఆ ఇద్దరినీ తిరిగి స్వదేశానికి రప్పించాడు.



గుంటూరు ఎస్పీని ఆశ్రయించిన వీర శంకర్రావు, ఆయన కుమారుడు నాగరాజు

నిర్బంధంలో వందలాది తెలుగువాళ్లు

కాంబోడియాలో వందలాది మంది తెలుగు యువకులు తమలానే వెళ్లి అక్కడి సైబర్ నేరాల కంపెనీలలో ఇరుక్కున్నారని బాధితుడు నాగరాజు వాపోయారు. 'హైదరాబాదులో ఐటీ కంపెనీలు ఏ తరహాలో ఉన్నాయో కాంబోడియాలో సైబర్ క్రైమ్ కంపెనీలు అలా ఉన్నాయి. ముందస్తు ఒప్పందం ప్రకారం గడువు ముగిశాక స్వదేశానికి వెళ్లిపోతామంటే పంపకుండా బెదిరిస్తున్నారు. అక్కడి విషయాలు ఏమాత్రం లీక్ చేసినా చంపేస్తారని యువకులు ఆందోళన చెందుతున్నారు. తెనాలికి చెందిన ఏజెంట్ గాజుల సుధాకర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తే అనేక మోసాలు వెలుగులోకి వస్తాయి. ఎంతోమందికి విముక్తి లభిస్తుంది. మా నుంచి ఉద్యోగాల పేరుతో తీసుకున్న రూ2.40 లక్షలతోపాటు అదనంగా అయిన ఖర్చు మొత్తం ఆయన నుంచి ఇప్పించి మాకు న్యాయం చేయాలి.'

- బాధితుడు నాగరాజు

'ఎడారి' ఆర్తనాదానికి విముక్తి!

» లోకేశ్ చొరవతో అరబ్బు ఎంబసీకి చేరిన శివ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



కువైత్ ఎంబసీ వలంటీరుతో బాధితుడు శివ

అరబ్బు దేశంలో ఎడారిలో చిక్కుకుపోయిన అన్నమయ్య జిల్లావాసికి ఎట్టకేలకు విముక్తి కలిగింది. మండుటెండలో రోజులతరబడి విలవిల్లాడిపోయిన అతడు.. రోదిస్తూ తన గోడును వెల్లబుచ్చుతూ వీడియో పంపించగా, ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించిన విషయం తెలిసిందే!. లోకేశ్ చొరవతో అక్కడి టీడీపీ నేతలు అక్కడ భారతీయ ఎంబసీని సంప్రదించి బాధితుడిని స్వదేశానికి రప్పిస్తున్నారు. అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం చింతపర్తి గ్రామానికి చెందిన అయివేత శివ(36) బతుకుదెరువు కోసం నెల క్రితం కువైత్‌కు వచ్చాడు. ఇరాక్ సరిహద్దులోని ఎడారిలో ఒంటెలు, బాతులు, వాటికి కాపాల కాసే కుక్కలకు నీళ్లు పోసే పనికి అరబ్బు యజమాని వద్ద కుదిరాడు. ఒక వైపు సూర్యప్రతాపం మరోవైపు యాంత్రికంగా పని చేయడంతో శివ అలిసిపోయి తన వల్ల కాదని చేతులెత్తేశాడు. ఎడారిలో తాను ఎదుర్కొంటున్న కష్టాలను వీడియో ద్వారా వివరిస్తూ స్వదేశంలోని బంధుమిత్రులకు, తనను పంపించిన రాయచోటిలోని దళారీకి పంపాడు. సామాజిక మాధ్యమాలలో తన దీనస్థితిని పోస్టు చేయగా అది మంత్రి నారా లోకేశ్ దృష్టికి చేరింది. వెంటనే స్పందించిన ఆయన విదేశాంగ శాఖకు ట్యాగ్ చేయడంతో పాటు కువైత్‌లోని తెలుగుదేశం పార్టీ నాయకులకు సమాచారమందించారు. కువైత్‌లోని పార్టీ అభిమానులు షేక్ బాషా, జాబీర్ బాషా.. శివ ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించి ఇరాక్ సరిహద్దులో ఉన్నట్లు కనుగొన్నారు. ఆయనను తీసుకొచ్చి భారతీయ ఎంబసీలో అధికారులకు అప్పగించారు. ఎంబసీ అధికారుల ఆదేశాలతో సోమవారం కువైతీ యాజమాని.. శివ పాస్ పోర్టును తిరిగి అప్పగించాడు. శివను మంగళ లేదా బుధవారం స్వదేశానికి పంపించడానికి ఎంబసీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఇసుక తవ్వకాలపై గత నివేదికలను పునఃపరిశీలించాలి

» సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై గతంలో అధికారులు ఇచ్చిన నివేదికలను పునఃపరిశీలించాల్సి ఉందని సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం తెలిపింది. పెద్దగా అక్రమాలు జరగలేదని అధికారులు నివేదికలు ఇచ్చారని, అందుకు విరుద్ధంగా మీడియాలో కథనాలు వచ్చాయని వెల్లడించింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ అభయ్ ఎస్ ఒకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీలో ప్రభుత్వం మారిందని, గతంలో అధికారులిచ్చిన సమాచారం మేరకు అఫిడవిట్ దాఖలు చేశామని, కొత్త ప్రభుత్వం వాటన్నింటిని పునఃపరిశీలిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది హుజెఫా అహ్మదీ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఇసుక తవ్వకాలపై గతంలో అధికారులు ఇచ్చిన నివేదికలకు విరుద్ధంగా మీడియాలో కథనాలు వచ్చాయని, రెండింటినీ పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వడానికి మరింత సమయం కావాలని కోరారు. నివేదికతో పాటు ఎటువంటి ఉల్లంఘనలు జరిగాయి? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలుపుతూ సమగ్రంగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 2న చేపడతామని, ఆలోపు సమగ్ర నివేదికలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర పర్యావరణ శాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది.

కేంద్రం ఇచ్చిన నిధులు ఎటు వెళ్లాయో తెలియదు

» ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



విశాఖపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చిందని, అవన్నీ ఏమయ్యాయో లెక్కలు లేవని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆరోపించారు. విశాఖపట్నం వచ్చిన ఆయన పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వచ్చారని, ప్రధాని మోదీతో పాటు తొమ్మిది మంది కేంద్ర మంత్రులను, నీతి ఆయోగ్ చైర్మన్‌ను, 16వ ఆర్థిక సంఘం కమిషన్‌ను కలిశారని తెలిపారు. ఈ ఐదేళ్లలో ఏపీకి ఇచ్చిన నిధులకు వివరాలు ఏమీ సమర్పించలేదని, వాటిని ఎటు మళ్లించారో కూడా తెలియదని ఆయా శాఖల కార్యదర్శులు చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఆ వివరాలు తెలిస్తే తప్ప కేంద్రం మళ్లీ రాష్ట్రానికి నిధులు విడుదల చేసే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని, రాజధాని అభివృద్ధికి కూడా అండదండలు ఉంటాయని పేర్కొన్నారు.

జీపీఎస్ జీవోకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

జీవో ఎలా వచ్చిందన్న అంశంపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా గెజిట్ విడుదల చేయడంపై కూడా విచారణ జరపాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగుల సుదీర్ఘ సమస్యగా ఉన్న సీపీఎస్‌ను తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే రద్దు చేస్తామని 2019 ఎన్నికలకు ముందు జగన్ హామీ ఇచ్చారు. అయితే, తన హయాంలో ఐదేళ్లపాటు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సీపీఎస్ కంటే లోపభూయిష్టమైన జీపీఎస్ విధానాన్ని ఉద్యోగుల నెత్తిన రుద్దారు. సీపీఎస్ రద్దు చేస్తామన్న హామీని అవగాహన లేకుండా ఇచ్చామని, ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యపడదంటూ ఉద్యోగులను దారుణంగా మోసం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు సీపీఎస్ విధానాన్ని సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టంగా చెప్పారు. ఉద్యోగులంతా దీన్ని హర్షించారు. కాగా, జూన్ 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజే ఆర్థిక శాఖ ప్రధాన ఉన్నతాధికారి పేరుతో 2023, అక్టోబరు 20 నుంచి జీపీఎస్ అమలు ఉత్తర్వులు వెలువడడంతో ఉద్యోగులు ఆందోళన పడ్డారు. ఏ శాఖ ఉన్నతాధికారైనా పాత ప్రభుత్వ హయాంలో ఏదైనా నిర్ణయం తీసుకుని సదరు నిర్ణయంపై ఎన్నికల నోటిఫికేషన్ లోపు ఉత్తర్వులు జారీ కాకపోతే కొత్తగా వచ్చిన ప్రభుత్వ అనుమతితో మాత్రమే ఉత్తర్వులు ఇవ్వాలనే నిబంధనలున్నాయి. అయినప్పటికీ, జూన్ 12న పాత ప్రభుత్వ విధానంతో జీవో ఇవ్వడం, ఈ నెల 12న దాన్ని గెజిట్ ప్రచురించడం చూస్తే ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు సందేహాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఈ జీపీఎస్ జీవోల గుట్టు తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. శాఖా పరమైన విచారణకు ఆదేశించింది. కాగా, చంద్రబాబు సర్కారు జీపీఎస్ జీవోను నిలిపివేయడంపై ఉద్యోగసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. జూలై 16, 17 తేదీల్లో అన్ని జిల్లాల్లో నిర్వహించాలనుకున్న నిరసన కార్యక్రమాలను వాయిదా వేశాయి.

జగన్.. చలో బెంగళూరు

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ బెంగళూరు వెళ్లారు. వాస్తవానికి సోమవారం ప్రజలతో, పార్టీ నేతలతో ముఖాముఖి నిర్వహిస్తానని ఆయన చెప్పారు. అయితే దానిని వాయిదావేసుకుని ఆదివారమే బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌కు చేరుకున్నారు. ఈ నెలాఖరులో జరిగే అసెంబ్లీ సమావేశాల నాటికి వస్తానని, అప్పుడు కలుస్తానని పార్టీ ముఖ్య నేతలకు చెప్పినట్లు తెలిసింది. గత నెల 24న కూడా ఆయన సతీసమేతంగా బెంగళూరు వెళ్లారు. ఈ నెల 2న తిరిగి తాడేపల్లి ప్యాలెస్ చేరుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయం, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడం ఆయన్ను తీవ్ర నిరాశానిస్పృహలకు గురిచేసిందని.. ఓటమి బాధ నుంచి బయటపడలేకపోతున్నారని వైసీపీ వర్గాలే అంటున్నాయి. సేద తీరేందుకు యలహంక వెళ్లారని చెబుతున్నాయి.

న్యూ అండ్ రెన్యువబుల్ ఎండీ రమణారెడ్డిపై విజిలెన్స్ విచారణ?

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ ఎండీ రమణారెడ్డి తీసుకున్న నిర్ణయాలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు సిద్ధమైంది. సీఎంవో నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటుకు ఇంధన శాఖ లేఖ రాయనుంది. 2019 జూన్ 21 నుంచి 2024 ఫిబ్రవరి 26వ తేదీ వరకు న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ ఎండీగా రమణారెడ్డి బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో పంప్డ్ స్టోరేజీ, సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీటిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని నిర్ణయించారు. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఈ సమాచారం చేరవేశారు. తక్షణమే విచారణ కోరాలని విజయానంద్‌కు రవికుమార్ స్పష్టం చేశారు.

ఇన్‌కాప్ ఎండీ నీలకంఠారెడ్డి తొలగింపు

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఇన్‌కాప్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటీ (ఏపీఐఏ) ఇన్‌చార్జి సీఈవో పదవుల నుంచి కె.నీలకంఠారెడ్డిని ప్రభుత్వం తొలగించింది. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఇన్‌కాప్ ఎండీగా, ఏపీఐఏ సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. నీలకంఠారెడ్డికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రామాయపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్‌పీడీసీఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఎం.ఎల్.నరసింహారావును పంచాయతీరాజ్ శాఖకు పంపించింది.

ఇక పశు బీమా పథకం అమలు

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి పశువులు, జీవాలు మరణిస్తే.. పెంపకందార్లు నష్టపోకుండా, ఇక నుంచి 'పశు బీమా పథకం' అమలు చేస్తామని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ చెప్పారు. అతి తక్కువ ప్రీమియంతో అర్హత కలిగిన పశుపోషకులకు దీన్ని వర్తింపజేస్తామని సోమవారం ఆయన వెల్లడించారు.

అప్పిలేట్ అథారిటీని ఆశ్రయిస్తారా?

» ఉత్తర్వుల నుంచి తప్పించుకుంటారా?
» ఇది విచారణ ప్రక్రియ దుర్వినియోగమే
» విజయవాడ రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ తీరుపై ఆక్షేపణ
» రూ.లక్ష ఖర్చులు విధించిన హైకోర్టు



అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ చెల్లింపు వ్యవహారంలో విజయవాడకు చెందిన రెడ్డి ఎంటర్ ప్రైజెస్ సంస్థ యాజమాన్యంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేశారని పేర్కొంటూ ఆ కంపెనీకి రూ.లక్ష ఖర్చులు విధించింది. ఈ సొమ్మును 15 రోజుల్లోగా ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి జమ చేయాలని స్పష్టం చేసింది. ఆ గడువులోగా చెల్లించకుంటే సొమ్మును రాబట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. జీఎస్టీ కింద రూ.56.95 కోట్లు చెల్లించాలని పేర్కొంటూ రెడ్డి సంస్థకు అధికారులు నోటీసులు ఇచ్చారు. వీటిని సవాల్ చేస్తూ ఆ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. చట్టనిబంధల ప్రకారం అప్పీల్ వేసుకొనేందుకు అవకాశం ఉన్నా నేరుగా హైకోర్టులో రిట్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ తిల్హరి నేతృత్వంలోని ధర్మాసనం అసెస్‌మెంట్ ఆర్డర్‌ను రద్దు చేసింది. పిటిషనర్ వాదనలు పరిగణనలోకి తీసుకుని తాజాగా ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. అయితే, రూ.56.95 కోట్లలో 50% సొమ్మును అధికారుల వద్ద జమ చేయాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులను సవాల్ చేస్తూ కంపెనీ యాజమాన్యం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొనేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇప్పటికే రూ.30 కోట్లు చెల్లించామని చెబుతున్న నేపథ్యంలో 50శాతం సొమ్ము జమ విషయంలో స్పష్టత కోరుతూ హైకోర్టును ఆశ్రయించాలని యాజమాన్యానికి సూచించింది. మరోవైపు 50శాతం సొమ్ము జమ విషయంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో కంపెనీ యాజమాన్యం జీఎస్టీ అధికారులు ఇచ్చిన అసెస్‌మెంట్ ఆర్డర్‌ను అప్పిలేట్ అథారిటీ వద్ద సవాల్ చేసింది. అయితే నిర్ణీత గడువులోగా అప్పీల్ దాఖలు చేయలేదని పేర్కొంటూ ఉన్నతాధికారులు దానిని తిరస్కరించారు. దీనిపై కంపెనీ యాజమాన్యం తిరిగి హైకోర్టును ఆశ్రయించింది. అసెస్‌మెంట్ ఆర్డర్‌ను సవాల్ చేస్తూ హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించిన కారణంగా నిర్ణీత గడువులోగా అప్పీల్ దాఖలు చేయలేకపోయామని వివరించింది. ఈ వాదనను హైకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. కంపెనీ యాజమాన్యం తీరును తీవ్రంగా ఆక్షేపించింది. రూ.56.95 కోట్లలో 50శాతం సొమ్మును జమ చేయాలని తామిచ్చిన ఉత్తర్వులు నుంచి తప్పించుకునేందుకే కంపెనీ యాజమాన్యం అప్పీల్ దాఖలు చేసిందని, ఇది కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పేర్కొంటూ రూ.లక్ష ఖర్చులు విధించింది.

సాయిరెడ్డి నోటిదురుసు

» జర్నలిస్టులపై తిట్ల పురాణం
» వాడు, వీడు అంటూ అసభ్యకర భాష
» ఆరోపణలు చేసింది అధికారిణి భర్త
» కానీ, జర్నలిస్టులపై చెలరేగిన సాయిరెడ్డి



విశాఖలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి. పక్కన జూపూడి ప్రభాకరరావు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మరోసారి నోరు పారేసుకున్నారు. వాడు, వీడు అంటూ మీడియా సంస్థల ప్రతినిధులపై దిగజారుడు భాషను ఉపయోగించారు. సస్పెన్షన్‌లో ఉన్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతికి, ఆమె భర్తకు మధ్య కొంతకాలంగా వివాదం చెలరేగుతోంది. దీనిపై ఆమె భర్త అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై ఇటు చానళ్లలోనూ, అటు సోషల్ మీడియాలోనూ వార్తలు వచ్చాయి. శాంతి తన వాదనను ఇప్పటికే మీడియా ముందు ఉంచారు. అయితే, సాయిరెడ్డి దానికి భిన్నంగా మీడియాపై నోరు పారేసుకున్నారు. ఆమె భర్త.. సాయిరెడ్డి పేరు ప్రస్తావన తెచ్చినందున, దానికి సమాధానం చెప్పుకోవాలి. లేదంటే ఆమె భర్తపై ప్రతి విమర్శ చేయవచ్చు. కానీ, సోమవారం విశాఖలో పత్రికా సమావేశం పెట్టి, మీడియా సంస్థలను, చానళ్లను, జర్నలిస్టులను సాయిరెడ్డి ఆడిపోసుకున్నారు. వారిపై అభ్యంతరకర భాష వాడుతూ తిట్లు లంఘించుకున్నారు. తన వయస్సునూ, పెద్దల సభలో సభ్యుడిని అనేది కూడా మరిచిపోయి జర్నలిస్టులు, మీడియా సంస్థల యజమానులపై విరుచుకుపడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం. పైగా, ఆ సంఘటనకు సంబంధించి మీడియా ప్రతినిధులు అడిగిన ఏ ప్రశ్నకూ ఆయన సరైన సమాధానం చెప్పలేదు. తన సత్తా ఏమిటో మీడియా సంస్థలకు, చానళ్లకు, జర్నలిస్టులకు చూపిస్తానంటూ చెలరేగిపోయారు. "తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి కొన్ని టీవీ చానళ్లు నా వ్యక్తిత్వాన్ని హననం చేశాయి. లేనిపోనివి ప్రసారం చేశాయి. సంబంధిత చానళ్ల యజమానులు, యాంకర్లపై పరువు నష్టం కేసులు వేసి, అంతుచూస్తాను" అని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రివిలేజ్ మోషన్ పెడతానని, ప్రెస్ కౌన్సిల్‌కి, ఎడిటర్స్ గిల్డ్‌కి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. శాంతి ఆదిమజాతికి చెందిన మహిళ అని, ఆమెతో ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయిస్తానన్నారు. 'శాంతి భర్త మదన్‌మోహన్‌తో మీకు ఎలాంటి పరిచయం ఉంది' అని విలేకరులు ప్రశ్నించగా, ఆయన ఎవరో తనకు తెలియదని ముందు అన్నారు. ఆ తర్వాత.. ఏదో పని మీద ఒకటి, రెండుసార్లు తన వద్దకు వచ్చాడని, అంతకు వి ంచి వారితో తనకు సంబంధాలు లేవన్నారు.

చానల్ పెట్టి తడాఖా చూపిస్తా

గతంలో రామోజీరావుతో విభేదాలు వచ్చినప్పుడు పత్రిక, చానల్ పెట్టాలని అనుకున్నానని, పార్టీ అధ్యక్షుడు వద్దని వారించారని, కానీ ఇప్పుడు కచ్చితంగా చానల్ పెట్టి తీరుతానని, ఏకపక్షంగా వార్తలు ప్రసారం చేసేవారి తాట తీస్తానని విజయసాయిరెడ్డి హెచ్చరించారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అండ చూసుకొని ఎవరైతే తోక జాడిస్తున్నారో వారందరి తోకలు ఐదేళ్ల తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చాక కత్తిరిస్తానన్నారు. మధ్యంతర ఎన్నికలు వస్తే ఇంకా ముందుగానే ఆ పని జరుగుతుందని పేర్కొన్నారు.

జగన్ 'రివర్స్' చెల్లదు!

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిన రూ.1,771 కోట్ల విలువైన హెడ్ వర్క్స్ పనులకు.. రూ.4,987.55 కోట్ల పోలవరం జల విద్యుత్కేంద్రం నిర్మాణానికి రివర్స్ టెండరింగ్ విధానంలో జల వనరుల శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. వాస్తవానికి పోలవరం సాగునీటి ప్రాజెక్టు పనులకు మాత్రమే ఆ శాఖ టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలి. హైడల్ ప్రాజెక్టుకు ఏపీ జెన్కో టెండర్లు పిలవాలి. కానీ రెండింటికీ జల వనరుల శాఖే ఏకపక్షంగా టెండర్లను పిలిచేసింది. దీనిపై అప్పట్లోనే జెన్కో అభ్యంతరం వ్యక్తం చేసింది. జగన్ సర్కారు లెక్కచేయలేదు. 1,771 కోట్ల విలువైన పోలవరం ప్రాజెక్టు పనులను రూ.1,548.12 కోట్లకు (231 కోట్లు తక్కువ), జలవిద్యుత్కేంద్రం పనులను రూ.4,987.55 కోట్లకు గాను రూ.4,359.12 కోట్లకు (628.43 కోట్లు తక్కువ) చేస్తానంటూ మేఘా ఇంజనీరింగ్ సంస్థ బిడ్ దాఖలు చేసింది. పోలవరం ప్రాజెక్టు పనులకు మేఘా ఒక్కటే బిడ్ వేసింది. రివర్స్ టెండర్ మార్గదర్శకాల ప్రకారం రెండు కంటే ఎక్కువ సంస్థలు వేయాలి. ఒక్క సంస్థే వేస్తే టెండర్లను రద్దు చేసి.. మళ్లీ కొత్తగా పిలవాలి. కానీ పనులు ఎవరికి ఇవ్వాలో ముందే ఖరారు చేసిన జగన్.. మేఘాకు కట్టబెట్టేశారు. ఇంధన శాఖ సూచనలను ఏమాత్రం ఖాతరు చేయలేదు. 2019 నవంబరు 11న మేఘాకు రెండు పనులూ అధికారికంగా అప్పగించేశారు. రివర్స్ టెండర్ విధానం అమలుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నాటి సీఎం జగన్ ఉత్తుత్తి సమీక్ష చేశారు. రివర్స్ టెండర్ విధానంపై సంవత్సరం తర్వాత తీరిగ్గా 2020 ఆగస్టు 25న సమగ్ర మార్గదర్శకాలను ఖరారు చేస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ఈలోగా పోలవరం ప్రాజెక్టు, జల విద్యుత్కేంద్రాల టెండర్లను ఖరారుచేయడమే గాక పనులూ అప్పగించేశారు. రివర్స్ టెండర్ అనేది విధాన నిర్ణయమైనందున మంత్రివర్గంలో చర్చించి ఆమోదముద్ర వేయాలి. అలాంటిదేమీ లేకుండా ఆర్థిక శాఖ ఆమోదం మాత్రమే తీసుకుని చేసే విధాన నిర్ణయాలు చెల్లవని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కేబినెట్ సమ్మతి పొందని రివర్స్ టెండర్ విధానం చెల్లదని.. జల వనరుల శాఖ జీవో 67, పురపాలక శాఖ జీవో 272, ఆర్థిక శాఖ జారీ చేసిన సమగ్ర మార్గదర్శకాల జీవో 79 చట్టప్రకారం చెల్లుబాటు కావని స్పష్టం చేస్తున్నారు. సింగిల్ టెండర్ చెల్లదని ఇంధన శాఖ మొత్తుకున్నా వినిపించుకోకుండా.. నాటి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ టెండర్లను ఆమోదించి.. మేఘాకు పనులు కట్టబెట్టేశారు. కాగా.. పనులు చేపట్టిన ఆ సంస్థ రెండేళ్లలో పూర్తిచేస్తామని ఒప్పందం కుదుర్చుకుంది. 2021 ఆఖరుకు గడువు ముగిసినా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ఒప్పందం ప్రకారం పనులు చేయని సంస్థపై ప్రభుత్వం ఎలాంటి చర్యలూ లేవు. రూ.1,548.12 కోట్లకు చేస్తామన్న పనులకు మేఘాకు ఇప్పటికే రూ.4,637.09 కోట్లు చెల్లించేశారు. అటు శరవేగంగా జరుగుతున్న పనులను ఒక్కసారిగా ఆపివేయడం, 2019, 20ల్లో గోదావరికి వరుస వరదలు, జగన్ నిర్వాకం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతినడం.. గైడ్‌బండ్ కుంగిపోవడం.. ఎగువ దిగువ కాఫర్ డ్యాంలలో సీపేజీ వంటి నష్టాలు సంభవించాయి. డయాఫ్రం వాల్ కొత్తగా నిర్మించడం.. దానిపై ఈసీఆర్ఎఫ్ డ్యాం వేయడం.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలకు మరమ్మతులకు ఎంతలేదన్నా రూ.1,780 కోట్లు అవుతుందని అంటున్నారు.

అక్రెడిటేషన్, హెల్త్‌కార్డు, బీమా సమస్యలపై.. హిమాన్షు శుక్లాతో వర్కింగ్ జర్నలిస్టుల భేటీ

» 15అంశాలతో విజ్ఞాపన ఇచ్చిన ఏపీడబ్ల్యూజే నేతలు



సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లాతో మాట్లాడుతున్న ఏపీడబ్ల్యూజే నాయకులు

విజయవాడ (భవానీపురం), జూలై 15: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లాతో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర నా యకులు సోమవారం సమా వేశమయ్యారు. 15 అంశా లతో వినతిపత్రాన్ని ఆయనకు అంది ంచారు. ఆ అంశాలపై వారిని అడిగి ఆయన వివరాలు తెలు సుకున్నారు. అందరికీ అక్రెడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ప్రమాద బీమా వంటి సమస్యలపై దృష్టి సారించాలని నాయకులు కోరారు. అరగంటసేపు అన్ని అంశాలపై వివరమైన చర్చ సాగింది. ఈ భేటీలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డీ సోమసుందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చావా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, విజయవాడ అర్బన్ శాఖ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

వక్ఫ్‌బోర్డులో అవినీతిపై విచారణ జరిపించాలి

● అంజేమన్ హిఫాజతే ఔకాఫ్

ధర్నాచౌక్: గత వైసీపీ ప్రభుత్వం సుమారు రూ. 10వేల కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని అంజేమన్ హిఫాజతే ఔకాఫ్ రాష్ట్ర సమితి నేతలు ఆరోపించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా వక్ఫ్‌బోర్డులో చేసిన అవినీతిపై విచారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సంస్థ ఆవిర్భావం సందర్భంగా గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా షబ్బర్ బాషా వీర్ సయ్యద్‌షా షబ్బీర్ ఆలం ఖాద్రీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మయన మహమ్మద్ ఎన్నియ్యారు. వక్ఫ్‌బోర్డు సంస్థల భూములను పరిరక్షించడం, అవినీతి అధికారులు, పాలనపై పోరాడుతామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. ముస్లిం కబురస్థాన్‌ల భూములను కాపాడేందుకు తమ సంస్థ పని చేస్తుందన్నారు. జీవో 18ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కార్యవర్గ సభ్యులు షైక్ ఆరిఫ్, సీఎస్ సాధిక్, సయ్యద్ మహబూబ్ బాషా, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

చెస్ ఫిడే రేటింగ్‌లో హర్షిత్‌సాయి సత్తా

విజయవాడ స్పోర్ట్సు: నగరంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ పోటీల్లో కానూరు నారాయణ ఇంగ్లీష్ మీడి యం స్కూల్లో 7వ తరగతి చదువుతున్న ఉప్పలపాటి హర్షిత్ సాయి 103 రేటింగ్ పాయింట్లతో అద్భుతమైన ప్రదర్శన చేసి సత్తా చాటాడని స్కూల్ ప్రిన్సిపాల్ వి. మురళీకృష్ణ, ఏజీఎం మురళీ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ బి.దుర్గాప్రసాద్ వర్మ తెలిపారు. ఈ నెల 18, 19న నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌కు సహకారం అందిస్తామన్నారు. స్కూల్ ఆవరణలో సోమవారం జరిగిన అభినందన సభలో వారు మాట్లాడుతూ హర్షిత్‌సాయి కేరళకు చెందిన అనూషజిత్, పశ్చిమబెంగాల్‌కు చెందిన రిద్ధిమాన్‌దాస్, ఏపీకి చెందిన శ్రీహజీపై విజయం సాధించాడన్నారు.

ప్రజల వద్దకే పాలన!

నియోజకవర్గంలోనే ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఏర్పాటుతో వినూత్న ప్రయోగం!

● కలెక్టర్‌తో కలిసి నిర్వహించిన ఎమ్మెల్యే యార్లగడ్డ ● దాదాపు 5వేల మందికిపైగా తరలివచ్చిన అర్జీదారులు ● కిటకిటలాడిన ప్రాంగణం.. ● వారంలో ఏటీఆర్ ఇస్తానన్న ఎమ్మెల్యే

విజయవాడ-ఆంధ్రజ్యోతి/గన్నవరం: ప్రత్యర్థులపై దాడులు.. విద్వేషాన్ని రగిల్చే మాటలు... ఎన్నికల ముందు వరకు కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలో ఉన్న ముఖచిత్రం. అలాంటి నియోజకవర్గంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సరికొత్త సంస్కృతికి తెరదీశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికను నియోజకవర్గంలో ఏర్పాటు చేశారు. గన్నవరం మండలంలోని చిన అవుటపల్లి ఎస్ఎం కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికను కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటల వరకు ఏకబిగిన సాగింది. అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. సుమారు 5 వేల మంది తమ సమస్యలను ప్రజాప్రతినిధికి.. అధికారులకు ఏకరవు పెట్టుకున్నారు. సమస్యలపై దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ వారం రోజుల్లో యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఏటీఆర్) అందిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారమే ప్రధానం



విశేషంగా వచ్చిన అర్జీదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

తొలుత కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకొని వస్తుంటారని, వారికి ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్‌తో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిష్కరిస్తారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా.. మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు.

లోకేశ్ చేతుల మీదుగా..

మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేల్యాండ్ కంపెనీని ఆగస్టులో మంత్రి లోకేశ్ చేతుల మీదుగా పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి కంపెనీలు పెట్టేందుకు 30మంది పారిశ్రామికవేత్తలు సంప్రదింపులు జరిపారన్నారు. కంపెనీల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎయిర్‌పోర్టు ఎదురుగా మరో ఎంఎన్‌సీ కంపెనీ రానుందన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడికి అక్నాలెడ్జ్‌మెంట్ ఇస్తామని, వారం తర్వాత అధికారుల నుంచి యాక్షన్ టేకెన్ రిపోర్టు ఫిర్యాదుదారుకు అందజేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు మూల్పూరు బాలకృష్ణారావు, దాసరి బాలవర్ధనరావు, ఆర్డీవో పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.



ప్రజలు అందించిన అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రజల నుంచి విశేష స్పందన

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. భూదందాలు, ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్ల సంబంధిత అర్జీలు అధికసంఖ్యలో వచ్చాయి.

విజయవాడ మధురానగర్‌కు చెందిన సుంకర సీతామహలక్ష్మికి గన్నవరంలో సర్వే నంబర్ 477-2లో 484 చదరపు గజాల స్థలం ఉంది. 2004లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ స్థలాన్ని 2022లో సూరపనేని అనిల్ కుమార్, వైసీపీ నేత మేచినేని బాబు మేనల్లుడు ఎస్‌వీఆర్ కృష్ణ అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రోద్బలంతో ఆక్రమించుకున్నట్టు చెప్పారు. అప్పటి మండల రెవెన్యూ అధికారులు సిహెచ్.నరసింహారావు, పవన్‌కుమార్, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు సహకరించారని దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.

గన్నవరం మండలంలోని సూరంపల్లికి చెందిన గొట్టిపూళ్ల రఘునాథ్‌కు చెందిన సర్వే నెంబర్ 366లో 5.77 ఎకరాలను 2019లో అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, అతడి అనుచరులు కొమ్మా కోట్లు, సీహెచ్ రవీంద్రబాబు, ఎన్కే ప్రసాద్, పి.గోపిరాజు, కె.నాగభూషణం తనను బెదిరించి, కుటుంబసభ్యులను చంపుతామని భయపెట్టి రూపాయి ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు అర్జీ సమర్పించారు.

కేసరపల్లికి చెందిన మూల్పూరు మాధవన్ తన పొలం, ఇంటి స్థలానికి సంబంధించి ఎలాంటి కోర్టు కేసులు లేకపోయినా ఉన్నట్టు దొంగ పత్రాలు సృష్టించి తన ఆస్తులను రిజిస్ట్రార్ కార్యాలయంలో బ్లాక్ చేయించారని, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం దొరకలేదని అర్జీలో పేర్కొన్నారు.

మహిళలను లైంగికంగా వేధించే

యూట్యూబర్లను కఠినంగా శిక్షించాలి

● తరుణీ తరంగాలు అధ్యక్షురాలు రావి శారద

పటమట, జూలై 15: ఇటీవల విశృంఖలంగా మహిళలు, విద్యార్థినులు, చిన్నారులు సైతం లైంగిక వేధింపులకు గురౌవుతున్నారని, అశ్లీల వ్యాఖ్యలతో సోషల్ మీడియా యూట్యూబర్లు చేస్తున్న ఈ వికృత క్రీడలను నిరోధించడానికి మహిళలను జాగృతి పరచాల్సిన అవసరం ఉందని తరుణీ తరంగాలు అధ్యక్షురాలు డాక్టర్ రావి శారద అభిప్రాయపడ్డారు. సోమవారం సర్వోత్తమ గ్రంథాలయంలో మహిళలపై యూట్యూబర్ల వికృత చేష్టలపై జరిగిన మహిళల రౌండ్‌టేబుల్ సమావేశంలో మహిళలు, విద్యార్థినులు, రచయితలు, సమాజ సేవకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సంస్థ కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ దేశ,రాష్ట్రస్థాయిల్లో ఇటీవల మహిళలపై యూట్యూబ్‌లో వండి వారుస్తున్న ఈ విషసంస్కృతికి బలవుతున్న వారి విషయాలను పరిశీలిస్తే, వారి జీవితాలు హృదయం విదారకరంగా ఉంటున్నాయన్నారు. వీటిని సంఘటితంగా ఎదుర్కొందామన్నారు. లక్ష సంతకాలతో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తేవాలని ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయించింది. తరుణీ తరంగాల సభ్యులు స్వరూపరాణి, ఉషారాణి, ఏ సుమబిందు, రాజేశ్వరీ, పుష్పావతి, వసుంధర, విద్యార్థినులు కె.ఆశ, మహాలక్ష్మి, రజనీ పాల్గొన్నారు.

టీటీలో లాస్య, సుహాస్‌కు కాంస్యాలు

విజయవాడ స్పోర్ట్సు, జూలై 15: రాజమహేంద్రవరంలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగిన ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్‌పోటీల్లో డీఎస్ఏ కోచ్ ఎస్కే ముంతాజ్ బేగం వద్ద శిక్షణ పొందుతున్న పి.శ్రీకర లాస్య అండర్-11లో కాంస్యం, జే సుహాస్ బాబు అండర్-13 విభాగంలో కాంస్యం వశం చేసుకున్నారు. డీఎస్ఏ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో డీఎస్‌డీవో ఎస్ఏ. అజీజ్ పతకాలను సాధించిన ఇద్దర్ని అభినందించారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో జిల్లాకు పతకాలను సాధించిపెట్టాలని ఆకాంక్షించారు.

ఈనెల 18, 19న వీఆర్ సిద్ధార్థలో అంతర్జాతీయ సమావేశం

పెనమలూరు, జూలై 15: గ్రీన్ అండ్ సస్టెయినబుల్ టెక్నాలజీ కోసం కంప్యూటేషనల్ ఇంటెలిజెన్సుపై ఈనెల 18,19న వీఆర్ సిద్ధార్థ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో అంతర్జాతీయ సమావేశాలు జరుగుతాయని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశపు బ్రోచర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐఈఈఈ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఇస్రో డైరెక్టర్ ఏ రాజరాజన్ హాజరవుతారని, కళాశాల ఈఈఈ, ఈసీఈ, ఈఐఈ విభాగాలు సహకరిస్తాయన్నారు. ఆస్ట్రేలియా, మలేషియా, చైనా, ఐఎస్ఐ కోల్‌కతా, ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ హైదరాబాద్ లాంటి అగ్ర గ్లోబల్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువు చేస్తే యావదాస్తి ఇచ్చేస్తా

● ఏపీ ఒలింపిక్ సంఘం సెక్రటరీ కేపీ రావు

విజయవాడ స్పోర్ట్సు, జూలై 15: ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం ప్రక్షాళనను తాను స్వాగతిస్తున్నానని, స్పోర్ట్సు కోడ్ అమలుతోనే ఇది అమలు కావాలని తాను పోరాటం చేస్తున్నానని, ఏపీవోఏ నిధులు రూ.18 లక్షలు వాడేసుకున్నానని, నాపై అసత్య ఆరోపణలు చేసిన నామిశెట్టి వెంకట్, (జూడో), యలమంచిలి శ్రీకాంత్ (కబడ్డీ), ఆకుల రాఘవేంద్రరావు (అథ్లెటిక్స్ మాజీ సెక్రటరీ) రుజువు చేస్తే నా యావదాస్తి ఒలింపిక్ సంఘానికి రాసిచ్చేస్తానని ఏపీవోఏ రాష్ట్ర కార్యదర్శి కేపీ.రావు సవాల్ విసిరారు. ఒకవేళ ఈ ముగ్గురు రుజువుచేయకపోతే తమ ఆస్తులను రాసిచ్చేయాలని డిమాండ్ చేశారు. ఐజీఎంసీ స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేపీ రావు మాట్లాడుతూ 22 క్రీడాసంఘాల మద్దతుందని వారు చెప్పింది వాస్తవం కాదని, తాను ఏపీవోఏ సొమ్ము రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని ఖండించారు. 2015 నుంచి ఏపీవోఏ ఖాతాలో రూ.18లక్షల్లో రూ.12 లక్షలు ఏపీ విభజన చట్టం ప్రకారం ఉమ్మడిఖాతాలో జమచేయబడ్డాయని, చట్టప్రకారం రూ.6.75లక్షలు తెలంగాణ ఒలింపిక్ సంఘం తీసుకుందన్నారు. స్పోర్ట్సు కోడ్ ప్రకారం ఈ ముగ్గురు ఒలింపిక్ సంఘ ఎన్నికల్లో పాల్గొనే అర్హత లేదన్నారు. మీ వద్ద ఉన్న ప్రూఫ్‌లు, రికార్డులతో క్రీడారంగ ప్రముఖుల మధ్య బహిరంగ చర్చకు రావాలని, టీవీ లైవ్ ఖర్చులను తానే భరిస్తానన్నారు. ఆరోపణలు రుజువు చేయకపోతే క్షమాపణలు చెప్పి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అసత్య ప్రేలాపనలు పేలితే సహించేది లేదని తనపై చేసిన ఆరోపణలు రుజువు చేయకపోతే పరువునష్టం దావా వేస్తానని కేపీ రావు హెచ్చరించారు.

దేవస్థానం షాపుల స్వాధీనం

వన్‌టౌన్, జూలై 15: స్థానిక పాతశివాలయం ప్రాంగణంలోని విఘ్నేశ్వర, రమాసహిత సత్యన్నారాయణ స్వామి దేవస్థానానికి చెందిన గవర్నరుపేటలోని పెద్దిభొట్లవారివీధిలోని షాపులను ఎట్టకేలకు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయమే ఎండోమెంట్ జిల్లా ఇన్‌చార్జి ఏసీ సీతారావమ్మ, ఈవో కే సురేష్‌బాబు, సిబ్బంది వెళ్లి షాపులను స్వాధీనం చేసుకున్నారు. షాపుల నిర్వాహకులు స్వచ్ఛందంగా షాపులు అప్పగించినట్టు లేఖలిచ్చారు. గతంలో ఈవోగా ఒక మహిళ అధికారిణి దేవస్థానం నిర్ణయించిన అద్దెలకంటే అధికంగా వసూలు చేసి అవకతవకలకు పాల్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయి. దేవదాయ కమిషనర్ ఆదేశాలతో అధికారిణిపై విచారణ జరిపి అవినీతి జరిగిందని నిర్ధారించారు. అధికారులు షాపులను ఖాళీ చేయించేందుకు హై కోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో అద్దెదారులు స్వచ్ఛందంగా లేఖలిచ్చి ఖైదొలగారు. ఇక్కడ ఒక లాడ్జి, 8 షాపులున్నాయి. ముందస్తుగా సీఐ దుర్గారావు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవదాయశాఖ విజయవాడ ఇన్‌స్పెక్టర్ అనురాధ, నందిగామ ఇన్‌స్పెక్టర్ ఫణి, ఈవోలు దుర్గాప్రసాద్, సీతారామయ్య, లోకేశ్వరి, మోహనరావు పాల్గొన్నారు.



షాపులను స్వాధీనం చేసుకుంటున్న ఎండోమెంట్ జిల్లా ఇన్‌చార్జి ఏసీ సీతారావమ్మ, దేవస్థానం ఈవో సురేష్‌బాబు

ఐదేళ్ల వైసీపీ పాలనలో

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

పోలవరం విధ్వంసం



సభలో ప్రసంగిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వన్‌టౌన్, జూలై 15: వైసీపీ ఐదేళ్ల పాలనలో పోలవరం విధ్వంసమైందని, వారి నిర్లక్ష్యం వల్లే డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక దుర్గాఘాట్ పక్కనున్న కేఎల్ రావు ఘాట్‌లో నిర్వహించిన దివంగత డాక్టర్ కానూరి లక్ష్మణరావు (కేఎల్ రావు) 122వ జయంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత కేఎల్ రావు చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పద్మభూషణ్ కేఎల్ రావు తెలుగు జాతి గర్వించదగిన ప్రఖ్యాత ఇంజనీర్ అని అన్నారు. 50ఏళ్ల క్రితమే ఆయన నదుల అనుసంధానానికి నుడికారం చుట్టిన దార్శనికుడని కొనియాడారు. వైసీపీ పాలనలో ఆయన విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయలేదన్నారు. నీటి పారుదల రంగానికి విశిష్టసేవలందించిన సర్ ఆర్థర్‌కాటన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, శ్రీరామకృష్ణయ్య, డాక్టర్ కేఎల్ రావు జయంతులను ఏటా క్రమం తప్పకుండా ప్రభుత్వం తరఫున నిర్వహిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కొత్త ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. సీఎం తన తొలి పర్యటన పోలవరంతోనే ప్రారంభించారన్నారు. నిత్యం సమీక్షలు చేస్తున్నామన్నారు. 2019లో ప్రభుత్వం మారకుంటే పోలవరం నిర్మాణం పూర్తయ్యేదన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. నీటి పారుదల శాఖ మాజీ ఇంజనీర్లు ఆర్ సతీష్‌కుమార్, టీఎస్ఎస్ శ్రీనివాస్ యాదవ్, ఎంవీ కృష్ణారావు, మారుతి ప్రసాద్‌ను సత్కరించారు. నీటి పారుదల సలహాదారు ఎం వెంకటేశ్వరరావు, ఇంజనీర్ చీఫ్ అడ్మిన్ కే శ్రీనివాస్, హైడ్రాలజీ సీఈ కుమార్, మైనర్ సీఈ సాయిరామ్ ప్రసాద్, ఎస్ఈ టీజేహెచ్ ప్రసాదబాబు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎస్ తిరుమలరావు, అపెక్స్ కమిటీ మాజీ చైర్మన్ ఏ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



కేఎల్ రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రామానాయుడు

డాక్టర్ కేఎల్ రావుకు ఘన నివాళి

గవర్నర్‌పేట: భారతదేశం గర్వించదగ్గ గొప్ప ఇంజనీర్ డాక్టర్ కేఎల్ రావు అని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు అన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవన్ వద్ద మాజీ ఎంపీ, మాజీ మంత్రి డాక్టర్ కేఎల్ రావు 122వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతు సంఘాల నేతలు కేఎల్ రావు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ, శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ఇలా ఎన్నో ప్రాజెక్టులు, మద్రాసు నగరంలో బ్రిడ్జిని వాడుకలోకి తేవడంలో కేఎల్ రావు ప్రతిభను చూసి దేశం యావత్తు ఆశ్చర్య పోయిందన్నారు. ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్లు యనమద్ది పుల్లయ్య, గుత్తా శివరామకృష్ణ, మైనేని మురళీకృష్ణ, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్లు నాదెళ్ల చెన్నకేశవరావు, గుండపనేని శ్రీనివాసరావు, రైతు సంఘం నేతలు కనకపూడి వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ నిపుణులు డి.రమేష్‌కుమార్, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవన్ వద్ద డాక్టర్ కేఎల్ రావుకు నివాళులు అర్పిస్తున్న సాగునీటి సంఘాల నేతలు

ముగిసిన వారాహి నవరాత్రి పూజలు



వారాహి పూజ ముగింపు సందర్భంగా కలశంలోని నీటిని దేవతా మూర్తులపై సంప్రోక్షించేందుకు తీసుకెళుతున్న అర్చకుడు యజ్ఞనారాయణ, ఈవో రామారావు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ

వన్‌టౌన్, జూలై 15: దేవస్థానంలోని రుద్రహోమం యాగశాలలో ఈనెల 6 నుంచి ప్రారంభమైన వారాహి నవరాత్రి పూజలు సోమవారంతో ముగిశాయి. దీనికి సంబంధించి యాగశాలలో మంగళ వాయిద్యాలు వేద మంత్రాలు నడుమ జరిగిన పూర్ణాహుతిలో ఈవో రామారావు దంపతులు, స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాదశర్మ దంపతులు పాల్గొన్నారు. పూర్ణాహుతికి ముందు ప్రత్యేక అర్చనలు చేసి కలశ ఉద్వాసన చేశారు. అనంతరం ఆశీస్సులు అందచేశారు. వారాహి నవరాత్ర ఉత్సవ ప్రత్యేకతలను గురించి స్థానాచార్యుడు వివరించారు. యజ్ఞనారాయణ, శ్రీనివాసశాస్త్రి పురాణపండిట్ వెంకటేశ్వరరావు పూజాదికాలను గురించి వివరించారు. అనంతరం ఈవో దంపతులు అర్చక సత్కారం చేసి దక్షిణ తాంబూలాలను అందజేశారు.

19, 20న పద్మాకర్ ప్రవచనం

కనకాదుర్గాదేవి మహిమలపై ఈనెల 19, 20న వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనాన్ని దేవస్థానం ఏర్పాటు చేసింది. సంబంధిత ఆహ్వాన పత్రికలను ఈవో రామారావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. తొలుత తన చాంబర్‌లో తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 2 రోజుల పాటు 19, 20న సాయంత్రం 6గంటల నుంచి జరగనున్న ప్రవచన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు, భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు

అమ్మవారికి 1030 బృందాల సారె

కనకదుర్గమ్మకు దేవస్థానం కేశఖండనశాల సిబ్బంది, క్షురకులు సోమవారం సారె సమర్పించారు. మొత్తం 150 మంది సిబ్బంది, క్షురకులు భక్తిప్రపత్తులతో సారె సమర్పణ చేశారు. ఈవో రామారావు ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా సారె సమర్పించి అమ్మవారిని వేడుకున్నారు. అలాగే విజయవాడ శ్రీకరి సేవా సమితి బృందం 150మంది, వాసవీ క్లబ్ ఆదర్శ మహిళా సంఘం 100 మంది, నూజివీడు నుంచి దుర్గా బృందం 35 మంది, గుంటూరు నుంచి బాలాజీ సేవాబృందం 50 మంది, సాయి నందం బృందం 60 మంది, ఉండవల్లి సెంటర్ టీ లక్ష్మి బృందం 50 మంది, మారుతి లలితా మండలి బృందం 40 మంది, శ్రీరామ భక్త బృందం 35 మంది, సింగ్‌నగర్ కే మల్లికార్జునరావు బృందం 45 మంది, రామకృష్ణ కోలాట సంఘం 30 మంది, గుడివాడ నుంచి మురళీకృష్ణ కోలాట బృందం 45 మందితో పాటు ఆయా ప్రాంతాలకు చెందిన 1030మందితో కూడిన 23 బృందాలు సారె సమర్పించాయి. అలాగే ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం సోమవారం ఆషాఢ సారె సమర్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కమిటీల అధ్యక్ష కార్యదర్శులు వారి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని దుర్గమ్మను కోరుతూ తామంతా ఒకేసారి సారె సమర్పించామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస చక్రవర్తి పాల్గొన్నారు.

వానలోనూ సారెతో..

జోరువాన పడుతున్నప్పటికీ మహిళలు పెద్దసంఖ్యలో కనకదుర్గమ్మకు సారె సమర్పించేందుకు దుర్గగుడికి తరలి వచ్చారు. తలలపై అమ్మవారికి సమర్పించనున్న చీరలు, ఇతరత్రా పండ్లు, పూలు, పసుపు, కుంకుమ, గంధం ఇతర పరిమళ ద్రవ్యాలున్న పళ్లాలు పెట్టుకుని అమ్మవారికి సారె సమర్పించారు. చిన్నపాటి చినుకులతో మొదలైన వాన ఒక్కసారిగా జోరు పెరగడంతో మహిళలు ఇబ్బందులకు గురయ్యారు. వానకు తడవకుండా సమీప మండపం షెడ్ల కిందకు చేరిపోయారు. కొందరు దుర్గానామం చెబుతూ కూర్చుండిపోయారు.



మంత్రి రామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న పద్మజాబాల, వీర్లంకయ్య

రాష్ట్ర కబడ్డీ సంఘం ఎన్నికపై దర్యాప్తు చేయించండి

● క్రీడామంత్రి రాంప్రసాద్‌కు సభ్యుల వినతి

విజయవాడ స్పోర్ట్సు, జూలై 15: అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఢిల్లీ హైకోర్టు ఆదేశాలకనుగుణంగా సవరించిన రాజ్యాంగ నియమాలకు వ్యతిరేకంగా జరిగిన ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఎన్నికపై సమగ్ర దర్యాప్తు చేయించాలని ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పి.పద్మజాబాల, నేతలు వీర్లంకయ్య మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. 115/2010 ఏపీ కబడ్డీ సంఘంగా తమకు గుర్తింపు ఉందని, 2019లో అసోసియేషన్ ఎన్నిక జరగ్గా, 13 రోజుల వ్యవధిలోనే వ్యవస్థలను మేనేజ్ చేసి, కోర్టులను తప్పుదారి పట్టించి వెంకటరెడ్డి, శ్రీకాంత్ అనే వ్యక్తులు అధ్యక్ష,కార్యదర్శులుగా కొనసాగుతున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరారు. రాష్ట్రంలో కబడ్డీ క్రీడాకారులకు తీరని అన్యాయం జరుగుతోందని, అన్ని విధాలా నష్టపోతున్నారని వివరించారు. శాప్ నుంచి వివరాలను సేకరించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టు పద్మజాబాల తెలిపారు.



ఎమ్మెల్యే సుజనాతో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఫ్లై ఓవర్‌పై లారీలను అనుమతించండి

● ఎమ్మెల్యే సుజనాను కలిసి లారీ ఓనర్స్

ఆటోనగర్, జూలై 15: ది కృష్ణా జిల్లా లారీ ఓనర్సు అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరిని కానూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం ఆయనకు రవాణా రంగ సమస్యలను విన్నవించారు. కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదుగా లారీలను అనుమతించాలని అభ్యర్థించగా అధికారులతో మాట్లాడతానని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, ఏపీ లారీ ఓనర్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, కోశాధికారి నాదెళ్ల కృష్ణ, ఏహెచ్‌వీ సురేష్ ఉన్నారు.



పొట్టిపాడు టోల్‌ప్లాజాను ప్రారంభిస్తున్న మంత్రి సారథి, ఎమ్మెల్యే బోడె

ప్రొటోకాల్ రగడ!

టోల్‌ప్లాజా ప్రారంభోత్సవంలో మంత్రి సారథి, ఎమ్మెల్యే బోడె

స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డకు అందని ఆహ్వానం

విజయవాడ-ఆంధ్రజ్యోతి: కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పొట్టిపాడు టోల్ ప్లాజా ప్రారంభోత్సవం ప్రొటోకాల్ వివాదానికి తెరదీసింది. నియోజకవర్గంలోని ఉంగుటూరు మండలంలో ఉన్న పొట్టిపాడు టోల్‌ప్లాజాను సోమవారం మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కలిసి ప్రారంభించారు. గతంలో టోల్‌ప్లాజా నిర్వహణ కాంట్రాక్టర్‌గా ఉన్న సంస్థ గడువు ముగియడంతో చబ్రాస్ అసోసియేట్స్ అనే సంస్థ నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. ఈ నేపథ్యంలో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను తీసుకొచ్చి టోల్‌ప్లాజా వద్ద తమ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభింపజేశారు. దీనికి నేషనల్ హైవే అధికారులు కూడా పాల్గొన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును ఆహ్వానించకపోవడం స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తల్లో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేను ఆహ్వానించాల్సి ఉన్నా ఇలా నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఉపేంద్ర బాబుకు ఘన నివాళి

కాసరనేనివారి పాలెం (కంకిపాడు): ఆంధ్రజ్యోతి మాజీ డిప్యూటీ ఎడిటర్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు పూర్వ అధ్యక్షుడు గా రపాటి ఉపేంద్ర బాబు దశదినకర్మ మండలంలోని కాసరనేనివారి పాలెంలోని ఆయన నివాసంలో సోమవారం జరిగింది. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐ వీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, సీనియర్ సంపాదకుడు కే రామచంద్రమూర్తి, స్పాట్ న్యూస్ పూర్వ డైరెక్టర్ రామప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు కంచల జయరాజ్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కె. బాబు, సీనియర్ ఫొటో జర్నలిస్టు డి.సీతారామ్, సాంబశివరావు పాల్గొని ఉపేంద్రబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు.



ఉపేంద్రబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సోమసుందర్, జయరాజ్, ఐవీ సుబ్బారావు, చందు జనార్ధన్, ఎస్కే బాబు



సింగపూర్ తెలుగుదేశం విభాగం ఆధ్వర్యంలో 101వ ఎన్టీఆర్ జయంతి వేడుకలు

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

▸▸ సింగపూర్‌లో ప్రవాసాంధ్రులకు టీడీపీ ఎమ్మెల్యేల పిలుపు

పొన్నూరు టౌన్/అమరావతి, జూలై15 (ఆంధ్రజ్యోతి): ఏపీ పునర్నిర్మాణంలో సీఎం చంద్రబాబు సారధ్యంలో రాష్ట్ర ప్రజలతో పాటు ఎన్నారైలంతా భాగస్వామ్యం కావాలని టీడీపీ ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. సింగపూర్ టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సింగపూర్‌లో స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యేలు గోరంట బుచ్చయ్యచౌదరి, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కొలికపూడి శ్రీనివాసరావు హాజయ్యారు. ఈ సందర్భంగా బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి స్వర్గీయ ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. నరేంద్రకుమార్ మాట్లాడుతూ పేదలకు కూడు, గూడు, నీడతో దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేశారన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయాలను పరిచయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని చెప్పారు.

ఓటర్ రామకృష్ణకు టీడీపీ నేతల నివాళి

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల వెరిఫికేషన్‌లో కీలకంగా వ్యవహరించే అన్నే రామకృష్ణ మరణం పార్టీకి తీరని లోటని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన రామకృష్ణ మృతికి సంతాప సూచకంగా సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు నివాళులర్పించారు. ఓటర్ రామకృష్ణ పార్టీకి చేసిన సేవలను నేతలు కొనియాడారు.

27న సీఎస్‌ల సదస్సు

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న 4వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశం, ఆ తదుపరి 9వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీ నుంచి ఆయన వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశం ఎప్పుడు, ఎక్కడ నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు. ఈ సమావేశాల నిర్వహణకు సంబంధించి ఇప్పటి నుంచే సన్నాహక ఏర్పాట్లను ప్రారంభించాల్సి ఉంటుందని తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశం (వికసిత భారత్‌గా) తీర్చిదిద్దాలన్న లక్ష్యాల్లో భాగంగా ఈ సమావేశాలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. గత డిసెంబరులో జరిగిన 3వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికను వెంటనే సమర్పించాలని సీఎస్‌లను ఆదేశించారు. అనంతరం ఈ రెండు సమావేశాలకు సంబంధించిన పలు ప్రాధాన్య అంశాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సీఎస్‌లతో చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఈవోగా వివేక్ యాదవ్ బాధ్యతల స్వీకరణ

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా వివేక్ యాదవ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు సోమవారం ఆయన అమరావతి సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో తనకు కేటాయించిన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.

తాగునీటి అవసరాలకే నీళ్లు

▸▸ సాగర్ నుంచి ఏపీకి 4.5 టీఎంసీలు, తెలంగాణకు 5.5 టీఎంసీలు

▸▸ కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాల నిర్ణయం

హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు లేనందున ఎగువ ప్రాంతాల నుంచి జలాలు వచ్చే దాకా తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని రెండు తెలుగు రాష్ట్రాలు నిర్ణయించాయి. సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ(బోర్డు మెంబర్ సెక్రటరీ డీఎం రాయిపూరే, తెలంగాణ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డిల) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాలువ నుంచి ఏపీకి 4.5 టీఎంసీలు, ఎడమ కాలువ నుంచి తెలంగాణకు 5.5 టీఎంసీల నీటిను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈనెల 17వ తేదీ నుంచి ఈ మేరకు నీటిని విడుదల చేయనున్నారు. ఇక సాగర్‌లో తగినన్ని నీటినిల్వలు లేనందు వల్ల శ్రీశైలం నుంచి 6 టీఎంసీల నీటిని(రెండు రాష్ట్రాలకు చెరో 3 టీఎంసీల చొప్పున) జలవిద్యుత్ అవసరాలకు వినియోగించాలని నిర్ణయించారు.

కొత్తగా 100 రకాల విత్తనాలు.. సాంకేతిక పద్ధతులు!

▸▸ వంద రోజుల్లో అందుబాటులోకి.. కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, 15: దేశంలో సాగును మరింత సుదృఢం చేసేందుకుగాను 100 కొత్త రకాల విత్తనాలను, సాగు పరంగా మరో వంద సాంకేతిక పద్ధతులను అందుబాటులోకి తెచ్చేందుకు భారత వ్యవసాయ పరిశోధక సంస్థ (ఐసీఏఆర్) సంకల్పించింది. ఇందుకు వంద రోజుల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయశాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. కాగా ఈ వర్షాకాలం సాగయ్యే మొత్తం వరి విస్తీర్ణంలో 25 శాతం మేర సాగును వాతావరణ మార్పులను తట్టుకొని నిలిచే విత్తనాలతో కవర్ చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితులు పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

జీతాలివ్వండి.. ప్లీజ్!

▸▸ విద్యాశాఖ ఉద్యోగుల విన్నపం

▸▸ జూనియర్ లెక్చరర్లకు కాంట్రాక్టు రెన్యువల్ సమస్య

▸▸ సమగ్రశిక్ష ఉద్యోగులకు బడ్జెట్ కొరత

▸▸ రెండు నెలలుగా అందని జీతాలు

▸▸ వైసీపీ సర్కారు నిర్వాకంతో సమస్య

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉద్యోగులను వేతనాల సమస్య వేధిస్తోంది. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రెండు నెలలుగా జీతాల్లేక తిప్పలు పడుతున్నారు. దాదాపు పాతిక వేల మంది ఉద్యోగులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 3,618 మంది కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. వారికి ఏప్రిల్ 30తో కాంట్రాక్టు గడువు ముగిసింది. ఆ వెంటనే వారి కాంట్రాక్టు రెన్యువల్ కావాల్సి ఉండగా అప్పట్లో అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల కోడ్ పేరుతో చాలా రోజులు రెన్యువల్‌కు ఫైలు పెట్టలేదు. దీంతో కాంట్రాక్టు పునరుద్ధరణ కాకుండానే వారు కాలేజీల్లో కొనసాగుతున్నారు. ఆ తర్వాత రెన్యువల్‌కు ఫైలు పెట్టినా అది ఆర్థిక శాఖ దగ్గర ఆగిపోయింది. అధికారులు కూడా దీనిపై దృష్టి పెట్టకపోవడంతో రెండు నెలలుగా జీతాల్లేకుండానే జూనియర్ లెక్చరర్లు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు దాదాపుగా కాంట్రాక్టు జేఎల్స్‌పైనే ఆధారపడి కొనసాగుతున్నాయి. రెగ్యులర్ జేఎల్స్ వెయ్యి మంది కూడా లేరు. వారితో పోలిస్తే మూడు రెట్లు కాంట్రాక్టు జేఎల్స్ ఉన్నారు. దీంతో జూనియర్ కాలేజీలకు వారి అవసరం ఎక్కువగా ఉంది. ఇది తెలిసినా అధికారులు పట్టించుకోవట్లేదని జేఎల్స్ ఆరోపిస్తున్నారు. మరోవైపు పాఠశాల విద్యాశాఖ పరిధిలోని సమగ్రశిక్ష ఉద్యోగులకు 2 నెలలుగా జీతాలు అందలేదు. వీరిలో కేజీబీవీ టీచర్లు, సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతరత్రా ఉద్యోగులు 20వేల మందికి పైగా ఉన్నారు. గత రెండేళ్లుగా ప్రతినెలా కాకుండా రెండు, మూడు నెలలకోసారి జీతాలు ఇస్తున్నారు. బడ్జెట్ లేదనే కారణంతో ఇలా ఆలస్యం చేస్తూ వచ్చారు. ఆ విధానం కొత్త ప్రభుత్వంలోనూ ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. రెండు నెలలు గడిచిపోయి.. మూడో నెలలో సగం రోజులు వెళ్లినా ఇప్పటికీ జీతాలు ఇవ్వకపోతే ఎలాగని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులను కలిసినా బడ్జెట్ లేదనే సమాధానం వస్తోందని అంటున్నారు. కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి వీలైనంత త్వరగా జీతాలు అందేలా చూడాలని కాంట్రాక్టు జేఎల్స్, సమగ్రశిక్ష ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా తూట్లు..!

రాజధాని పరిధిలోని పట్టణాల సమగ్రాభివృద్ధి కోసం..
గత టీడీపీ ప్రభుత్వంలో 27 జోనల్ ప్లాన్లకు రూపకల్పన

▸▸ అమలుకాని సీఆర్‌డీఏ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లు

▸▸ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజధాని అమరావతి విధ్వంసం

▸▸ ప్లాన్లకు విరుద్ధంగా అక్రమ వెంచర్లు, కట్టడాలకు అనుమతులు

▸▸ సీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగం ప్రక్షాళన అవసరం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

రాజధాని ప్రాంత పరిధిలోని పట్టణాలను ఓ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు వీలుగా గత టీడీపీ ప్రభుత్వం సీఆర్‌డీఏ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లకు శ్రీకారం చుట్టింది. అయితే ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాజధానిని విధ్వంసం చేసింది. రాజధాని ప్రాంత పరిధిలో ఈ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లను ఉల్లంఘించింది. వైసీపీ హయాంలో అనధికార లే అవుట్లు, అక్రమ కట్టడాలు కుప్పలు తెప్పలుగా పుట్టుకొచ్చాయి. సీఆర్‌డీఏలోని ప్లానింగ్ విభాగం అధికారులు వైసీపీ పెద్దలతో అంటకాగి.. అనధికార కట్టడాలకు అనుమతులివ్వడమే దీనికి కారణం. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. రాజధాని అభివృద్ధిపై దృష్టిపెట్టిన నేపథ్యంలో.. సీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగంలో అక్రమాలపైనా సీరియస్‌గా దృష్టి సారించి విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. సీఆర్‌డీఏలో ప్రధానమైనది ప్రణాళికా విభాగం. సీఆర్‌డీఏ పరిధిలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన అనేక పట్టణ ప్రాంతాలున్నాయి. దీంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 27 జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లను రూపొందించారు. వాటి ప్రకారం నిర్మాణ రంగానికి ఊతమివ్వాల్సిన ప్రాంతాలు ఏమిటి..? వ్యవసాయాన్ని పరిరక్షించాల్సిన ప్రాంతాలు ఏమిటి..? పారిశ్రామికంగా ప్రాధాన్యతనివ్వాల్సిన ప్రాంతాలేమిటి..? మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రాంతాలేమిటి..? భవన నిర్మాణ రంగానికి ఊతమివ్వాల్సిన ప్రాంతాలేమిటి..? ఇలా అనేక ప్రాధాన్యతలతో ప్లాన్లను రూపొందించారు. అమరావతి రాజధాని ఏ విధంగా ఒక ప్లానింగ్ ప్రకారం ఉంటుందో.. దాని పరిధిలోని పట్టణాలను కూడా అలాగే అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ ప్లాన్లకు రూపకల్పన చేశారు. కాబట్టి ఈ ప్లాన్లు అమలులో ఉన్న ప్రాంతాల్లో నిర్మాణ రంగాన్ని క్రమపద్ధతిలో విస్తరించాలి.

ఎడాపెడా లే అవుట్లు.. అక్రమ కట్టడాలు..

విజయవాడ, గుంటూరు, అమరావతి, గన్నవరం, మైలవరం, గొల్లపూడి, కొండపల్లి, కంకిపాడు, తుళ్లూరు, పెదవడ్లపూడి, పేరేచర్ల, శేకూరు, తాడేపల్లి, తాడికొండ, తెనాలి, వేజెండ్ల, చేబ్రోలు, దుగ్గిరాల, కోవెరం, కేతనకొండ, నంబూరు, కానూరు, నిడమానూరు, నున్నలను అమరావతి రాజధాని ప్రాంత పరిధిలోని పట్టణాలుగా గుర్తించి వాటిని నిర్మాణాత్మకంగా విస్తరించేందుకు ప్లాన్లను రూపొందించారు. అయితే వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్లానింగ్ విభాగం అవినీతిమయమైంది. ఫలితంగా ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, నున్న, కృష్ణా జిల్లాలో గన్నవరం, కానూరు, కంకిపాడు, గుంటూరు జిల్లాలో తాడేపల్లి, అమరావతి ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. సీఆర్‌డీఏ ప్లానింగ్ అధికారులు, పంచాయతీ అధికారులు సిండికేట్ అయ్యి.. కొంత భూమి తమకు ఇచ్చేలా రియల్టర్లతో ఒప్పందాలు చేసుకుని అనధికార లే అవుట్లకు అనుమతులిచ్చేశారు. దీంతో వందలాది మంది సీఆర్‌డీఏ అప్రూవల్ లేని ఈ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేశారు. వారి భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. మైలవరం, గన్నవరం ప్రాంతాలు ర్యాపిడ్ డెవలప్‌మెంట్ ఏరియాలో ఉండటంతో ప్లానింగ్ విభాగానికి పండగగా మారింది. ఈ రెండు ప్రాంతాల్లో భారీగా అక్రమ కట్టడాలు వెలిశాయి. గన్నవరంలో ఎన్‌హెచ్-16, మైలవరంలో ఎన్‌హెచ్-30, కంకిపాడులో ఎన్‌హెచ్-65 వెంబడే కనీస నిబంధనలు పాటించకుండా అక్రమ సౌధాలు నిర్మిస్తున్నా సీఆర్‌డీఏ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోలేదు. పత్రికలలో కథనాలు వస్తే.. జ్యుడీషియల్ కేసు నమోదు చేశామంటున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. భవన యజమానుల దగ్గర అందినకాడికి లంచాలు తీసుకుని వదిలేస్తున్నారు. అమరావతిలో కూడా ఇలాగే అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చేశారు. తాడికొండ అడ్డరోడ్డులో, పరిమి, పెద మద్దలూరులో కుప్పలు తెప్పలుగా అనధికార వెంచర్ల, అక్రమ కట్టడాలు వెలిశాయి. రాజధాని అమరావతిలో ఎకరం రూ.5 కోట్లు ఉంటే.. పరిమిలో ఎకరం రూ.6 కోట్లు పలుకుతోంది. ఈ ప్రాంతంలో జోనల్ ప్లాన్లకు విరుద్ధంగా అనధికారిక కట్టడాలు, వెంచర్లకు అనుమతులివ్వడంతో విపరీతమైన హైప్ వచ్చేసింది. ఈ పరిణామాలు భవిష్యత్తులో ఆయా ప్రాంతాల సమగ్రాభివృద్ధిని దెబ్బతీస్తాయి. ఈ నేపథ్యంలో ప్లానింగ్ విభాగం ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.



విశాఖ స్టీల్‌ప్లాంటు డైరెక్టర్ పనితీరుపై అసంతృప్తి

▸▸ 19న స్టీల్ సెక్రటరీ ఆధ్వర్యంలో సమీక్ష

విశాఖపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో మరో చిత్రమైన సంఘటన చోటుచేసుకుంది. ప్లాంటులో డైరెక్టర్లుగా ఎవరైనా నియమితులైతే కనీసం రెండేళ్లు వారిని కొనసాగిస్తున్నారు. అంత కాలం పనిచేయడానికి అర్హత ఉన్నవారినే ఎంపిక చేసి నియమిస్తారు. ఆ విధంగానే సురేశ్ చంద్ర పాండేని 13 నెలల క్రితం పర్సనల్ డైరెక్టర్‌గా నియమించారు. ఆయనకు ఇంకా 11 నెలల పదవీ కాలం ఉంది. కానీ, ఈలోగానే ఆయన పనితీరును సమీక్షించి, నివేదిక ఇవ్వాలని కేంద్ర ఉక్కు శాఖ ఇక్కడి అధికారులను కోరింది. గత నెలలో రెండుసార్లు దీనికి సంబంధించి నోటీసులు కూడా పంపింది. ఆయన పనితీరును సమీక్షించి, కొనసాగించాలా? వద్దా? అనే విషయం స్పష్టం చేయాలని సీఎండీ అతుల్‌భట్‌ను కోరింది. తాజాగా మరో నోటీసు ఇచ్చింది. ఈ నెల 19న స్టీల్ సెక్రటరీ, సీఎండీ అతుల్ భట్ ఇద్దరూ కలిసి ఆయన్ను ఇంటర్వ్యూ చేయాలని, పనితీరు అంచనా వేయాలని, ఆ నివేదికను ఢిల్లీలోని బోర్డుకు పంపాలని కోరింది. అనంతరం పాండేను ఉంచాలా? వెనక్కి పంపాలా? అనే దానిపై నిర్ణయం తీసుకుంటామని ఉక్కు మంత్రిత్వ శాఖ లేఖలో స్పష్టం చేసింది. కాగా, పర్సనల్ డైరెక్టర్ సురేశ్ చంద్ర పాండే బోర్డు అంచనాల మేరకు పనిచేయడం లేదని సమాచారం. స్టీల్‌ప్లాంటులో ఉద్యోగుల సంఖ్య తగ్గించడం, వారితో వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయించడం, స్టీల్ ప్లాంటు పరిరక్షణ కోసం వారితో విరాళాలు ఇప్పించడం, ఇంకా ఉద్యోగుల సర్వీసు విషయాల్లో సరిగ్గా స్పందించకపోవడం వంటివి ఆయనపై వస్తున్న ఆరోపణలని సమాచారం. అదేవిధంగా కార్మికులు, ఉద్యోగులు ఆయన కార్యాలయానికి వచ్చి ఏమడిగినా సరైన రీతిలో స్పందించకుండా కాలయాపన చేయడం, నిర్ణయాలు త్వరగా తీసుకోకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని గుర్తించారు. ఈ కారణంతోనే ఆయన పనితీరుపై సమీక్ష చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

మనీశ్ సిసోడియా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూలై 15: మద్యం కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని సీబీఐ, ఈడీ కోర్టు జూలై 22 వరకు పొడిగించింది. మనీశ్ సిసోడియాకు గతంలో కోర్టు విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు సోమవారం ముగియడంతో పోలీసులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన్ను సీబీఐ, ఈడీ కోర్టు ప్రత్యేక జడ్జి ముందు హాజరు పరిచారు. విచారించిన జడ్జి ఆయన జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 22 వరకు పొడిగించారు.

వైసీపీ నిర్లక్ష్యం.. రూ.786 కోట్లపై డైలమా!

▸▸ మరుగున పడిన ఏఐఐబీ నిధులు

▸▸ జూన్ 30తో ముగిసిన ప్రాజెక్టు గడువు

▸▸ ఇప్పుడు ఆ నిధుల వినియోగానికి లేఖ.. ఒక నెల గడువు పెంపు

▸▸ ప్రాజెక్టును నిలుపుకోవడానికి తర్జనభర్జన

రాజమహేంద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నిధులున్నా గత వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయింది. ప్రజలకు సురక్షితమైన నీటిని అందించలేకపోయింది. 2019కి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏపీ అర్బన్ వాటర్ సప్లయి అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ అండ్ సాఫ్ట్ కాంపోనెంట్స్ పేరుతో శాంక్షన్ చేయించిన రూ.వేల కోట్ల నిధులు గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మరుగునపడిపోయాయి!. 2019కి ముందు తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో వాటర్ సప్లయ్, ఎస్‌టీపీ నిర్మాణం, అభివృద్ధికి సుమారు రూ.5350 కోట్లతో ప్రతిపాదనలు చేసింది. నిధులు ఇవ్వడానికి ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ముందుకొచ్చింది. ఈ మేరకు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఏలేశ్వరం, గొల్లప్రోలు, ముమ్మిడివరం, నిడదవోలు, కొవ్వూరు, జంగారెడ్డిగూడెం, తణుకు, పాలకొల్లు మునిసిపాలిటీలకు గోదావరి నీటిని సరఫరా చేయడానికి రూ.786 కోట్లతో ప్లాన్ సిద్ధం చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ నిధులను పట్టించుకోలేదు. ఈ పనులను గత జూన్ 30వ తేదీలోపు పూర్తి చేయవలసి ఉంది. వైసీపీ పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు జూన్ 30తో ముగిసిపోయింది. ప్రస్తుతం మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు దీనిపై దృష్టిపెట్టారు. ఆ నిధులు వినియోగించుకోవడానికి అధికారులు ఈ ఏడాది డిసెంబరు వరకూ గడువు కోరగా కేవలం ఒక నెల అంటే జూలై 31వ తేదీ వరకూ మాత్రమే గడువు ఇచ్చినట్టు సమాచారం. దీంతో తర్జనభర్జన పడుతున్నారు. ఈ ప్రాజెక్టును నిలుపుకోగలమా లేదా అనే డైలమా పట్టిపీడిస్తోంది.

'జయలలిత మరణంపై సీబీఐ దర్యాప్తు' పిటిషన్..

▸▸ తమిళనాడు సర్కారుకు హైకోర్టు నోటీసులు

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా, చెన్నై అపోలో ఆసుపత్రిలో మాజీ సీఎం జయలలిత చికిత్స పొందిన సమయంలో నెలకొన్న ఘటనలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. అనారోగ్యం కారణంగా, 2016 సెప్టెంబరు 22వ తేదీ రాత్రి 10.25 గంటలకు అపోలో ఆసుపత్రిలో చేరిన జయ.. డిసెంబరు 5వ తేది రాత్రి 11.30 గంటలకు మృతిచెందినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జరిగిన ఘటనలు పలు సందేహాలకు తావిస్తున్నాయని, అందువల్ల హైకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తునకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ అన్నాడీఎంకే సభ్యుడు రామ్‌కుమార్ ఆదిత్యన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జయ మృతిపై ప్రకటన వెలువడక ముందే ఆమె శరీరానికి ఎంబ్లామింగ్‌కు సంబంధించి సూచనలిచ్చారని, జయ ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి యాజమాన్యం తప్పుడు సమాచారం ఇవ్వాల్సివచ్చిందనే ఆరోపణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఈ మొత్తం వ్యవహారంపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ .. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

నవోదయ విద్యాలయాల్లో టాటామోటార్స్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు

ముంబై, జూలై 15: జవహర్ నవోదయ విద్యాలయాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సోమవారం టాటా మోటార్స్ సంస్థ ప్రకటించింది. నైపుణ్యాభివృద్ధికి అవసరమైన వొకేషనల్ కోర్సులను ఏర్పాటు చేయాలనే జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యానికి అనుగుణంగా నవోదయ విద్యాలయ సమితి భాగస్వామ్యంతో వీటిని స్థాపించినట్లు పేర్కొంది. వీటి ద్వారా ప్రతి ఏడాది 4 వేల మంది విద్యార్థులకు ఆటోమోటివ్ రంగంలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. దీనిలో 30 శాతం మంది ఆడపిల్లలు ఉండేటట్లు చూసుకుంటామని తెలిపింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు పలు జవహర్ నవోదయ విద్యాలయాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు, పరికరాలతో 25 ల్యాబులను ఏర్పాటు చేసినట్లు చెప్పింది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు నవోదయ విద్యాలయ సమితి, టాటా మోటార్స్ సంయుక్తంగా ధ్రువపత్రాన్ని అందజేస్తాయని, అలాగే వారు తమ కంపెనీలో మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సును ఎంచుకోవచ్చని టాటా మోటార్స్ సీఎస్ఆర్ అధినేత వినోద్ కులకర్ణి తెలిపారు. ఆ సమయంలో వారికి పూర్తి స్టైపెండ్ ఇచ్చి ఆన్ జాబ్ ట్రైనింగ్ ఇస్తామని, అనంతరం వారు టాటా మోటార్స్‌తోనే కొనసాగాలనుకుంటే ఎంపిక చేసిన విద్యాలయాల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసేలా తోడ్పాటునందిస్తామని చెప్పారు.

విమానం రద్దు.. మీ చావు మీరు చావండి!

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని ఇండిగో సంస్థ

ముంబై ప్రయాణికులకు తీవ్ర కష్టాలు

విదేశాలకు వెళ్లాల్సినవారికి మరిన్ని ఇబ్బందులు

సంస్థ తీరుపై చాలా కాలంగా ఫిర్యాదులు

విజయవాడ, జూలై 15((ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నుంచి ముక్కుపిండి మరీ చార్జీలు వసూలు చేస్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ ప్రయాణికుల అవసరాలను గుర్తించటంలో విఫలమవుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైకి విమాన సర్వీసు విషయంలో సాంకేతిక లోపాలు తలెత్తిన నేపథ్యంలో, ఆదివారం విమానయాన సంస్థ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. విమానాలకు సాంకేతిక సమస్యలు ఏర్పడితే ఏ విమానయాన సంస్థ అయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతుంది. ఇండిగో సంస్థ మాత్రం ఏకంగా విమాన సర్వీసును రద్దు చేసి, ప్రయాణికులకు ప్రత్యామ్నాయం సంగతిని గాలికొదిలేసింది. గత కొంతకాలంగా ఇండిగో సిబ్బంది తీరు పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రయాణికులతో ఫ్రెండ్లీగా ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. తాజాగా ఆదివారం ఇండిగో వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ముంబైకి విమాన సర్వీసు రద్దు విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. మన దేశం నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే డెస్టినేషన్ విమానాశ్రయాలలో ముంబై, ఢిల్లీ విమానాశ్రయాలు ఉన్నాయి. ముంబైకి విమాన సర్వీసు బుక్ చేసుకున్నవారిలో దాదాపు సగంమంది అక్కడి నుంచి విదేశాలకు వెళ్లేవారుంటారు. ముంబై సర్వీసు రద్దయితే విదేశాలకు వెళ్లే విమానాన్ని అందుకోలేని పరిస్థితి నెలకొంటుంది. ఆదివారం ముంబై వెళ్లాల్సిన ఇండిగో విమానం రద్దు కావటంతో.. ముంబై నుంచి అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తదితర దేశాలకు విమాన టికెట్లు బుక్ చేసుకున్నవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్థికంగానూ నష్టపోయారు. ముంబైకి వ్యాపార పనుల నిమిత్తం వెళ్లాల్సిన వారు, అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారు కూడా ఇబ్బందులకు గురయ్యారు. 'మా విమానం రద్దయింది.. మీ చావు మీరు చావండి!' అన్న చందాన వ్యవహరించటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా ఇండిగో యాజమాన్యం తమ విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రధాని మోదీని కలిసిన హేమంత్‌సోరెన్



న్యూఢిల్లీ, జూలై 15: ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. అందుకు సంబంధించిన ఫొటోలను హేమంత్ తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేశారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇటీవల బెయిల్‌పై విడుదల అయిన హేమంత్‌సోరెన్ మరోసారి రాష్ట్ర సీఎంగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే.

ఇంటి దగ్గరే క్యాన్సర్ పరీక్ష

▸▸ త్రీడీ టెక్నాలజీతో రక్తనాళాల గుర్తింపు

▸▸ పొలంలో టొమాటోలు కోసే రోబో

▸▸ సైనికుల రక్షణ కోసం ఫైర్ సేఫ్టీ సూట్

▸▸ ఐఐటీహెచ్‌లో అద్భుత ఆవిష్కరణలు

కంది, జూలై 15: గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్ష ఇంటివద్దే చేసుకునే వీలు కల్పించే పరికరం ఉంటే? రక్త నమూనా తీసుకునేటప్పుడు కొంతమందికి రక్తనాళం దొరక్క చాలా ఇబ్బంది అవుతుంది. అలాంటి సందర్భాల్లో రక్తనాళం ఎక్కడుందో చూపించే పరికరం అందుబాటులో ఉంటే? అద్భుతమైన ఆ పరికరాలు ఎక్కడో ఊహల్లో కాదు.. సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం ఆవిష్కృతం అయ్యాయి. దేశంలోని విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానంతో ఐఐటీహెచ్‌లో జరిగిన 'ఇన్నోవేషన్ డే ఫెయిర్' ఈ సరికొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. ఈ ఉత్సవాన్ని ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులోని బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకులు.. 'సీ-కాలర్ డిటెక్షన్' పేరుతో సర్వీసెల్ఫ్ కిట్‌ను తయారుచేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షను మహిళలు ఈ కిట్ సాయంతో ఇంటివద్దే చేసుకోవచ్చు. అలాగే.. ఐఐటీహెచ్‌లోని భౌతికశాస్త్ర విభాగం పరిశోధకులు ఇన్‌ఫ్రారెడ్, ఏఐ టెక్నాలజీ ఉపయోగించి.. స్కానింగ్‌తో నరాలను కనిపెట్టే టెక్నాలజీ అభివృద్ధి చేశారు. 'త్రీడీ వెయిన్ వ్యూయర్'గా పిలిచే ఈ పరికరంతో ఒక్కసారి మన శరీరంపై స్కాన్ చేస్తే ఒంట్లోని రక్తనాళాలు స్పష్టంగా కనపడతాయి. ఇది డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో ఎక్కువ మంది పేషెంట్లకు త్వరగా ఇంజెక్షన్లు చేయడానికి, రక్త పరీక్షలు తొందరగా నిర్వహించడానికి వీలుగా ఉంటుంది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ ఉపయోగించి రోబోలతో కూడా ఇంజెక్షన్‌లు, రక్త పరీక్షలు చేయించవచ్చు. ఇక.. ఐఐటీహెచ్ ఇంక్యుబేషన్ స్టార్టప్ పరిశోధకులు ఇండియన్ నేవీతో కలిసి ట్రాడీగ్రేడ్ ఫైర్ రెసిస్టెంట్ సూట్‌ను తయారు చేశారు. 2.3 కేజీల బరుగల ఈ సూట్ 1200 డిగ్రీల వరకూ వేడిని తట్టుకుంటుంది. ప్రమాదవశాత్తు మంటలలో చిక్కుకున్నా.. ఈ సూట్ వేసుకున్న వారి ప్రాణాలకు హాని జరగదు. అగ్నిప్రమాదాలు జరిగి మంటల్లో చిక్కుకున్న బాధితులను బయటకు తీసుకురావడానికి.. అగ్నిమాపక దళాలకు ఈ సూట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే.. ఐఐటీహెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన పరిశోధకులు కూరగాయల రైతులకు ఖర్చు తగ్గించేందుకు అగ్రిబాట్ పేరుతో.. టొమాటో పంటను సంరక్షించి, టొమాటోలను కోసే యంత్రాన్ని రూపొందించారు. ఇవి కాక.. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వాతావరణ మార్పు, ఈ-మొబిలిటీ, క్లీన్‌ఎనర్జీ, స్థిరమైన సాంకేతికతలు, రక్షణకు సంబంధించి 35 రకాల ఆవిష్కరణలను ఈ వేడుకలో ప్రదర్శించారు.



క్యాన్సర్‌ను గుర్తించే సర్వీసెల్ఫ్ కిట్



కూరగాయలు తెంపడానికి ఉపయోగపడే యంత్రం

గాలిలో విమానం చక్కర్లు

▸▸ వర్షంలో ల్యాండింగ్‌కు అనుకూలించని వాతావరణం

గన్నవరం, జూలై 15: ప్రతి రోజూ హైదరాబాద్ నుంచి గన్నవరం వచ్చే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సోమవారం ల్యాండ్ అయ్యేందుకు అనుకూల వాతావరణం లేకపోవడంతో గాలిలో చక్కర్లు కొట్టింది. 120 మంది ప్రయాణికులతో విమానం మధ్యాహ్నం 12.18 గంటలకు గన్నవరం వచ్చింది. ఆ సమయంలో విమానాశ్రయ ప్రాంతంలో విపరీతమైన వర్షం కురవడంతో వాతావరణం అనుకూలించక ఐదుసార్లు గాలిలో చక్కర్లు కొట్టింది. చివరకు వెనుదిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. తిరిగి 3.29 గంటలకు గన్నవరానికి చేరుకుంది. 125 మంది ప్రయాణికులతో వెళ్లింది. మూడు గంటలు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

జయశంకర్ వర్సిటీలో

బీటెక్, బీఎస్సీ ఆనర్స్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీటెక్‌లో గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం అలాగే బీఎస్సీ ఆనర్స్‌లో రూరల్ కోటా కింద 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.


బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- ఫార్మర్స్ కోటాలో రిజర్వేషన్ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన వారై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ (కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లో రూరల్ కోటా కింద అప్లయ్ చేసుకోవాలంటే కూడా గ్రామాల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.



తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో

డిగ్రీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్‌టీవీయూ), సిద్దిపేట-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీల సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీఎస్సీ ఆనర్స్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్, తోర్నాల అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.
- ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.
- బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో 20 శాతం సీట్లను ఐకార్ కోటా కింద ప్రత్యేకించారు. వీటిని 'సీయూఈటీ(ఐకార్-యూజీ)2024' ఎగ్జామ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ల ద్వారా ఐకార్ భర్తీ చేస్తుంది.

బీవీఎస్సీ & ఏహెచ్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్ఎస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బేర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఇంటర్‌స్థాయిలో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లలో చేరాలంటే అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఆగస్టు 19
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

టీటీడీ స్విమ్స్‌లో

పీజీ, పీజీ డిప్లొమా

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్)- ఎమ్మెస్సీ, ఎంపీటీ, పీజీ డిప్లొమా, పోస్ట్ బేసిక్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పోస్ట్ బేసిక్ డిప్లొమాలో అకడమిక్ మెరిట్ ద్వారా, మిగిలిన అన్ని కోర్సుల్లో వర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



● ఎమ్మెస్సీ నర్సింగ్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్‌ల వారీగా చైల్డ్ హెల్త్ నర్సింగ్ 6, అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ నర్సింగ్ 8, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ 7, సైకియాట్రీ నర్సింగ్ 6, మెడికల్ సర్జికల్ నర్సింగ్ 6 చొప్పున మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ ఆనర్స్ నర్సింగ్/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి. అభ్యర్థులందరూ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ నుంచి నర్స్/మిడ్‌వైఫ్ గుర్తింపు పొంది ఉండాలి.

● ఎంపీటీ

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్‌ల వారీగా ఆర్థోపెడిక్స్ 9, న్యూరాలజీ 6, కార్డియోథొరాసిక్ 9, స్పోర్ట్స్ 3 చొప్పున మొత్తం 27 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ ఉత్తీర్ణతతోపాటు 2024 ఆగస్టు 31 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.

● ఇతర ఎమ్మెస్సీ కోర్సులు

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎకోకార్డియోగ్రఫీ, కార్డియాక్ క్యాథరైజేషన్ ఇంటర్వెన్షన్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో ఒక సీటు చొప్పున 2 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ ఉత్తీర్ణతతోపాటు పీజీ డిప్లొమా(ఈసీఈ&సీవీటీ) పూర్తిచేసి కనీసం మూడేళ్ల అనుభవం ఉన్నవారు/బీఎస్సీ(సీవీటీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్ కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. డయాలసిస్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 2 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(డయాలసిస్ టెక్నాలజీ)పూర్తిచేసినవారు అర్హులు. కార్డియో-పల్మనరీ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ(సీపీపీటీ) స్పెషలైజేషన్‌లో 2 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(సీపీపీటీ)/బీఎస్సీ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ/బీఎస్సీ ఉత్తీర్ణతతోపాటు పీజీ డిప్లొమా ఇన్ సీపీపీటీ చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. క్లినికల్ వైరాలజీ స్పెషలైజేషన్‌లో 2 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/జువాలజీ/బోటనీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

● పీజీ డిప్లొమా

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్ 'మెడికల్ రికార్డ్స్ సైన్స్'. ఈ ప్రోగ్రామ్‌లో 9 సీట్లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్

- ఎమ్మెస్సీ నర్సింగ్, ఎంపీటీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సంబంధిత డిగ్రీ సిలబస్ నుంచి 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు 40శాతం; బీసీ అభ్యర్థులకు 35 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 30శాతం మార్కులు రావాలి.
- మిగిలిన కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్ నుంచి 30శాతం, లాజికల్ రీజనింగ్ నుంచి 30శాతం, బయాలజీ నుంచి 20 శాతం, ఫిజికల్ సైన్సెస్ నుంచి 20శాతం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఉంటాయి. పరీక్ష సమయం గంటన్నర. వీరికి క్వాలిఫయింగ్ కటాఫ్ లేదు. అకడమిక్ మెరిట్‌కు 80 శాతం, ఎంట్రెన్స్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

● పోస్ట్ బేసిక్ డిప్లొమా(నర్సింగ్)

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌ల వారీగా కార్డియాక్ ఇంటెన్సివ్ కేర్ అండ్ క్యాథరైజేషన్ ల్యాబొరేటరీ నర్సింగ్ 6, సీటీ సర్జరీ నర్సింగ్ 6, పెరిటోనల్ డయాలసిస్ నర్సింగ్ 2, హేమో డయాలసిస్ నర్సింగ్ 2, రెనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నర్సింగ్ 2, అంకాలజీ నర్సింగ్ 5 చొప్పున మొత్తం 23 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు సమయంలో నెలకు రూ.5000ల స్టయిపెండ్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,900; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,956
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** ఆగస్టు 8
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 19
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** పోస్ట్ బేసిక్ డిప్లొమాకి ఆగస్టు 19న; ఎమ్మెస్సీ నర్సింగ్‌కి ఆగస్టు 22; ఎంపీటీ సహా మిగిలిన కోర్సులకు ఆగస్టు 24న
- **కౌన్సెలింగ్:** ఎమ్మెస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ డిప్లొమా ప్రోగ్రామ్‌లకు ఆగస్టు 31న, మిగిలిన కోర్సులకు సెప్టెంబరు 4న
- **తరగతులు ప్రారంభం:** ఎమ్మెస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ డిప్లొమా ప్రోగ్రామ్‌లకు సెప్టెంబరు 11 నుంచి, మిగిలిన కోర్సులకు సెప్టెంబరు 23 నుంచి
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, అలిపిరి రోడ్, తిరుపతి-517507
- **వెబ్‌సైట్:** https://svimstpt.ap.nic.in

నల్సార్ వర్సిటీలో

రాజ్యాంగంపై బేసిక్ కోర్సు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా- భారత రాజ్యాంగానికి సంబంధించి 'ఆన్‌లైన్ బేసిక్ కోర్సు'ను అందిస్తోంది. భారత రాజ్యాంగంపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. పాఠశాల విద్యార్థులు, కాలేజీ స్టూడెంట్స్, పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న ఉద్యోగార్థులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. ఈ కోర్సును తెలుగు మాధ్యమంలో నిర్వహిస్తారు. పదోతరగతి ఉత్తీర్ణులైనవారందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

కోర్సు వివరాలు

'సామాజిక, రాజకీయ న్యాయపత్రం'గా పరిగణించే భారత రాజ్యాంగంలోని పలు అంశాలను రికార్డెడ్ సెషన్స్ ద్వారా వివరిస్తారు. ముసాయిదాకు సంబంధించిన సంక్షిప్త చరిత్ర, రాజ్యాంగ మౌలిక స్వరూపం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ఫెడరల్ వ్యవస్థ, కాలగమనంలో సంభవించిన మార్పులు, సమకాలీన సమస్యలు తదితరాలపై మొత్తం 32 వీడియో సెషన్స్ ఉంటాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వీటిని యాక్సెస్ చేసుకునేందుకుగాను లాగిన్ ఐడీ ఇస్తారు. ఈ సెషన్స్‌ను కాపీ చేయడం, డౌన్‌లోడ్ చేయడం సాధ్యం కాదు. కోర్సు చివరలో ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వచ్చినవారికి మాత్రమే 'కోర్సు కంప్లీషన్ సర్టిఫికెట్' ఇస్తారు. అంతకన్నా తక్కువ మార్కులు వచ్చినవారికి 'పార్టిసిపేషన్ సర్టిఫికెట్' ఇస్తారు. అభ్యర్థులకు సర్టిఫికెట్ సాఫ్ట్ కాపీలను ఈ-మెయిల్ ద్వారా పంపుతారు. ప్రింట్ కాపీలు ఇవ్వరు.

ముఖ్య సమాచారం

- కోర్సు ఫీజు: రూ.1500
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఆగస్టు 5
- లాగిన్ ఐడీ ఇచ్చే తేదీ: ఆగస్టు 10న
- కోర్సు ప్రారంభం: ఆగస్టు 10 నుంచి
- ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: డిసెంబరు 8న
- సర్టిఫికెట్ కాపీని అభ్యర్థుల ఈ-మెయిల్‌కు పంపు తేదీ: డిసెంబరు 20
- వెబ్‌సైట్: www.nalsar.ac.in, www.nalsarpro.org

ఎన్ఏబీఐలో

రీసెర్చ్ ప్రోగ్రామ్

మొహాలీలోని నేషనల్ అగ్రి ఫుడ్ బయోటెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఏబీఐ)- పీహెచ్‌డీ (బయోటెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఫరీదాబాద్‌లోని రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ) డిగ్రీని ప్రదానం చేస్తుంది. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు ఇంటర్వ్యూ, వైవా నిర్వహించి మెరిట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

రీసెర్చ్ విభాగాలు

అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, ఫుడ్ బయోటెక్నాలజీ, న్యూట్రిషన్ బయోటెక్నాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, నానోబయోసైన్సెస్, పోస్ట్-హార్వెస్ట్ టెక్నాలజీ, ఫంక్షనల్ ఫుడ్స్, జినోమిక్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంఫార్మా/ఎంవీఎస్సీ/ఎంబీబీఎస్/(ఎమ్మెస్సీ/ఎంటెక్)(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 5 శాతం మినహాయింపు వర్తిస్తుంది. యూజీసీ/సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/డీఎస్‌టీ/డీబీటీ ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి. గేట్ అర్హత ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి మెరిట్ ఆధారంగా ఎన్ఏబీఐ కోర్ ఫెలోషిప్ లభిస్తుంది.

ముఖ్య సమాచారం


- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 5
- **ఇంటర్వ్యూలు:** ఆగస్టు 21, 22
- **వెబ్‌సైట్:** nabi.res.in




తగిన శాస్తి

రామాపురంలో క్రిష్ణయ్య అనే యువకుడు ఉండేవాడు. అతను ఎంతో తెలివైన వాడు ఇంకా సాహసవంతుడు కానీ చాలా దురాశాపరుడు ఒక రోజు ఆ ఊరిలో రామనాథం అనే వ్యాపారి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రాణ నష్టం ఏమీ లేకున్నా, ఇంటి లోపలి విలువైన వస్తువులు కాలి బూడిదవుతున్నాయి. ఇంతలో అక్కడికి వచ్చిన రామనాథం వ్యాపారానికి కావల్సిన డబ్బు నాలుగు లక్షలు లోపల పెట్టాను అది కూడా బూడిదైతే ఎలా అని పెద్దపెట్టున ఏడవసాగాడు. ఇంతలో అక్కడికి వచ్చిన క్రిష్ణయ్య 'రామనాథం గారూ మీ డబ్బు లోపలి నుండి నేను క్షేమంగా తెచ్చి ఇస్తాను. కానీ తెచ్చిన డబ్బులో నాకు ఇష్టమైనది మీకు ఇచ్చి మిగతాది నేను తీసుకుంటాను. సరేనా? సరే అన్నాడు రామనాథం. అప్పుడు క్రిష్ణయ్య ఎంతో ధైర్యంగా లోపలికి వెళ్లి, డబ్బుమూట బయటకు తెచ్చాడు కానీ, తెచ్చిన సొమ్ములో వంద రూపాయలు మాత్రం రామనాథానికి ఇచ్చి, మిగతా డబ్బు మొత్తం తన సంచీలో వేసుకుని, వెళ్లబోయాడు. ఇది అన్యాయం అని క్రిష్ణయ్యను ఆపాడు రామనాథం. 'నేను చెప్పినట్లే కదా చేశాను ఇంకేం అన్యాయం'అన్నాడు క్రిష్ణయ్య. విషయం పంచాయితీ దాకా వెళ్లింది, పంచాయితీ పెద్ద కేశవరావు జరిగినదంతా విని, క్రిష్ణయ్యతో ఇలా అన్నాడు.'క్రిష్ణయ్యా ఆ డబ్బుమూట మరియు వంద రూపాయలు చెరోవైపున పెట్టు' అన్నాడు. అలాగే చేశాడు క్రిష్ణయ్య. ఇప్పుడు చెప్పు క్రిష్ణయ్యా ఈ రెండిటిలో నీకు ఇష్టమైనది ఆ పెద్ద డబ్బు మూటనే కదా అని అడిగాడు. అవును అని జవాబు చెప్పాడు క్రిష్ణయ్య. 'నువ్వు నీకు ఇష్టమైనది రామనాథానికి ఇస్తాను అని కదా అన్నావు? కాబట్టి మారు మాట్లాడకుండా ఆ డబ్బు మూటను అతనికి ఇచ్చేసి, అతను సంతోషంగా ఎంత ఇస్తే అంత పుచ్చుకో' అన్నాడు కేశవరావు దానికి క్రిష్ణయ్య 'నా ఉద్దేశం అది కాదు నాకు ఇష్టమైనది అంటే నాకు నచ్చినంత అని అర్థం' అన్నాడు. దానికి కేశవరావు 'నీ ఉద్దేశం మంచిదైతే ఈ గొడవే లేదు కదా. నువ్వు తెలివైనవాడివి.. కానీ ఈ దురాశ మంచిది కాదు మానుకో అని హితవు చెప్పి, అతన్ని అక్కడినుండి పంపేశాడు పంచాయితీ పెద్ద. అతని దురాశకు తగిన శాస్తి జరిగిందని అందరూ అనుకున్నారు.

10 తేడాలు గుర్తించండి!






దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 359

			6	7			1	3
				5			2	
					3	4		
	3				7			2
7		4				5		8
5			4				6	
		8	9					
	2			8				
6	9			3	1			

సుడోకు - 358 సమాధానం

5	6	9	7	1	3	4	8	2
2	1	8	5	9	4	3	7	6
4	7	3	8	2	6	5	9	1
7	3	1	2	5	8	6	4	9
6	9	4	1	3	7	8	2	5
8	2	5	6	4	9	1	3	7
3	4	2	9	6	5	7	1	8
9	8	6	3	7	1	2	5	4
1	5	7	4	8	2	9	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.